అపరాధ పరిశోధన

రూ.6 | జూన్ '85



Blank Page

సంపుటి: 40 ఫోన్ నెం: 64843

సంచిక: 5

[illegible]

[illegible] మాస పత్రిక

ఏడాది చందా (పత్రిక లేదా సప్లిమెంట్) 72 రూపాయలు.

హోమ్ డెలివరీ (పత్రిక మరియు సప్లిమెంట్) 10 రూపాయలు.

జూన్, 1985

మేనేజింగ్ ఎడిటర్:

శ్యామ దామోదర్ రెడ్డి

అసిస్టెంట్ ఎడిటర్:

డి. రవికుమార్

సీనియర్ ఎడిటర్స్:

వి. ఎస్. చెన్నూరి

ఏ. వీ. మోహన్రావ్

ఆర్. ప్రభాకర్

బొమ్మిడి అచ్చారా

అపరాధ పరిశోధన పోటీ-201
[ఫలితాలు]

ఏప్రెల్ '85 నెల "అపరాధ పరిశోధన పోటీ - 201" కి సరియైన సమాధానాలు:

1. నాదెండ్ల భాస్కరరావు.
2. కీచకుడు.
3. టెలివిజన్.
4. క్రికెట్.
5. ఒంటెద్దు బండ్లు.

పై జవాబుల ప్రకారం ముగ్గురు పాఠకులు మాత్రమే ఆల్ కరెక్టుగా పంపారు. వీరికి జూలై '85 నెలనుండి ఒక ఏడాదిపాటు "అపరాధ పరిశోధన" మాసపత్రిక లేదా సప్లిమెంట్ (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్) బహుమతిగా పంప బడుతుంది.

(1) శ్రీమతి ఎమ్. సరిత,
D/O ఎమ్. పాండురంగ విఠల్,
స్వరాజ్య టాకీసు వద్ద (నూనె గానుగ)
తెనాలి, గుంటూరు జిల్లా.

(2) శ్రీమతి కె. శశికళ,
C/O మంగళూరు డ్రెసెస్,
ఎమ్.జి. రోడ్,
విజయనగరం—531 202.

(3) శ్రీ వి. జగదీష్,
8-4-32, శ్రీ కిషన్ కాలనీ,
వరంగల్—506 002.

ఈ నెలలో...

కథలు (మాస పత్రిక)

4. ఎలక్ట్రానిక్ హాస్పిటల్—వసుంధర
24. రాజమండ్రి రాక్షసుడు—స్వరూప్
39. హృద్రోగ నిపుణుడు—బొమ్మిడి అచ్చారావు
58. పాప భీతి—జొన్నలగడ్డ రామలక్ష్మి
78. హనుమంతు గురక—చంద్రశేఖర అజాద్
92. కాలిన కనుబొమలు—కె. వి. రమణ
1 9. గూఢపుఠాణి—విశ్వమోహిని
138. దొంగల రాణి—తిరుమలశ్రీ
155. హంతకుడి ఫోటో—కె.వి. రమణ
175. కాంచన శిఖరం (సీరియల్)—ఏ. వీ. మోహన్రావ్

నవలలు (సప్లిమెంట్)

3. అర్హతలేని అదృష్టం—వసుంధర
49. టక్కరి దొంగ - చక్కనిచుక్క—ప్రతాప్ రవిశంకర్
89. ప్రేమించిన యువతి—టెంపోరావ్
123. మతి తప్పిన ఆఫ్రికా ఏనుగు—కె.వి. రమణ
165. అగ్ని కిరీటం (సీరియల్)—ప్రతాప రవిశంకర్

ఇంకా—ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ, అపరాధ పరిశోధన పోటీ, కార్టూన్లు, మరెన్నో ఆకర్షణలు!!!

ఎలక్ట్రానిక్ హాస్పిటల్

వసుంధర

సేఠ్ గోపాలదాస్ దుకాణంలో మెత్తని పరుపుమీను కూర్చుని ఉన్నాడు. అతడి ముందు ఇద్దరు కస్టమర్లు కూర్చున్నారు. వాళ్లేదో ఖరీదైన హారానికి ఆర్డరివ్వబో తున్నారు. గోపాలదాస్ వాళ్ళకు మోడల్సు చూపిస్తూ అవి

చూపినపుడు వాళ్ళ ముఖభావాలు గమనిస్తూ వాటినిబట్టి ఆ మోడల్సు గుణగణాలు వర్ణిస్తున్నాడు.

అప్పుడా దుకాణంలోకి ఓ యువకుడడుగు పెట్టాడు. సన్నగా పొడుగ్గా ఉన్న ఆ యువకుడి వయసు పాతికేళ్ళు దాటకపోవచ్చు. ముఖంలో గొప్ప చురుకుతనం ప్రస్ఫుటం చేసే కళ్ళొక పెద్ద ఆకర్షణ. అతడి చేతిలో ఓ టేపు రికార్డరుంది.

"ఏం కావాలిసార్?" అంటూ ఇద్దరు సేల్సుమన్ అతణ్ణి చుట్టుముట్టారు. అతడు వారిని పట్టించుకోకుండా—గోపాలదాస్ వైపు నడిచి—"నమస్కారమండీ!" అన్నాడు.

గోపాలదాస్ తలెత్తి చూపి—"నువ్వా—దిలీప్-ఏమిటి పని?" అన్నాడు.

"మీతో అర్జంటుగా లోపల మాట్లాడాలి...." అన్నాడు దిలీప్.

"అయితే ఒక్క నిముషమాగు. వీళ్ళ ఎన్నిక పూర్తి కానీ...." అన్నాడు గోపాలదాస్.

దిలీప్ హారం ఎన్నిక పూర్తయ్యేదాకా నిలబడే ఉన్నాడు. తర్వాత ఇద్దరూ లోపలకు వెళ్ళారు.

అది ఎయిర్ కండిషన్డు గది. చల్లగా ఉంది. గదిలో గోడవారగా మెత్తటి పరుపులు, వాటికానుకుని కూర్చునేందుకు వీలుగా దిండ్లు ఉన్నాయి. ఒక మూలగా పెద్ద ఇనప్పెట్టె. ఇనప్పెట్టెమీద లక్ష్మి విగ్రహం.

గోపాలదాస్, దిలీప్—ఇద్దరూ గదిలో ప్రవేశించే ముందే చెప్పులు విడిచారు. అక్కడ ఒకరికొకరు ఎదురుగా కూర్చున్నారు.

"ఏమిటాపని?" అన్నాడు గోపాలదాస్.

"మొన్న మా యింటి కొచ్చినపుడు—మీకు సంగీత

మంటే చాలా ఇష్టమని చెప్పారు. అందులోనూ త్యాగరాజ కృతి—"సామజవరగమన"—కోసం మీరు చెవికోసు కుంటానని చెప్పారు...." అన్నాడు దిలీప్.

దిలీప్ తండ్రి కాలేజీలో లెక్చరర్. గోపాలదాస్ కొడుకు ఆయన స్టూడెంట్. ఒకసారి గోపాలదాస్ కొడుకు క్లాసులో ఓ అమ్మాయిపట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దిలీప్ తండ్రి అప్పుడది చూసినా అతడినేమీ అనకుండా—అప్పటికప్పుడు గోపాలదాస్‌కి ఫోన్ చేసి జరిగింది చెప్పి—"ఏం చేయాలో మీరే నిర్ణయించుకోండి"—అన్నాడు.

అప్పుడు గోపాలదాస్ స్వయంగా కాలేజీకివచ్చి కొడుకు చేత ఆ అమ్మాయికి క్షమార్పణలు చెప్పించి- "పిల్లల అల్లరి తలిదండ్రుల బాధ్యత. మా అబ్బాయి మరోసారి నన్నిలా కాలేజికి రప్పించి తలవంపుల పాలుచేయడని ఆశిస్తున్నాను—" అన్నాడు.

అతడి సంస్కారానికి దిలీప్ తండ్రి ఆశ్చర్యపోయి ఆ రోజే తనింటి కాహ్వానించాడు. ఇంట్లో ఆయన తన కొడుకునీ, కూతుర్నీ గోపాలదాస్‌కి పరిచయం చేశాడు. గోపాలదాస్ దిలీప్‌నీ, అతడి చెల్లెల్నీ మెచ్చుకుని—"మీ పిల్లల్ని చూస్తుంటే మీ పెంపకం చాలా గొప్పగా ఉందని పిస్తుంది—" అన్నాడు.

అప్పుడే ఆయన తన అభిరుచులు కూడా చెప్పడం సంభవించింది.

"అవును- నీకు బాగా గుర్తుందే!" అన్నాడు గోపాలదాస్.

"ఇప్పుడా పాటను నా చెల్లెలిచేత పాడించి రికార్డు చేయించి తెచ్చాను. మీరు వినాలి!" అన్నాడు దిలీప్.

గోపాలదాస్ ముఖంలో విసుగు కనబడింది-"ఇప్పుడా?"

అన్నాడు.

"అవునండి...." అన్నాడు దిలీప్ వినయంగా.

"బిజినెస్ అవర్స్‌లో నేను సంగీతం వినను...." అన్నాడు గోపాలదాస్.

"ఇది మామూలు సంగీతం కాదండి. ఇంతవరకూ ఎవరిపాటా కలిగించని అనుభూతి ఈ పాట మీకు కలిగిస్తుంది ..."అన్నాడు దిలీప్.

గోపాలదాస్‌కు లోపల చిరాగ్గావుంది. అర్జంటుపనంటే ఇంకా ఏమో అనుకున్నాను. అవతల బేరగాళ్ళొస్తూ పోతూంటే ఇతదేమో పాట వినమంటాడేమిటీ? అతడింకా ఆలోచిస్తూండగానే దిలీప్ మళ్ళీ "సార్ నేను ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్ని. స్వయంగా ఏదో సాధిద్దామనుకుంటున్నాను. చెప్పాలంటే ఇది నేను చేస్తున్న తొలి ప్రయోగం. అందుకే ఉండబట్టలేక ఉన్నపళంగా మీ దగ్గరకొచ్చేశాను." అన్నాడు.

"సరే - పాట వినిపించు" అన్నాడు గోపాలదాస్. అతడిని వదిలించుకోవాలన్న ధోరణే ఎక్కువగా ఆయన మాటల్లో ధ్వనించింది.

దిలీప్ టేపురికార్డర్ ఆన్ చేశాడు.

ముందుగా ఆలాపన. ముందు అన్యమనస్కంగానే వినబోయినప్పటికీ కొద్ది క్షణాల్లోనే గోపాలదాస్ తల ఉత్సాహంగా ఊగడం ప్రారంభించింది. ఆయన ముఖంలో ఉత్సాహం. కదలికలో ఆనందం కనబడింది.

దిలీప్ ఆ గదిలోంచి బయటకు వచ్చాడు.

దుకాణంలో ఎవరూ లేరు. సేల్స్‌మన్లిద్దరూ కబుర్లు చెప్పుకుంటున్నారు. దిలీప్ వాళ్ళను పలకరించి "సేఠ్‌జీ క్యాష్ తీసుకుని రమ్మన్నారు...." అన్నాడు.

"ఇప్పుడా?" అన్నాడో సేల్సుమన్ ఆశ్చర్యంగా.

"అవును...."

"ఎందుకో?" అన్నాడింకో సేల్సుమన్.

"నేనాయన్ను డబ్బడిగాను...."

"ఎంత?"

"పాతికవేలు!"

సేల్సుమన్లిద్దరూ ఆశ్చర్యంగా అతడివైపు చూశారు.

"సేఠ్‌జీ ఎప్పుడూ దుకాణంలో అప్పులివ్వరే!" అన్నాడొకడు.

"నాకంతా ప్రత్యేకం. అనవసరపు ప్రశ్నలు వేయకుండా డబ్బాయన ముందు పెట్టి వెళ్ళండి. ఆయన్ను డిస్టర్బ్ చేయవద్దు." అన్నాడు దిలీప్.

అక్కడ గల్లాపెట్టిలో ముప్పైవేలుపై చిలుకుంది. అందులోంచి పాతికవేలు తీసి ఓ సేల్సుమన్ లోపలకు వెళ్ళాడు.

లోపల పాట ఇంకా నడుస్తోంది. గోపాలదాస్ చాలా ఉత్సాహంగా ఊగిపోతున్నాడు. సేల్సుమన్ ఆయన్ను పలకరించాలనుకున్నాడు. ఆయనతణ్ణి చూశాడు. ఆ చూపులో అలౌకికానందముంది.

సేల్సుమన్ డబ్బాయనముందు పెట్టాడు. ఆయన్ను పలకరించాలంటే అతడికి భయంవేసింది. బయటకు వచ్చేశాడు.

సేల్సుమన్ బయటకురాగానే దిలీప్ లోపలకు వెళ్ళాడు. గోపాలదాస్ ఎదురుగా ఉన్న డబ్బుతీసుకుని పాంటు జేబులో పెట్టుకున్నాడు. అప్పుడు టేపు రికార్డర్ స్విచాఫ్ చేశాడు

"అరే!" అన్నాడు గోపాలదాస్.

"ఊరికే మీకు మచ్చు చూపించాలని వినిపించాను. బిజినెస్ అవర్సులో మీరు పాటలు వినరుగదా!" అన్నాడు దిలీప్.

"అవన్నీ తర్వాత మాట్లాడుకుందాం. ముందు పాట వినిపించు...." అన్నాడు గోపాలదాస్.

"మీరు నిజంగానే అడుగుతున్నారా?"

"ప్రశ్నలు వేయకు. ఆగలేను. త్వరగా వినిపించు...."

దిలీప్ స్విచాన్ చేశాడు. పాట మళ్ళీ కొనసాగింది

"ఆహా"—అన్నాడు గోపాలదాస్ ఉత్సాహంగా. ఆయనతోపాటే దిలీప్ కూడా పూర్తిగా పాటవిన్నాడు. ఇంకో పది నిముషాలసేపు వచ్చింది పాట.

పాట అయిపోగానే దిలీప్ టేపురికార్డ్ స్విచాఫ్ చేశాడు.

గోపాలదాస్ భారంగా నిట్టూర్చి—"అప్పుడే అయి పోయింది. ఇలాంటి అనుభవం అపూర్వం" అన్నాడు.

"మరి నాకు సెలవిప్పించండి...." అన్నాడు దిలీప్.

గోపాలదాస్ దిలీప్ చేయిపట్టుకుని "ఈ టేపురికార్డర్ నా కమ్మేసేయ్. ఎంతడబ్బు కావాలన్నా ఇస్తాను ..." అన్నాడు.

"రికార్డర్లో ఏమీ లేదండి. అంతా పాటలోనే వుంది. అది మీకోసమని ప్రత్యేకంగా తయారుచేయబడింది." అని "అందుకు నా ఎలక్ట్రానిక్స్ బుర్ర కూడా ఉపయోగించాను." అన్నాడు దిలీప్.

"చాలా గొప్పబుర్ర నీది!" అన్నాడు గోపాలదాస్.

దిలీప్ లేవగానే ఆయనకూడా అతడితోపాటు లేచాడు. "పోనీ ఆ రికార్డరూ, కాసెట్ నా దగ్గర వదిలేయ కూడదూ" అన్నాడు.

"దీంతో ఇంకా నాకు పనుందండి. తర్వాత తప్పకుండా

మీకిది ఇచ్చుకుంటాను." అన్నాడు దిలీప్.

"గొప్ప సంగీతం వినిపించావు. నీకు నేను కృతజ్ఞుణ్ణి" అన్నాడు గోపాలదాస్.

ఇద్దరూ గదిలోంచి బయటకు వచ్చారు. దిలీప్ వెళ్ళిపోతూంటే గోపాలదాస్ మళ్ళీ - "నీకు కృతజ్ఞుణ్ణి—" అన్నాడు.

"దాందేముందిసార్!" అని వెళ్ళిపోయాడు దిలీప్.

తమ యజమాని అప్పిచ్చి కృతజ్ఞతలు చెప్పడంలోని రహస్యమేమిటో అర్థంకాక సేల్సుమన్లిద్దరూ తెల్లముఖాలు వేశారు.

2

రామ్మూర్తి కాలరుద్రుడిలాగున్నాడు.

ఇంట్లో దొంగతనం జరిగింది. అయిదువేలు విలువచేసే బంగారపు గొలుసుపోయింది. ఆ దబ్బాయనకు లక్ష్యం లేదు. కానీ దొంగతనాన్ని అలక్ష్యంచేస్తే ప్రమాదం కదా!

ఇంట్లో నలుగురు పనివాళ్ళకా గొలుసుతీసే అవకాశముంది. నలుగురికీ ఆయన ఓ గంట టైమిచ్చాడు. గంటలో నిజం బైటపడకపోతే వాళ్ళ రక్తం కళ్ళజూస్తానంటున్నాడాయన. ఆయన విధించిన గడువుకింకా అరగంట గడువుంది. అయినా అసహనంగా ఉన్నాడాయన. తనిచ్చిన గడువు సమయం పూర్తిగా వినియోగించుకోవడమంటే — పనివాళ్ళకు తనంటే అలక్ష్యం ఏర్పడినట్లే!

ఆ ఉద్రిక్త వాతావరణంలో అడుగుపెట్టాడు దిలీప్. గుమ్మంలోనే రామ్మూర్తి పెద్దకొడుకెదురయ్యాడు. అతడు దిలీప్ వయసువాడు.

"గురూ! లోపలకురాకు. నేనే బయటకు పోతున్నాను. ఇంట్లోపరిస్థితి చాలా ప్రమాదకరంగాఉంది" అన్నాడతడు.

"ఎందుకని!"

"నాన్నగారు కాలరుద్రుడిలాగున్నారు...."

"మరి నేనాయన్ను కలుసుకోవాలనే వచ్చాను...."

"అదింకోసారికి వాయిదావెయ్యి."

"వీల్లేదు. చాలా అర్జంటుపని." అన్నాడు దిలీప్.

"ఆ పనేమిటో చెప్పు"

"ఘంటసాల పుష్పవిలాపం పద్యాలు మీ నాన్నగారి కోసం ప్రత్యేకంగా రికార్డు చేసి తెచ్చాను" అన్నాడు దిలీప్.

"కొంపముంచావు. ఇప్పుడాయన మనుషుల్నే కాల రాచేలా ఉన్నారు. నువ్వేమో పువ్వులగోల వినిపిస్తావా? ఈ మాట వింటనే ఆయన మండిపడతారు."

"నువ్వెక్కడ దొరికావుగురూ! కలెక్టరాఫీసులో ప్యూన్లాగా నన్ను మీ నాన్నగార్ని చూస్తానంటే చూడనివ్వ వేం!" అన్నాడు దిలీప్ విసుగ్గా.

"ఇంట్లోవాళ్ళవమానపడితే నాకు బాధలేదు. మా ఇంట్లో నీ కవమానం జరక్కూడదన్నది నా కోరిక." అన్నాడు రామ్మూర్తి పెద్దకొడుకు.

"ఆయన కూడా నాకు పితృసమానులు. ఆయనంటే నేనూపడతగ్గవాణ్ణే...." అంటూ లోపలకు నడిచాడు దిలీప్.

దిలీప్ తండ్రి, రామ్మూర్తి చిన్ననాటిస్నేహితులు. ఒకటో తరగతి నుంచి గ్రాడ్యుయేషన్ దాకా ఇద్దరూకలిసే చదువుకున్నారు. గ్రాడ్యుయేషన్‌తో రామ్మూర్తి చదువాపేసి కంట్రాక్టుల్లోకి దిగాడు. దిలీప్‌తండ్రి యూనివర్సిటీలో పోస్టుగ్రాడ్యుయేషన్ చేశాక-మళ్ళీ ఆ ఊళ్ళో కాలేజీలోనే ఉద్యోగం దొరకడానికి రామ్మూర్తి సాయపడ్డాడు.

ఇద్దరిళ్ళకూ మధ్య రాకపోకలున్నాయి. ఆత్మీయత లున్నాయి. కానీ రామ్మూర్తి ప్రాణానికీ డబ్బుకీ పెద్ద లంకె

ఉంది. అయినవాళ్ళకీ, స్నేహితులకీ ఆయన పైసా విదల్చాడు. ఎవ్వరికీ మాటసాయం తప్ప మరొకటిచేయడు.

రామ్మూర్తి పెద్దకొడుకు దిలీప్ విషయం తల్లికిచెప్పాడు. ఆమె దిలీప్‌ని సమీపించి "ఈ రోజు కాయన్ను కలుసుకోకు నాయనా! కట్టుకున్నదాన్ని నేనే హడిలి చస్తున్నాను...." అంది.

ఆ బంగారుగొలుసు రామ్మూర్తి ఆఖరి కూతురు సీతది. దానికి పదేళ్లు పోవడం దాని అశ్రద్ధవల్లేపోయింది. బయట ఆటల్లో ఎక్కడో పారేసుకుందది. అలా చెబితే ఆయన ప్రాణం తీసేస్తాడని భయపడి - గొలుసు కనబడ్డంలేదని వెతుకుతున్నట్లు నటిస్తూంటే రామ్మూర్తిలో ఆవేశంపుట్టి పనివాళ్ళమీద కనుమానం తిరిగింది. ఈ పరిస్థితినుంచి ఎలా బయటపడాలో వాళ్ళకు తెలియడంలేదు.

"నేనాయన్ను కలుసుకుంటే ఈ పరిస్థితినుంచి బయట పడవచ్చు" అన్నాడు దిలీప్ నమ్మకంగా.

"ఈ ప్రపంచంలో దేనికైనా విరుగుడుంది కానీ ఆయన కోపానికి లేదు నాయనా!" అంది రామ్మూర్తి భార్య.

"నా ప్రయత్నం నన్ను చెయ్యనివ్వండి...." అన్నాడు దిలీప్ మొండిగా.

"సరే-నీ కర్మ-" అన్నట్లు చూశారా తల్లీకొడుకు లిద్దరూ దిలీప్‌వంక. దిలీప్ వాళ్ళ చూపుల్ని పట్టించుకోలేదు.

రామ్మూర్తి తన గదిలో కూర్చుని గోడ గడియారం వంక చూసుకుంటున్నాడు తదేక దీక్షగా. ఆయన పనివాళ్ళ కిచ్చిన టైమింకా యిరవై నిముషాలుంది. అప్పుడా గది లోకి దిలీప్ అడుగుపెట్టాడు రామ్మూర్తి అతడివంక చూడ కుండానే "గదిలో కెవర్నీ రావద్దని చెప్పానా!" అన్నాడు

"నేనండీ—దిలీప్‌ని పెదనాన్నగారూ" అన్నాడు దిలీప్

ఆయన చటుక్కున తలతిప్పి-"నువ్వా? ఏమిటి పని?" అన్నాడు వీలైనంత ప్రసన్నంగా ముఖం మార్చుకుందుకు ప్రయత్నిస్తూ.

"నేనో కొత్త పరికరం కనిపెట్టాను. అదే ఈ టేపు రికార్డరు. దీన్ని ఆన్‌చేసి ఓపిగ్గా అయిదు నిముషాలువింటే మనసెలాంటి సమస్యనైనా పరిష్కరించగల్గుతుంది—" అన్నాడు దిలీప్.

"అలాంటిదేమీ నాకొద్దు. దొంగలచేత నిజం చెప్పించ గలిగిందేమైనా ఉంటే చెప్పు-" అన్నాడు రామ్మూర్తి.

"ఆ పనీ చేస్తుంది ముందిది వినండి." అంటూ దిలీప్ టేపు ఆన్‌చేశాడు. రామ్మూర్తి కాదనలేదు.

క్యాసెట్లో ఘంటసాల కంఠం ఖంగుమంది—"నేనొక పూలమొక్కకడ నిల్చి చివాలున కొమ్మవంచి గోరానెడు నంతలోన...."

రామ్మూర్తిముందు అనాసక్తంగా విన్నాడు. కానీ పద్యంలోని మొదటిచరణం పూర్తి కాకుండానే ఆయన కళ్ళు పెద్దవయ్యాయి. ముఖంలో సంతోషం కనబడింది. ఆయన దిలీప్‌కి దగ్గరగావచ్చి నేలమీదే కూర్చుండిపోయాడు.

దిలీప్ టేపురికార్డరాయన పక్కనపెట్టాడు. తను లేచి గదంతా కలయదిరిగాడు. పక్కనున్న ఓ గోడ అలమారాలో తాళంచెవులు కనబడ్డాయి. వాటితో గదిలోని ఇనప్పెట్టిని తెరిచాడతడు. అందులో లక్షరూపాయల దాకా క్యాషుంది దిలీప్ పాతికవేల రూపాయలు మాత్రం తీసుకున్నాడు. జేబులో పెట్టుకుని మళ్ళీ యినప్పెట్టి తలుపులు మూసి తాళాలను యధాస్థానంలో ఉంచి గదిలోంచి బయటకు వెళ్ళి- "ఈ రోజుకిక ఆయనేమీ అల్లరిచేయరు." అంటూ తన జేబులోంచి డబ్బుతీసి రామ్మూర్తి భార్యకు చూపించి

"ఇదాయన నా కిచ్చారు. ఎందుకిచ్చారో మీకు చెప్పను." అన్నాడు.

"డబ్బుసంగతి నాకెందుకులేగానీ—ఆయన కోపం తగ్గిందా?" అంది రామ్మూర్తి భార్య ఆత్రుతగా.

"కాసేపాగితే—నేనాయన్ని బైటకు తీసుకునివస్తాను." అంటూ దిలీప్ తిరిగి లోపలకు వెళ్ళాడు.

పుష్ప విలాపం యింకా కొనసాగుతూనే ఉంది అతడు టేపు రికార్డర్ స్విచ్ ఆఫ్‌చేశాడు. తపోభంగమైన వాడిలా ఉలిక్కిపడ్డాడు రామ్మూర్తి.

"ఊరికే మచ్చుకి వినిపించాను. మీకు టైమంటుందో ఉండదో మరి...." అన్నాడు దిలీప్ అమాయకంగా.

"ముందు పూర్తిగా నన్ను విననీయి. మిగతా విశేషాలు తర్వాత మాట్లాడుకుందాం ..." అన్నాడు రామ్మూర్తి.

ఆయన పూర్తిగా క్యాసెట్ విన్నాక దిలీప్ స్విచాఫ్ చేశాడు.

"ఎంత తొందరగా అయిపోయింది!" అన్నాడు రామ్మూర్తి నిట్టూరుస్తూ.

"మీరిలాగనుకుంటారని తెలుసు అందుకే నాకు తీరుబడి లేకపోయినా వీలు చేసుకుని మీ దగ్గరకొచ్చి యిది వినిపించాను...." అన్నాడు దిలీప్.

"యిది నా దగ్గర వదిలి వెళ్ళగలవా?" అన్నాడు రామ్మూర్తి.

"యిప్పుడు కాదు. నా కింకా దీనితో పనివుంది—" అన్నాడు దిలీప్.

ఇద్దరూ గదిలోంచి బయటకు వచ్చారు. రామ్మూర్తి ముఖంలో కొత్త ఉత్సాహం కనబడుతోంది. ఆయన భార్య ఇంకా భయం భయంగానే ఆయన వంక చూస్తూ—

"ఇంతకీ ఏం నిర్ణయించారు? అవతల పనివాళ్ళు గజగజ వణికిపోతున్నారు. పాపం—తమ కేమీ తెలియదంటున్నారు...." అంది.

"ఎందుకు?" అన్నాడు రామ్మూర్తి ఈ ప్రపంచం మరిచినవాడిలా.

"మన హారం పోయిందిగా...."

రామ్మూర్తి గుర్తుచేసుకుంటున్నట్లు— "అసలది ఎలా పోయింది? అమ్మాయి ఆటల్లోకానీ పారేసుకోలేదు గదా." అన్నాడు.

ఆయన ముఖంచూస్తే దెబ్బలాడేలా కనపడలేదు. అందుకని ఆయన భార్య ధైర్యంచేసి జరిగింది చెప్పింది. అప్పుడు రామ్మూర్తి—"సరేలే. హారం అయిదు వేలది కాబట్టి పరవాలేకపోయింది. ఇంకెప్పుడూ పిల్లకంత ఖరీదైనవి వేసి ఆటలకు పంపకు పనివాళ్ళను వాళ్ళపనులు వాళ్ళని చేసుకోమని చెప్పు...." అన్నాడు.

"ఏం మంత్రం వేశావయ్యా బాబూ—నిప్పులాంటి మనిషి మంచులా చల్లబడిపోయారు...." అంది రామ్మూర్తి భార్య ఆశ్చర్యంగా.

"ఇందులో నా మంత్ర మేమీలేదు. పెదనాన్నగారి సంగీతాభిమానం. అంతే!" అని - "మళ్ళీ మరిచిపోయి పోయిందని కంగారు పడతారు. పెదనాన్నగారు నాకు పాతికవేలిచ్చారు. గుర్తుంచుకోండి ..." అన్నాడు దిలీప్.

రామ్మూర్తి అతడి మాటలు సరిగ్గా వినకుండా - "మళ్ళీ యింకోసారి నాకు పాటలు వినిపించాలోయ్." అన్నాడు.

"మీ కిష్టమైనవన్నీ లిస్టు తయారుచేసి ఉంచండి. నేను క్యాసెట్లో రికార్డుచేసి మీ కిచ్చుకుంటాను." అన్నాడు దిలీప్.

అతడు వెళ్ళిపోతూంటే—"కుర్రాడు చాలా చురుకైన వాడు-" అంది రామ్మూర్తి భార్య మెప్పుకోలుగా.

3

తలుపు తట్టాడు దిలీప్. కొద్ది క్షణాల్లోనే ఓ యువతి తలుపు తీసింది. అతడివంక అదోలా చూసి - "ఇంట్లో యెవ్వరూ లేరు ...." అంది.

"నువ్వున్నావుగా!" అన్నాడు దిలీప్.

"ఇంట్లో ఎవ్వరూ లేరు ...." మళ్ళీ అందా యువతి.

"ఆ విషయం తెలిసే వచ్చాను." అన్నాడు దిలీప్.

"ఏం తెలుసు నీకు?"

"మీవాళ్ళంతా ఊరి కెళ్ళారు ఇంటి కాపలాకు నిన్నొదిలి. వాళ్ళంతా రేపొస్తారు. ఈరోజు నీకేమో కాలేజీకి సెలవు...."

"ఇన్ని తెలిపినవాడివి - నేను నిన్ను లోపలకు రానివ్వనని తెలుసుకోలేవూ?"

"శాంతా!" అన్నాడు దిలీప్ గంభీరంగా. "నీ మనసు నాకు తెలుసు. అందుకే ఇప్పుడొచ్చాను. నా చేతిలో ఏముందో చూడు...." అంటూ అతడు టేపురికార్డర్ చూపించి - "ఇందులో నీ కిష్టమైన భానుమతి పాటలు రికార్డు చేశాను. ఎంత గొప్పగా వచ్చిందంటే రికార్డింగు-నీతో కలిపి వినాలనిపించింది...." అన్నాడు.

"ఏం పాట లేమిటి?" అంది శాంత.

"మొత్తం నాలుగు...." అన్నాడు దిలీప్. "మనసున మల్లెలమాల లూగెనే, సావిరహే తవదీనా, పక్కాల నిలబడి, నగుమోము...."

"అయితే వినాల్సిందే....కానీ ఒక విషయం గుర్తుంచుకో. నేను పాటలు వినడంకోసం మాత్రమే నిన్ను లోప

లకు రానిస్తున్నాను." అంది శాంత.

"లోపలకు రావడమే ముఖ్యం నాకు. ఎందుకూ అన్న విషయం నువ్వు బాధించాలనుకున్నా నన్ను బాధించదు." అన్నాడు దిలీప్.

"అంటే?"

"నువ్వు నన్ను సాచి లెంపకాయ కొట్టాననుకో. నీ చేయి నన్ను తాకింది కదా అన్న ఆనంద మొక్కటే నా క్కలుగుతుంది."

దిలీప్ లోపలకు వచ్చాడు. శాంత తలుపులు వేసింది.

దూరపు వరుసలో శాంత దిలీప్‌కు మరదలవుతుంది. ఇద్దరూ ఒకరంటే ఒకరు ఇష్టపడ్డారు. వ్యవహారం పెళ్ళి మాటలదాకా వచ్చింది తను స్థిరపడేదాకా పెళ్ళిచేసుకో నన్నాడు దిలీప్. స్థిరపడ్డానికి డబ్బు కావాలి. ఎందుకంటే దిలీప్‌ది ఎలక్ట్రానిక్స్‌లో అద్భుతమైన బుర్ర. అతడు ఎలక్ట్రానిక్ హాస్పిటల్—అని ఓ దుకాణం ప్రారంభించబోతు న్నాడు. అందుకు అయిదారు లక్షల పెట్టుబడి కావాలి. అటు దిలీప్ తండ్రీ ఇటు శాంత తండ్రీ కూడా అతడి కందుకు సాయపడలేరు. అందుకే పెళ్ళికీ, స్థిరపడ్డానికీ ముడివేయద్దన్నాడు శాంత తండ్రి.

"ఎలక్ట్రానిక్ హాస్పిటల్ నా రంగుల కల. ఆ కల నిజం కావడంకోసం నే నేమైనా చేస్తాను. ఆఖరికి డబ్బున్న మామగారిని పట్టడానికి కూడా సంకోచించను. అందుకే ఎలక్ట్రానిక్ హాస్పిటలు ముందు - తర్వాతే పెళ్ళి!" అన్నాడు దిలీప్.

తన పట్టుదల యెంతటిదో తెలపడానికి అతడామాట అన్నాడు. అవి శాంత అహాన్ని దెబ్బతీశాయి. ఆమె ఈ

పెళ్ళికి నిరాకరించింది. పైగా దిలీప్ అంటే ద్వేషాన్ని పెంచుకుంది. ఆ తర్వాత దిలీప్ ఆమెతో యెన్నోమార్లు మాట్లాడాలని ప్రయత్నించినా సాధ్యపడలేదు.

ఇద్దరూ లోపల కూర్చున్నారు. దిలీప్ టేప్‌రికార్డర్ అన్ చేశాడు. భానుమతి పాట ప్రారంభమైంది.

శాంత ముందు మామూలుగానే వింది. కానీ తర్వాత ఆమెకు వళ్ళు తెలియలేదు. పాట సగంలో ఉండగా దిలీప్ ఆమెను సమీపించాడు. తన ఒడిలో ఆమె తల ఉంచుకుని ప్రేమగా ఆమె బుగ్గలు నిమిరాడు. మధ్యలో మృదువుగా ఆమె నుదుటిమీద ముద్దుపెట్టుకున్నాడు. అప్పు డెవరైనా వా రిరువురినీ చూస్తే- లైలా మజ్నూలను మించిన ప్రేమికు లనుకుంటారు.

పాటలైపోయాయి. శాంత అతడి ఒడిలోనే వుంది.

"శాంతా!" అన్నాడు దిలీప్.

"పాటలైపోయాయి...." నిట్టూర్చింది శాంత.

"నువ్విలా ఒడిలో వుంటే ఆ పాటలు నాకూ్కడా యెంతో బాగున్నాయి."

శాంత చటుక్కున అతడి ఒడిలోంచి లేచి దూరంగా జరిగింది. దిలీప్ కూడా ఆమెకు దగ్గరగా జరిగే ప్రయత్నం చేయలేదు.

"జీవితంలో ఇంత ఆనందం ఎరుగను." అంది శాంత.

"నేను కూడా!" అన్నాడు దిలీప్.

శాంత అతడివంక అదోలా చూసి—"నే చెబుతున్నది పాట గురించి."

"పాట గురించే నేనూ అంటున్నది...." అని- "నిన్ను నా ఒడిలోకి తీసుకున్నానని కోపం వచ్చిందా?" అన్నాడు దిలీప్.

"లేదు. కానీ...." అంది శాంత.

"కానీలేం లేవు. మన పెళ్ళి జరుగుతుంది. అందుకు నువ్వొప్పుకుంటావు," అన్నాడు దిలీప్.

"మరి నువ్వు డబ్బున్న మామగార్ని పడతానన్నావు." అన్నది శాంత.

"పట్టేశాను." అన్నాడు దిలీప్. "ఆయన పేరు కొండల్రావు...."

"మరి మన పెళ్ళి యెలా జరుగుతుంది?"

"కొండల్రావుకి డబ్బే కూతుళ్ళు. ఆయనకు నాకిచ్చి చేయడానికి వయసున్న కూతుళ్ళు లేరు...." అన్నాడు.

"ఎవరా కొండల్రావు?"

"కొండల్రావు పేరు తెలియదూ నీకు?" అన్నాడు దిలీప్ ఆశ్చర్యంగా.

అతడి ఆశ్చర్యానికి అర్థం లేకపోలేదు.

కొండల్రావుకి ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి పెద్ద సిటీలోనూ కనీసం ఓ థియేటరూ, ఓ హోటలూ ఉన్నాయి. ఊరగాయలు దగ్గర్నుంచి - పెలివిజన్లదాకా అన్ని రకాల పరిశ్రమలూ ఆయన చేతిలో ఉన్నాయి. తెలుగు దేశానికి ఆయనో టాటా వంటివాడు. ఆయన సంస్థనుంచి పత్రికలు కూడా వస్తుంటాయి.

"ఆ కొండల్రావా?" అంది శాంత.

"నీ కింకా ఏ కొండల్రావైనా తెలుసా?" అన్నాడు దిలీప్.

"అది కాదు. ఆ కొండల్రావు నీకు పరిచయ మెలాగయ్యాడు?"

"నేను నా ఎలక్ట్రానిక్ హాస్పిటల్ గురించి వివరించడానికి ఆయన్ను స్వయంగా కలుసుకున్నాను...." అన్నాడు

దిలీప్.

మనిషి మనసుపై మెదడుపై శబ్దతరంగాలకున్న ప్రభావం చాలా గొప్పది. వాటినే పూర్వీకులు మంత్రం పేరిట ఉపయోగించేవారు. ఎలక్ట్రానిక్సు ద్వారా శబ్దతరంగాలను అద్భుతంగా అదుపు చేయవచ్చు.

దిలీప్ ఒక కొత్త విశేషం కనిపెట్టాడు. ఒక మనిషి గొంతునుంచి వెలువడే శబ్దతరంగాలనుబట్టి అతడిపై ఏయే శబ్దతరంగా లేయే విధంగా పనిచేస్తాయో ఖచ్చితంగా అంచనా వేయవచ్చు. తను కనుగొన్న సూత్రం ఆధారంగా అతడొక స్కానర్ తయారుచేశాడు. ఎవరి గొంతైనా అందులో రికార్డుచేస్తే—ఆ వ్యక్తిని ప్రభావితం చేయగల విధంగా శబ్దతారంగాల నా యంత్రం తయారుచేయగల్గుతుంది.

"నావద్ద సేట్ గోపాలదాస్ మాటలు రికార్డయిన కాసెట్ వుంది. ఆయన కిష్టమైన పాటలు కొన్ని నా చెల్లెలిచేత పాడించి స్కానర్లో ట్రీట్ చేశాను. ఫలితంగా మనకు మామూలుగా వినిపించే ఆ పాట—ఆయనను అలౌకికానందానికి గురిచేస్తుంది. ఆ సమయంలో ఆయన పూర్తిగా ప్రపంచాన్ని మరిచిపోతాడు. ఆ సంతోషం అనుభవిస్తే తప్ప తెలియదు." అన్నాడు దిలీప్.

"అంటే?"

"టేపు రికార్డర్లో వినపడిన ఆ సంగీతం ఆ క్షణంలో ఆయనను పురుషోత్తముడిగా మార్చింది. ఆయనలో విశాల హృదయం ఏర్పడి - సంకుచిత భావాలు తొలగిపోయాయి. మామూలుగా వుండే కుళ్లు, కల్మషం ఆయన మరిచిపోతాడు ...."

"అందుకు సాక్ష్యం...."

"నువ్వే!" అన్నాడు దిలీప్.

"నేనా?" అంది శాంత ఆశ్చర్యంగా.

"నువ్వా పాట వింటూంటే నిన్ను నా ఒడిలోకి తీసుకున్నాను. బుగ్గలు నిమిరాను. ముద్దుపెట్టుకున్నాను. నామీద ద్వేషం పెంచుకున్న నువ్వు నన్నాక్షణంలో వారించలేక పోయావు. ఎందుకంటే నీలో విశాలభావాలు పెంపొందాయి."

"ఆ ప్రభావం ఎంతసేపుంటుంది?"

"కనీసం ఒకరోజు ..."

"నేను నిన్నిప్పుడు నిజంగా ప్రేమిస్తున్నాను దిలీప్! నిజంగానే నాకవి బలహీన క్షణాలు. అప్పుడు నువ్వేం చేసినా అభ్యంతరం చెప్పలేకపోయేదాన్ని. అప్పుడే ఏమిటి. ఇప్పటికీ అదే స్థితిలో ఉన్నాను. కానీ నువ్వు ఉదాత్త భావాలు కలవాడివి. అయితే ..." అని ఆగిందామె.

"అయితే?" అన్నాడు దిలీప్ ప్రశ్నార్థకంగా.

"నేను నిన్ను ద్వేషించాననుకుంటే అది నీ భ్రమ. నువ్వు నా అహంమీద దెబ్బతీశావన్న భ్రమలో కోపం వచ్చినా—నువ్వు నాకు దక్కడంలేదన్న బాధ ఉంది...."

"అది నాకూ తెలుసు. నా క్యాసెట్ పనిచేయాలంటే ఏ మనిషిలోనైనా ఆ మాత్రం బలహీనత ఉండాలి. అయితే నేను నాస్కానర్నింకా ఇంప్రూవ్ చేయాలి." అన్నాడు దిలీప్.

మనిషిని పూర్తిగా పురుషోత్తముడిని చేయడంవల్ల కూడా ప్రపంచానికే నష్టం. అల్లకల్లోలమైన మనసును శాంతపరచి తగుమాత్రం ధర్మబుద్ధినీ, విశాలభావాల్నీ అతడిలో ప్రవేశపెట్టగలిగితే ఎలక్ట్రానిక్ హాస్పిటల్ ఉద్దేశ్యం నెరవేరినట్లే!

"ఇప్పుడు నేను గోపాలదాస్ దగ్గర్నుంచి పాతికవేలూ,

రామ్మూర్తిగారి దగ్గర్నుంచి పాతికవేలూ తెచ్చాను. నా స్కానరిలా పనిచేస్తే నా బుద్ధే పెడదారులు తొక్కవచ్చు. ఎందరో దీన్ని స్వార్థానికుపయోగించుకోవచ్చు." అన్నాడు దిలీప్. అతడామెకు జరిగిన కథంతా చెప్పాడు.

శాంత ఆశ్చర్యంగా—"మరి వారిపై ఆ ప్రభావం తొలగిపోయాక వాళ్ళు నీమీద పగబట్టరా?" అంది.

"అది వారికి సాధ్యంకాదు. నేను గుర్తుకు వచ్చినప్పుడల్లా వారికి తాము పొందిన అనుభవం గుర్తుకు వస్తుంది. ఆ పాట. ఆ అనుభవం తలచుకుంటే చాలు....వాళ్ళు నామీద ఆగ్రహించలేరు. నేను వాళ్ళ టాలరెన్స్ లిమిట్ను కూడా దృష్టిలో ఉంచుకున్నాను. పాతికవేల రూపాయల నష్టాన్ని వాళ్ళు మామూలుగా భరించగలరు. సహించగలరు. అదే ఏయాభై వేలో అయితే ఆ ఆవేదన పాట అనుభవాన్ని కూడా మరిపించగల్గుతుంది...."

శాంత ఆలోచిస్తూ "ఏది ఏమైనా నువ్వు వారిని మోసం చేసి డబ్బు సంపాదించినట్లే అవుతుంది" అంది.

"కానీ ఈ డబ్బు నాకోసం కాదు. ఇది కొండ్రలావుకిస్తే ఆయన నా పరికరాలశక్తిని నమ్మి ఎలక్ట్రానిక్ హాస్పిటల్కు పెట్టుబడి ఎంతకావాలంటే అంతా యిస్తాడు." అన్నాడు దిలీప్- "ఆయనీ డబ్బును వాళ్ళకు వెనక్కిచ్చేస్తాడనుకుంటాను."

అప్పుడు శాంతకింకో అనుమానం కలిగింది.

కొండ్రలావు ఓ వ్యాపారసంస్థ. ఇలాంటి పరికరాలతో ఎవరైనా తనను మోసం చేయగలరని ఆయన భయపడవచ్చు.

"కొండ్రలావుకు సంగీతమేకాదు - ఏ లలితకళలన్నా అభిరుచిలేదు. ఆయనపై ఈ పరికరాల ప్రయోజనముండదు. లలితకళాభిరుచి వున్నవారు కొండ్రలావంతగా ఆర్థిక విజ

యాన్ని సాధించలేరు." అన్నాడు దిలీప్ - "నేనీ విషయం చెప్పేకనే ఆయన నా మిగతామాటలు విన్నాడు."

"అప్పుడాయనే ఇలా క్యాసెట్లు తయారుచేసి జనాలను మోసం చేయాలనుకుంటే...." అంది శాంత.

"అలాంటి మోసానికి నేనంగీకరించనని ఆయనకు ఖచ్చితంగా చెప్పేశాను. ఆయన పెట్టుబడి నేనంగీకరించ డానికి అదే షరతుకూడా!"

"డబ్బిచ్చేవాడికి నీ షరతులలో నిమిత్తమేమిటి? నా అనుమానం క్రమంగా ఆయన నిన్ను మోసగాడుగా మారుస్తాడని!" అంది శాంత.

దిలీప్ నవ్వి-"అన్నట్లొక విషయం నీకు చెప్పడం మరిచాను. అది చెబితే నువ్వు నన్నీ ప్రశ్న వేసి ఉండేదానివి కాదు. నీలో ఈ అనుమానమూ రేగేదికాదు...." అన్నాడు.

"ఏమిటది?" అంది కుతూహలంగా.

"కొండ్రలావు గొంతును స్కానర్లో పరీక్షించినపుడు - ఆయనకోసం కూడా ఓ క్యాసెట్ తయారుచేసి ప్రయోగించాలనుకున్నాను. కానీ ఎలా ప్రయోగించినా ఆయన కసలు విషయం తెలిసిపోతుంది. ఎట్టొచ్చీ అదృష్టదేవత నన్ను కరుణించింది."

"ఏ విధంగా?"

"కొండ్రలావును కావాలనుకున్న విధంగా ప్రభావితం చేయడానికి ఏ క్యాసెట్ అవసరంలేదు...."

"మరి?"

"నా గొంతు అందుకు సరిగ్గా సరిపోతుంది...."

శాంత తెల్లబోయి అతడివంక చూసింది. దిలీప్ ఆమె వద్ద సెలవుతీసుకుంటూ - "మన పెళ్ళి జరుగుతుందని నీ కింకే సందేహమూలేదుగదా!" అన్నాడు. □

రాజమండ్రి రాక్షసుడు

స్వరాజ్

రాజమండ్రి సెంట్రల్ జైలు ముందుకొచ్చి ఆగింది క్రీం కలర్ ఫియెట్ కారు—

వెనుకసీట్లో కూర్చున్న యజమాని నందగోపాల్‌గారి వైపు చూశాడు డ్రైవర్ విల్సన్.

"వాడు ఎన్నిగంటలకు బయటకొస్తాడో వెళ్ళి కనుక్కో." పైప్ పీలుస్తూ దర్పంగా అన్నారు నందగోపాల్.

గేటు దగ్గరున్న సెంట్రీని కలవటానిక్కి వెళ్ళాడు విల్సన్.

ఫొటోసన్ స్పెట్స్ వెనుకనున్న నందగోపాల్‌గారి కళ్ళు ఒకరకమైన వింతకాంతితో మెరుస్తున్నాయి. ఆతని హృదయాంతరాళాల్లో మమతానురాగాల వెల్లువ పొంగి పరుగులు తీస్తోంది.

ఇంతకాలానికి వాడు చీకటి ప్రపంచం నుండి బయటకు రాబోతున్నాడు చేయని నేరానికి ఇన్నేళ్ళు శిక్షనుభవించాడు. కొందరి స్వార్థానికి బలై పోయాడు. ఈ ప్రపంచంలో ఒకడి దురదృష్టం మరొకడికి అదృష్టంగా వర్తిస్తుందేమో!

అవును, వాడి దురదృష్టం యిన్స్పెక్టర్ యూసఫ్‌ఖాన్, రాజా రామానంద్‌లకు అదృష్టం....

వాడు హంతకుడు కాదని తను చేసిన ప్రయత్నాలన్నీ విఫలం అయ్యాయి. ఇప్పుడున్న డబ్బు... అధికారం ఆ రోజుల్లో వున్నట్లయితే వాడు జైలు పాలయ్యేవాడా?....

అప్పుడు—తను కేవలం రాజా రావుబహద్దూర్‌గారి కారు డ్రైవర్.

మరిప్పుడో! కొన్ని లక్షలకు అధిపతి.

ఈ పదిహేను సంవత్సరాల్లోనూ జరిగిన మార్పును చూసి వాడెంత ఆశ్చర్యపోతాడో చూడాలి.

విల్సన్ తనవైపు గబగబా వస్తుండటంతో ఆలోచనల్ని వదలి, విండో బయటకు తలపెట్టి ప్రశ్నార్థకంగా చూశారు నందగోపాల్‌గారు.

"అర్థగంటక్రితమే అమర్‌బాబుగారు విడుదలై వెళ్ళి

పోయారట సార్!" చెప్పాడు విల్సన్.

ఆ మాట వింటూనే నిరుత్సాహపడ్డారు నందగోపాల్ గారు.

"బహుశా వాడు బస్టాండుకే వెళ్ళుంటాడు. త్వరగా పోనీయ్" ఆజ్ఞాపించారు. ఓ రకమైన టెన్షన్‌తో....

డ్రైవింగ్ సీట్‌లో కూర్చుని కారుని స్టాండింగ్ వైపు పరుగులెత్తించ సాగాడు విల్సన్.

2

రాజమండ్రి బస్ కాంప్లెక్స్ ప్రయాణీకులతో గోలగా వుంది—

కళ్ళు మూసుకుని ఓ బల్లమీద కూర్చున్న అమర్ మెదడులో రొదపెడుతున్న హోరు....కొన్ని సంవత్సరాల క్రిందట మనసు మీద ముద్రపడిన నీలిరంగు నీడలకు కదలిక వచ్చి చిన్నగా కంపించసాగాడు.

ఏదో బస్సు వచ్చినట్లు పెద్దగా హారన్ వినిపించేసరికి ఉలిక్కిపడి కళ్లు తెరిచాడు అమర్.

విశాఖపట్నం బస్సు—

ప్రయాణీకులు సామాన్లతో బస్సువైపు పరుగులు తీయ సాగారు.

అందరూ త్రోసుకుంటూ బస్సులోపలకు చొరబడు తుంటే ఆ సాహసం యిష్టంలేని ఓ వ్యక్తి సూట్‌కేస్‌తో ఆ సమూహానికి కొద్ది దూరంలో నిలబడ్డాడు. తోపిడి తగ్గిన తర్వాతే లోపలకు వెళ్ళొచ్చునన్న ఉద్దేశ్యంతో....

అనుకోకుండా ఆ వ్యక్తివైపు చూసిన అమర్—అతని చేతిలోవున్న 'నల్లసూట్‌కేస్' చూడటంతోనే విచిత్రమైన ప్రకంపనలకు లోనయ్యాడు.

మెదడులోని రొద తారాస్థాయికి చేరుకుంది. కళ్ళలో

ఎర్రజీరలు మెరిశాయి. ముఖం వికృతంగా మారింది. పెదాల మీద కోరనవ్వు వెలిసింది. వళ్ళంతా ఆవేశంతో ఊగిపో సాగింది. మెదడులో రొద ...తీవ్రమైన రొద....

"నల్లసూట్ కేస్‌తో రాజా రావుబహద్దూర్ని చంపింది నువ్వే...."

"కాదు.... నేనుకాదు...."

"ఫట్ .... ఫట్ .... ఫట్ .... నువ్వే.... నల్ల సూట్ కేస్‌తో ఆయన తల పగలగొట్టి చంపింది నువ్వే ..."

"క్రా ...."

"ఫట్ .... ఫట్ .... ఫట్ .... నువ్వే.... ఒప్పేసుకో. బ్లాక్ సూట్ కేస్‌తో తలపగలకొట్టి చంపింది నువ్వే.... ఫట్ .... ఫట్ ... ఫట్ ...."

"అవును. నల్లసూట్ కేస్‌తో చంపింది నేనే.... నేనే చంపాను" గట్టిగా అరిచాడు అమర్.

ప్యాసింజర్ల కోలాహలంలో అమర్ అరుపు ఎవరూ వినిపించుకోలేదు.

అమర్ ప్రక్కన కూర్చున్న ఓ యువకుడు మాత్రం ఆ అరుపుకు అదిరిపడి అమర్‌వైపు తిరిగాడు.

అప్పటికే అమర్ పైకి లేచి, వేగంగా, నల్లసూట్ కేస్‌తో నిలబడ్డ వ్యక్తివైపు ఉద్రేకంగా వెళ్ళటం, అతని చేతిలో సూట్ కేస్ లాక్కుని, దానితో అతని తలమీద దభీ....దభీ మని యిష్టమొచ్చినట్లు బాదటం, ఆ వ్యక్తి క్రిందపడి గిల గిలమని కొట్టుకుంటూ ప్రాణాలు వదిలేయటం ... క్షణాల్లోనే జరిగిపోయింది.

ఒక్క క్షణం బస్టాండంతా నిశ్శబ్దంగా మారిపోయింది. ఎక్కడివాళ్ళక్కడే నిలబడిపోయి తమ కళ్ళముందు జరిగిన ఘోరం నిజమా, కాదా అన్న మీమాంసలో పడ్డారు.

వా_స్తవమే అని గ్రహించి కూడా—"నల్ల సూట్ కేస్‌తో నేనే చంపాను" అంటూ ఉన్మాదంతో ఊగిపోతూ....చని పోయిన వ్య_క్తివైపు పిచ్చిగా చూపి నవ్వుతోన్న అమర్ని పట్టుకునే ధైర్యం చేయలేకపోయారెవ్వరూ....

అలా పిచ్చిగా నవ్వుతూనే అక్కడ్నుండి పరుగె_త్తాడు అమర్.

3

బస్టాండులో హత్య విషయమై పరిశోధన ప్రారంభించాడు వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ యిన్స్‌పెక్టర్ శశాంక—

సూట్ కేస్‌మీద వేలిముద్రలు పరిశీలించగా....అవి ఆ రోజే విడుదలకాబడ్డ అమర్ అనే వ్య_క్తివని తెలిసి....అతని కేసు తాలూకు ఫైలు సంపాదించి చదివాడు శశాంక.

అమర్ స్వస్థలం అనంతపల్లి. తండ్రి గోపాల్—రాజా రావుబహద్దూర్‌గారి కారు డ్రైవరు. తండ్రి కొడుకులిద్దరూ బహద్దూర్‌గారి బంగ్లాలోనే వున్న చిన్న షెడ్‌లో వుండేవారు.

ఒకరోజు బ్లాక్ సూట్ కేస్‌తో ఎక్కడికో బయల్దేర బోతున్న బహద్దూర్‌గార్ని డబ్బులడిగాడట అమర్.

ఆయన చికాకులో అమర్ని తిట్టటంతో....కోపం పట్టలేని అమర్ ఆయనచేతిలో సూట్ కేస్ లాక్కుని తలమీద గట్టిగా మోదటంతో రావుబహద్దూర్‌గారు మరణించటంవల్లనూ....నేరం స్వయంగా అమర్ అంగీకరించటంవల్లనూ అమర్‌కు యావజ్జీవ కారాగార శిక్ష పడినట్లూ. దాదాపు పదిహేను సంవత్సరాల తర్వాత సత్ప్రవ_ర్తన మీద అమర్‌ని విడుదల చేసినట్లూ తెలుసుకున్నాడు శశాంక.

మరునటిరోజే అనంతపల్లి వెళ్ళి రాజా రావుబహద్దూర్ గారి యింటిలో అమర్ విషయమై విచారించాడు శశాంక.

బహద్దూర్‌గారి మరణంతో ఆ దివాణం అతని తమ్ము డైన రాజారామానంద్‌గారి ఆధీనమైంది.

శశాంక నోటినుండి 'అమర్' పేరు రావటంతోనే మండిపడ్డారు రామానంద్‌గారు. "ఆ దౌర్భాగ్యుడివల్లే దేవుడిలాంటి అన్నగారు దూరమైపోయారు. అలాంటి హంతకుడ్ని ఉరితియ్యక... యావజ్జీవమని, మరలా విడుదల చేశారా?" అడిగాడు ఆవేశపడుతూ.

"అసలు అమర్ మీ అన్నగార్ని ఎందుకు హత్య చేసి నట్లు?" తెలియనట్లే అడిగాడు శశాంక.

"వాడి తండ్రే మా కారు డ్రైవరు. ఇద్దరూ మా షెడ్‌లోనే వుండేవారు. వాడు బాగా చదువుతాడన్న అభి మానంతో కాలేజీలో చేర్పించి రోజూ తన కార్లోనే రాజ మండ్రి తీసుకువెళ్ళేవారు అన్నగారు. అలాంటి దేవుడ్ని కాలేజీ ఎక్స్‌కర్షన్‌కి డబ్బులడిగాడట వాడు.

వ్యాపార గొడవల్లో విసుగ్గా వున్నసమయాన వాడలా అడగటంతో చిరాగ్గా నాల్గు చివాట్లేశారట అన్నయ్య.

అంతే—

ఆ రాక్షసుడు అన్నగారి ప్రాణాలే హరించేశాడు" బాధతో గొంతుకు పూడుకుపోగా చెప్పారు రాజా రామానంద్‌గారు.

"ఇప్పుడు అమర్ తండ్రి గోపాల్ ఎక్కడున్నాడు?" అడిగాడు శశాంక.

"తెలియదు. కొడుక్కి యావజ్జీవ శిక్ష విధించిన్నాడే వాడెటో వెళ్ళిపోయాడు"

"సరే—వస్తాను" అని బయల్దేరాడు శశాంక.

రాజమండ్రి తిరిగొచ్చి తను నోట్ చేసుకున్న సమా చారాన్ని ఓసారి రిఫర్ చేస్తుండగా....ఫోన్ మ్రోగటంతో రిసీవరెత్తి—"హలో ఇన్స్‌పెక్టర్ శశాంక హియర్"

అన్నాడు.

అటువైపునుండి వచ్చిన సమాచారం వినటంతోనే ఆదిరిపడ్డాడు.

"వాట్!....హత్యా?....సూట్‌కేసుతోనా.... నేనిప్పుడే వస్తున్నా" ఫోన్ పెట్టేసి ఒక్క ఉదుటున పైకిలేచి, క్యాప్ తగిలించుకుని సిబ్బందితో హోటల్ 'పంచవటి' వైపు జీప్‌లో బయల్దేరాడు శశాంక.

పంచవటి హోటల్ బయటవున్న ఫుట్‌పాత్ దగ్గర జనం విపరీతంగా గుమికూడి వుండటంతో జీప్‌ని అక్కడ ఆపించి క్రిందకు దిగాడు శశాంక.

పోలీసుల్ని చూస్తూనే చాలా మంది ఆ ప్రాంతం నుండి తప్పుకున్నారు. మిగిలిన జనాల్ని లాఠీలతో దూరంగా నెట్టసాగారు పోలీసులు.

శశాంక ముందుకో యువకుడొచ్చి విష్‌చేసి చెప్పాడు- "నా పేరు శివరామ్ సర్. మీకు ఫోన్‌చేసింది నేనే" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

"థాంక్స్ ఫర్ యువర్ కైండ్ ఇన్ఫర్మేషన్ మిస్టర్ శివరామ్" కృతజ్ఞతాభావంతో అతని భుజం తట్టి హతుడి వైపు నడిచాడు శశాంక.

ఫుట్‌పాత్‌మీద అడ్డంగా పడివుంది శవం. శవానికి కొద్ది దూరంలో రక్తం మరకలతో పడివున్న నల్లసూట్‌కేస్ వుంది. హతుడికి యిరవైఏడేళ్ళ వయస్సువుంటుంది. ఆలీవ్‌గ్రీన్ పాంట్‌మీద వైట్‌షర్టు టక్‌చేసి వున్నాడు. పగిలిన తలనుండి బయటపడిన మెదడు....కారిన రక్తంతో షర్టు చాలా భాగం ఎర్రబడివుంది.

"ఈ హత్య ఎలా జరిగిందో, హంతకుడెలావుంటాడో వివరంగా చెప్పగలరా మిస్టర్ శివరామ్!" అడిగాడు

శశాంక.

"హంతకుడికి ముప్పైఆరేళ్ళుండొచ్చు ననుకుంటు న్నాను సార్! చామనఛాయ, పెరిగిన గడ్డం. ఎర్రగళ్ళమీద సిమెంట్ కలర్ పాంట్ తొడిగివున్నాడు. నేను ఎదురుగా వున్న బస్టాపులో నిలబడి సిటీ బస్‌కోసం ఎదురు చూస్తు న్నాను. వాడు నా ప్రక్కనే నిలబడ్డాడు ఏదో గొణు క్కుంటూ....

ఇంతలో ఈయన సూట్‌కేసుతో హోటల్‌నుండి బయ టకు రావటం చూసి....పిచ్చిపట్టినవాడిలా అరుస్తూ వచ్చి ఈయన చేతిలో సూట్‌కేస్ లాక్కుని తలమీద కొట్టి కొట్టి చంపాడు. "నల్ల సూట్‌కేస్‌తో చంపింది నేనే....నేనే చంపాను" అని అరుస్తూ సూట్‌కేస్‌పడేసి పారిపోయాడు." చెప్పాడు శివరామ్.

"మై గాడ్! అమర్ చేసిన హత్యేనన్నమాట ఇదీనూ" ఆందోళన చెందాడు శశాంక.

ఆంబులెన్స్ రావటంతో శవాన్ని అందులోకి తరలించి, శివరామ్ అడ్రసు నోట్ చేసుకుని బయల్దేరాడు శశాంక.

4

వారం రోజులు గడిచాయి—

మరో అయిదు హత్యలు అదే విధంగా జరిగాయి. ఆ రోజు స్థానిక దినపత్రికలో హత్యల విషయమై పెద్ద హెడ్డింగ్‌తో ఓ వార్త ప్రింటయింది.

రాజమండ్రిలో రాక్షసుడు

....పూర్వకాలం అడవి మార్గంలో రాక్షసులుండి పాద చారుల్ని పట్టుకుని పిప్పర్మెంటులా చప్పరించేవారని కథల్లో చదువుకునేవాళ్ళం. నేడు 'అమర్' అనబడే కలియుగ రాక్షసుడు (రాజరావుబహద్దూరుగారి హత్య కేసులో

యావజ్జీవ శిక్ష విధింపబడి సత్ప్రవర్తనతో ఈ మధ్యే విడుదల కాబడ్డ వ్యక్తి నల్ల సూట్‌కేస్‌తో వెళ్ళే ప్రయాణికుల్ని తల పగలగొట్టి చంపేయటం....పట్టణ ప్రజల్ని తీవ్ర భయాందోళనలకు గురిచేస్తోంది.

ఈ రాజమండ్రి రాక్షసుడు విడుదలైన పది రోజుల్లోనే ఏడు హత్యలుచేసి రికార్డు సృష్టించాడు. బస్టాపుల్లోనూ, రైల్వేస్టేషన్స్‌లోనూ ప్రయాణికులను హెచ్చరిస్తూ వాల్ పోస్టర్స్ వెలిశాయి.

ఏడు హత్యలు జరిగినా హంతకుడ్ని పట్టుకోలేకపోయారంటే....అసలు పోలీసు శాఖవారు వున్నారా....లేరా అనే అనుమానం కలగక మానదు.

హంతకుడు మెంటల్ ఫాల్టువల్ల ఈ హత్యలు చేస్తున్నాడో....లేక కావాలనే చేస్తున్నాడో అర్థంగాని విషయం." అంటూ ప్రచురింపబడింది.

ఆ వార్త చదవటంతోనే కృంగిపోయారు నందగోపాల్‌గారు.

శిక్ష పూర్తి చేసుకుని వచ్చిన కొడుక్కి రంగుల ప్రపంచంలో ఆనందమంతా అనుభవించేలా ఏర్పాట్లు చేయాలనుకున్నారు. కానీ—కొడుకు ఇలా రాజమండ్రి రాక్షసుడిగా పేరు తెచ్చుకుంటాడని ఆయన ఊహించలేకపోయారు.

కొడుకు అలా కావటానికి కారణం ఎవరైందీ ఊహించిన నందగోపాల్‌గారు—"యూసఫ్ ఖాన్...." అంటూ కసిగా పళ్ళు కొరికారు.

5

ఉదయం ఎనిమిది—

అప్పుడే స్టేషనుకు వచ్చి తన సీట్‌లో కూర్చోబోతున్న

శశాంక.... ఫోన్ అదే పనిగా మ్రోగుతుంటే రిసీవరెత్తి "హలో" అన్నాడు.

"...................."

"ఏమిటీ యూసఫ్ ఖాన్ హత్య చేయబడ్డాడా!.... ఎక్కడ?" అవతలి వ్యక్తి చెప్పింది విని నమ్మలేనట్లడిగాడు.

"...................."

"నే నిప్పుడే వస్తున్నాను" అంటూ ఫోన్ పెట్టేసి, సిబ్బందితో బయల్దేరాడు శశాంక.

ఇస్లామ్‌పేటలో వుంది యూసఫ్‌ఖాన్ ఇల్లు.

అనుమానం మీద ఓ అమ్మాయిని పోలీస్‌స్టేషన్లో నిర్బంధించి మానభంగం చేసిన నేరానికిగాను....అయిదేళ్ళ క్రిందట సస్పెండ్ కాబడి ఉద్యోగం పోగొట్టుకున్నాడు యూసఫ్‌ఖాన్.

అప్పట్నుండీ తను కట్టించిన బిల్డింగ్స్‌మీద వస్తున్న ఆదాయంతో విలాస జీవితాన్ని గడుపుతున్నాడు.

అతని విలాసాల కోసం ఇస్లామ్‌పేటలో చిన్న యిల్లు తీసుకున్నాడు. ప్రతి రాత్రీ పన్నెండు గంటలవరకూ ఆ యింట్లోనే గడుపుతాడు యూసఫ్‌ఖాన్.

ప్రస్తుతం అతను ప్రాణాలు పోగొట్టుకుందీ ఆ ఇంట్లోనే.

జీప్ దిగిన శశాంకకు లోపలకు వెళ్ళటాన్కి దారిచ్చారు యింటి చుట్టూ మూగిన జనం.

డబుల్‌కాట్ మంచం ప్రక్కన వెల్లకిలా పడివున్న యూసఫ్‌ఖాన్ తల నామరూపాలు లేనంతగా పగిలి వుంది. రక్తంతో కార్పెట్ అంతా తడిసిపోయి వుంది. కాళ్ళ దగ్గర పడివున్న 'నల్ల సూట్‌కేస్' దానిమీద రక్తం మర

కలు చూడటంతోనే శశాంక కనుబొమలు ముడిపడ్డాయి.

ఆ రాజమండ్రి రాక్షసుడు బ్లాక్ సూట్‌కేస్‌తో బయట తిరిగేవాళ్ళనే హతమారుస్తున్నాడు ఇన్ని రోజులూ .... ఇలా యిళ్ళలో చొరబడి కూడా హత్యలు చేస్తున్నాడా?....

ఆలోచిస్తుంటే అనుమానాలు క్రమ్ముకురాసాగాయి శశాంకు.

ఏమైనా ఈ హత్య రాజమండ్రి రాక్షసుడు చేసి వుండడు, మరెవరో చేసి.... నేరం అతనిమీదకు వెళ్ళేట్లు చేయాలని ప్రయత్నించినట్లు అనుమానించాడు శశాంక.

ఆ రోజు సాయంత్రమే వచ్చిన ఫింగర్ ప్రింట్స్ రిపోర్టు చూసి తన అనుమానం తప్పు కానందుకు గర్వ పడ్డాడు.

అయితే—రాజమండ్రి రాక్షసుడితో పాటు మరో క్రూరమైన రాక్షసుడు కూడా బయల్దేరాడన్న మాట.... అనుకున్నాడు శశాంక.

ఇంతలో పోలీస్‌స్టేషన్ బయటెక్కడో పెద్ద ఆర్త నాదం, జనం భయాందోళనలతో పరుగెడుతూ అల్లరి.... అలజడి చెలరేగేసరికి.... గబగబా పోలీసులతో పరుగులు తీశాడు శశాంక.

6

"మరో హత్యా!" తెల్లబోతూ అడిగాడు శశాంక.... రిపోర్టివ్వటానికి వచ్చిన వ్యక్తితో.

"అవును సార్! యిదీ ఆ రాజమండ్రి రాక్షసుడు చేసిన హత్యే" చెప్పాడతను.

"ఏం హతుడి ప్రక్కన నల్ల సూట్‌కేస్ వుందా?" చిర్నవ్వుతో అడిగాడు శశాంక.

"అవును సార్" గర్వంగా చెప్పాడా వ్యక్తి.

చేతులకు బేడీలతో 'సెల్' వెనుక ఏదో గొణు క్కుంటూ పడుకునివున్న అమర్ వైపు ఓ సారి జాలిగా చూపి—"పద వెళదాం" అంటూ అతనితో అనుసరించి బయిల్దేరాడు శశాంక.

'గీతా నివాస్' గేటుముందు వెల్లకిలా పడివుంది నంద గోపాల్‌గారి శవం.

తల అంతా నుజ్జునుజ్జు కాబడి, కాళ్ళదగ్గర నల్ల సూట్ కేస్ పడివుంది.

"ఈ యిల్లు ఎవరిది?" గీతానివాస్ ఇంటి ప్రక్కవా ళ్ళని ప్రశ్నించాడు శశాంక.

"ఆయనదే ఇన్స్‌పెక్టర్. ఈమధ్యనే కొన్నాడు. ఒక ప్పుడు కారు డ్రైవరుగా వుండేవాడట. లాటరీ తగిలి అదృష్టవంతుడయ్యాడని ఆయన కారు డ్రైవరు ఓసారి నాతో అన్నాడు" చెప్పా డతను.

"యింతకూ ఆయన పేరేమిటి?" సాలోచనగా అడిగాడు శశాంక.

"నందగోపాల్"

"నందగోపాల్ .... నంద .... గోపాల్ .... గోపాల్ ...." ఒక్కసారిగా శశాంక మెదడులో చురుక్కుమని మెర పిందో మెరుపు.

నందగోపాల్‌గారి యింటి తలుపులు తెరచి పరిశోధన మొదలెట్టాడు. బెడ్ రూములో పరుపుక్రింద కనిపించిన డైరీ చూడటంతోనే కళ్ళలో వింతకాంతి వెలిగింది.

గబగబా పేజీలు తిరగేసి దాన్ని తీసుకుని బయటకు నడిచాడు—

7

"యూ ఆర్ అండర్ అరెస్ట్ రామానంద్‌గారూ!" బేడీలు చూపిస్తూ అన్నాడు శశాంక—

"ఎందుకూ?" తీక్షణంగా చూస్తూ ప్రశ్నించాడు రామానంద్.

"ఈ ఆస్తి నీ హస్తగతం కావటాన్కి అడ్డుగావున్న మీ అన్నగార్ని హత్యచేసి ఆ నేరాన్ని అమాయకుడైన అమర్ మీదకు నెట్టావు. ఇన్స్‌పెక్టర్ యూసఫ్‌ఖాన్‌కు డబ్బును క్రుమ్మరించి అమరే మీ అన్నగార్ని చంపినట్లు ఒప్పించ మని ప్రాధేయపడ్డావు. డబ్బుకోసం ఎలాంటి నికృత్యానికైనా ఒడిగట్టే ఆ యూసఫ్‌ఖాన్—నల్లసూట్‌కేస్‌తో రావు బహద్దూర్‌గార్ని చంపింది నువ్వేనని ఒప్పుకోమంటూ నిర్దాక్షిణ్యంగా అమర్‌ని చావబాది....చేయని నేరాన్ని ఒప్పుకునేట్లు చేయించాడు.

ఆ దారుణమైన సంఘటనే అమర్‌ని ఓ రాక్షసుడిగా మార్చింది. నల్లసూట్‌కేస్‌తో ఎవరు వెళుతున్నా ఆవేశంతో రెచ్చిపోయి వాళ్ళని హతమార్చటం మొదలు పెట్టాడు.

కొడుక్కి యావజ్జీవ శిక్ష పడిందని తెలిసి ఊరొదిలి వెళ్ళిపోయిన ఒకప్పటి గోపాల్‌కు....కొన్ని నెలల క్రిందట లాటరీలో పది లక్షలు రావటంతో రాజమండ్రి వచ్చి నందగోపాల్‌గా స్థిరపడ్డాడు. కొడుకు విడుదలై వస్తున్నాడని తెలిసి పొంగిపోయాడు.

కానీ—విడుదలైన కొడుకు రాజమండ్రి రాక్షసుడిగా మారేసరికి....ఆ మార్పుకు కారణమైన యూసఫ్‌ఖాన్ దగ్గరకు వెళ్ళి తనతో సహకరిస్తే, అయిదు లక్షలిస్తానని ఆశ పెట్టాడు.

డబ్బుకు ఆశపడ్డ యూసఫ్‌ఖాన్—ఆనాడు అన్యాయంగా అమర్‌ను జైలుకు పంపినట్లూ, అసలు రాజారావు బహద్దూర్ హత్య నువ్వే చేసినట్లూ.... ఆ రోజు తాను దారుణంగా హింసించబట్టి అమర్ మానసిక స్థితిలో మార్పువచ్చి అలా నల్లసూట్‌కేసుతో నడిచేవాళ్ళని చంపుతున్నాడనీ.... అవి తెలిసి చేస్తున్న హత్యలు కావనీ, మెంటల్ షాక్‌తో చేస్తున్న హత్యలని చెప్పటాన్కి ఒప్పుకున్నాడు.

కొడుకును యిక ఉరికంబంనుండి కాపాడుకున్నట్లేనని మురిసిపోయిన నందగోపాల్‌గారు ఆనందంగా యింటికి చేరుకున్నారు.

డబ్బుమీద విపరీతమైన దురాశగల యూసఫ్‌ఖాన్—తాను అప్రూవర్‌గా మారిపోతున్నట్లూ.... నిజం చెపితే నీకు శిక్ష పడుతుందనీ, నిజం చెప్పకుండా వుండాలంటే నువ్వు పది లక్షలు ఇవ్వవలసిందిగా నిన్ను ఫోన్లో బెదిరించాడు.

యూసఫ్‌ఖాన్‌తో ప్రమాదమనుకున్న నువ్వు—నిజం చెప్పవద్దనీ, పది లక్షలతో వస్తున్నానని చెప్పి, నల్ల సూట్‌కేస్‌తో వెళ్ళి యూసఫ్‌ఖాన్ని చంపి, ఆ సూట్‌కేస్ అతని ముందు పడేసి పోయావు.

ఎప్పటికైనా నందగోపాల్ కూడా నీకు అడ్డు తగులుతాడని జాగ్రత్త చర్యగా అతన్ని కూడా అదే పద్ధతిలో హతమార్చావు.

కానీ—నందగోపాల్ హత్యకాబడటాన్కి ముందు రాత్రే రాజమండ్రి రాక్షసుడు మాకు పట్టుబడ్డాడన్న విషయం పాపం నీకు తెలియదు. యిప్పటికైనా యూసఫ్‌ఖాన్ని, నందగోపాల్ని చంపింది నువ్వేనని ఒప్పుకుంటావా?" అడిగాడు శశాంక.

"మీరు చెప్పిన కట్టుకథకు మీమీద పరువునష్టం దావా వెయ్యాల్సొస్తుంది మిస్టర్ ఇన్స్పెక్టర్!" ఆగ్రహంగా అరిచాడు రామానంద్.

"మీరు అంతటి సమర్థులని మాకు తెలుసు రామానంద్‌గారూ! మీలాంటి వాళ్ళతో ముఖాముఖీ పోరాటానికి వచ్చినపుడు మా జాగ్రత్తలు మేం తీసుకునే వస్తాం. ఆ రెండు హత్యలూ మీరే చేశారనటానికి నా దగ్గర తగినన్ని సాక్ష్యాధారాలున్నాయి"

"ఏమిటా సాక్ష్యాలు?"

"నందగోపాల్ డైరీ"

"కట్టుకథలో అదో భాగం"

"డైరీ కట్టుకథంటే నమ్ముతారేమోగానీ చేతి ముద్రలు కట్టుకథంటే ఎవ్వరూ నమ్మరు రామానంద్‌గారూ!"

"ఏమిటీ చేతిముద్రలా?" తెల్లబోతూ అడిగాడు రామానంద్.

"మీకు తెలియకుండా మీ వేలిముద్రలు సేకరించి పరిశీలన కూడా చేశాం. యూసఫ్‌ఖాన్, నందగోపాల్ శవాల పరిసర ప్రాంతాల్లోనూ, అక్కడ పడివున్న సూట్‌కేస్‌ల మీదున్న వేలిముద్రలు, మీ వేలిముద్రలతో సరిపోయాయి. ఇప్పటికైనా నిజం ఒప్పేసుకుని జీపెక్కండి" అసహనంగా అన్నాడు శశాంక.

ఇక చేసేదేమీలేదని తలచి జీపెక్కుతూ అడిగాడు— "మరి రాజమండ్రి రాక్షసుడు!..." అంటూ అర్ధోక్తిలో ఆపాడు రామానంద్.

"తీవ్ర మనఃక్షోభతో తలలో నరాలు చిట్లిపోయి మొన్న రాత్రే మరణించాడు" గాఢంగా ఊపిరి వదలి చెప్పాడు శశాంక, జీపెక్కి కూర్చుంటూ. □

స్త్రీరోగ నిపుణుడు

బొమ్మిడి అప్పారావు

"చెప్పండి" అన్నది లాయర్ బిందు కుర్చీలో ముందుకు వంగి.

ఆమె కెదురుగా పాతికేళ్ళయువతి కూర్చుని వున్నది. సన్నగా, ఎర్రగా, చాలా నాజూకుగా వున్నది. చూడగానే

పెద్ద కుటుంబంలోని పిల్ల అని తెలుస్తూనే వుంది.

కనకాంబరం రంగు జరీ పూవులచీర కట్టుకుని, ఒంటికి అతుక్కుపోయిన మేచింగ్‌బ్లౌజు వేసుకున్నది. మెడలో ఒంటిపేట గొలుసు, నల్లపూసల బంగారు ఛెయిన్ వున్నాయి. చెవులకి డైమండ్ జూకాలున్నాయి. రెండు చేతులకి నాలుగేసి బంగారుగాజులున్నాయి చాలా ఖరీదైన మనిషి అని ఒక్క చూపుతో చెప్పేయవచ్చును.

"నా పేరు మంజుల" అన్నదాయువతి గొంతు సవరించుకుని. "మా తండ్రిగారు బొంబాయిలో ఓ పెద్ద టెక్స్టైల్ మిల్ నడుపుతున్నారు. మాకు యిక్కడే హైద్రాబాద్‌లో నాలుగు పెద్ద ప్యాలెస్‌ల్లాంటి ఇళ్ళున్నాయి. రెండు సంవత్సరాల క్రితమే నా వివాహం ఓ ఫారిన్ రిటర్న్‌డ్ డాక్టర్‌తో జరిగింది. ఆయనపేరు జగదీష్." ఆమె రెండుక్షణాలు ఆగి, బిందు శ్రద్ధగా వింటున్నదని గ్రహించి తృప్తిగా నిశ్వసించి మళ్ళీ కొనసాగించింది.

"జగదీష్ మొదట్లో నాతో బాగానే వుండేవారు. రాను రాను ఆయన తత్వం నాకు వెగటు పుట్టించింది. ఇరవై నాలుగ్గంటలు తాగుడు కావాలి ఆయనకు. నాకు తాగుబోతు లంటే అసహ్యం. తాగి నా దగ్గరకు రావద్దని తెగేసి చెప్పేశాను. అలాగైనా తాగుడు మానతారేమోనని నేనాశించినది వ్యర్థమే అయింది.

తాగి నా దగ్గరకు రావటమైతే మానేశారుగాని, బయటి ఆడవాళ్ళతో తిరుగుళ్ళు ఎక్కువైపోయాయి. 'ఇదేం బావుందా మీకు?' అని నిలదీసి అడిగితే 'అమ్మ తను పెట్టదు అడుక్కోనివ్వదు' అంటూ తిక్క తిక్కగా సమాధానం చెప్పారు. పైగా నా కళ్ళముందే అమ్మాయిల్ని తెచ్చుకోవటం మొదలెట్టారు. నేను గోలపెడితే 'నీ కిక్కడ నచ్చక

పోతే మీ యింటికి వెళ్ళిపో!' అని పురుగులా విదిలించే శారు." మంజుల ఓ నిమిషంపాటు చెప్పటం ఆపింది.

బిందు శ్రద్ధగా వింటోంది.

మంజుల మళ్ళీ గొంతు సవరించుకున్నది. "నేను పౌరుషపడి పుట్టింటికి వచ్చేస్తే మా నాన్నగారి పరువు మర్యాదలకి భంగం కలుగుతుందనే భయంతో అన్నీ సహించి ఆయనతోనే వుంటున్నాను. కాని....యీ మధ్య ఆయన ధోరణి బాగా మారిపోయింది. నన్ను అడ్డు తొలగించు కోవటానికి దారులు వెతుకుతున్నారు" అన్నది.

బిందు ఆసక్తిగా ముందుకు వంగి "మీకా అనుమాన మెందుకువచ్చింది?" అనడిగింది.

"ఆయన డాక్టరు కదా! ఏ సమయంలో ఎలాంటి విష పదార్థం ఆహారంలో కలిపి పెట్టేస్తారో, ఏ యింజక్షన్ చేసేస్తారోనని భయంగా వున్నది!"

"మీ భయానికి ఆధారముండాలికదా! అకారణంగా అతన్ని అనుమానించి, మీరు మనశ్శాంతి కోల్పోతున్నా రంటాను!"

"లేదు లాయర్‌గారూ! ఉత్తపుణ్యానికే ఆయన్ని అను మానించటం లేదు నేను. రెండు మూడు సంఘటనలు చూశాకనే నా కనుమానమొచ్చింది."

"ఏమిటా సంఘటనలు?!"

"వారంరోజుల క్రితం ఓ రాత్రి నేను అకస్మాత్తుగా మెలకువ వచ్చి లేచాను. పక్కన పక్కమీద ఆయన లేరు. నా తలవైపు నించుని వున్నారు. ఆయన చేతిలో లోడ్ చేసిన సిరెంజివున్నది. నేను మెలకువ వచ్చి లేచేసరికి ఆయన నా మీదికి వంగుతుండి వుండాలని తర్వాత గ్రహిం చాను....'ఇంజక్షన్ దేనికి?' అని అడిగాను. ఆయన వెర్రి

నవ్వు నవ్వేసి. ఇదా? ఇది మార్ఫియా! నిద్ర రావటం లేదని నేనే సెల్ఫ్ యింజక్షన్ చేసుకొంటున్నాను' అన్నారు"

"చేసుకున్నారా?" అడిగింది బిందు.

"నాకు కనిపించకుండా అవతలివైపుకి తిరిగిపోయారు. తరవాత ఖాళీ సిరంజి కనిపించింది. మందు నేలమీదికి వదిలేశారని గ్రహించాను. తర్వాత చూస్తే నేలమీద యింజక్షన్ స్ప్రే చేసేసిన సూచనలు కనిపించాయి."

బిందు వెంటనే మాట్లాడలేదు.

"నాలుగు రోజుల్క్రితం డైనింగ్ టేబిల్ దగ్గర భోజనా లకి కూచున్నాం, మజ్జిగ అన్నంలోకి సాల్ట్ కావాల్సి వచ్చింది. టేబిల్ మీది పాట్ లో అయిపోయింది. నేను లోపల కిచెన్ లోకి వెళ్ళాను సాల్ట్ తేవటానికి. ఈ లోపల నా కంచం పక్కకి జరపబడింది నేను టేబిల్ దగ్గరికి వచ్చే సరికి ఆయన మామూలుగా భోంచేస్తూన్నారు. సాల్ట్ లేకుం డానే పెరుగన్నం తినేశారు.

నేను అన్నం తినబోతూ అనుమానం వచ్చి ఆగి పోయాను. అన్నం కెలికినట్టుగా కనిపించింది. ఆయన వెళ్ళిపోయాక అన్నం పెంపుడు పిల్లికి వేశాను. పది నిమి షాల తర్వాత అది గిల గిల కొట్టుకుని చనిపోయింది." మంజుల చెప్పటం ఆపింది. ఆమె ముఖంలో భయం తాలూకు ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఒళ్ళంతా చెమట్లతో తడిసిపోయింది సన్నగా ఒణుకుతోంది.

లాయర్ బిందు లేచి ఆమె పక్కకువచ్చి భుజం తట్టి, "రిలాక్స్ అవండి!" అన్నది.

మంజుల మంచినీళ్లు అడిగి తాగింది.

"మీకు పిల్లల్లేరనుకుంటాను." అన్నది బిందు.

"లేరండి, ఆయన డాక్టర్ కదా! అప్పుడే వద్దన్నారు.

నేను కాదనలేదు."

"ఇంతకీ నా వలన మీకు కావలసిన సాయమేమిటి?"

"నాకు రక్షణకావాలి లాయర్‌గారూ!"

"చూడండి మంజూలా! ఇది భార్యా భర్తలకు సంబంధించిన సమస్య. దీంట్లో మూడో మనిషి తల దూర్చటం మీకే మంచిదికాదు."

"యిది మామూలు భార్యా భర్తల సమస్యకాదు లాయర్‌గారూ! యిష్టంలేని భర్త భార్యను తుదముట్టించటానికి వేసే కుయుక్తులు, కుతంత్రాలకి సంబంధించిన సమస్య! మూడో మనిషి కల్పించుకోకపోతే నా జీవితం శాశ్వతంగా ముగిసిపోతుంది."

"చూడండి, రెండుసార్లు మీ వారు మీ మీద హత్యా ప్రయత్నం చేశారని మీరు అనుమానించారు. కాని మొదటిసారి, మార్ఫియా యింజక్షన్‌ని నిజంగానే మీవారు చేసుకున్నారేమో సరిగా చెప్పలేకపోతున్నారు. రెండోసారి, ఆహారంలో విషం కలిపినట్టు అనుమానించారు. అది మీ వారే కలిపినట్టు మీరు చూడలేదు. రెండూ నిరాధారమైన విషయాలే!"

"అలా కొట్టి పారేయకండి లాయర్‌గారూ! ఆ ఇంజక్షన్ నా కోసమనే ఆయన లోడ్ చేశారు. నేను చూసేనాని నేలమీదికి ఎజెక్ట్ చేసేశారు. ఆహారంలో ఆయన తప్ప విషం కలిపే అవకాశం ఆ సమయంలో యింకెవరికుంటుంది, చెప్పండి!"

బిందు కొద్ది క్షణాలవరకు ఏదో ఆలోచిస్తూ వుండిపోయింది.

"ప్రస్తుతం మి భర్తతోనే వుంటున్నారా?"

"అవునండి"

"ఎక్కడ?"

"సంజీవరెడ్డి నగర్."

"మీ తండ్రిగారిల్లు ఎక్కడ?"

"సికిందరాబాద్, సరోజినీదేవి రోడ్. నాన్నగారు నెలకి యిరవై రోజులు బొంబాయిలోనే వుంటారు, మిల్స్‌పనిమీద. అన్నయ్య, అమ్మ వుంటారు యింట్లో."

"మీ అన్నయ్యపేరు? ఏం చేస్తుంటాడు?"

"పేరు. చంద్రబాబు. తారీనాకలో సినిమా థియేటర్ కట్టిస్తున్నాడు. వచ్చేనెల్లోనే ఓపెనింగ్."

"మీ అన్నయ్యకు, మీవారు జగదీష్‌కి టరమ్స్ ఎలా వుంటాయి? ఏమైనా స్పర్థలున్నాయా?"

"ఉహుఁ! స్పర్థలేం లేవు. క్లోజ్‌గానే వుంటారు. మా వారికి డబ్బేమైనా కావాలా అని అడిగి మరీ యిస్తుంటాడు అన్నయ్య. ఓ విధంగా విచ్చలవిడిగా డబ్బిచ్చి ఆయన్ని పాడుచేసింది అన్నయ్యే!"

"ఊఁ! ఇటువంటి ప్రమాదకర పరిస్థితుల్లో కూడా మీరు మీ వారితోనే వుండాలని ఎందుకనుకొంటున్నారు? మీ నాన్నగారితో నిజం చెప్పి విడిపోయే ప్రయత్నం చెయ్యక పోయారా!"

"నాన్నగారు, చెప్పానుగా, పరువుకోసం ప్రాణం వదిలే మనిషి. నా కాపరం యిలా అయిందంటే ఆయన మనో వ్యాధితో మంచమెక్కుతారు. ఆయనకి నేనంటే ప్రాణం! నా మీద ఈగవాలినా సహించరు."

"జగదీష్ సంగతి చెప్పాక ఆయన నిజం గ్రహించి ఏదోక పరిష్కారం చూడకపోరుకదా!"

"అదే నా దురదృష్టం! జగదీష్‌పైన ఆయనకి కొండంత గురి! నాన్నగారి దృష్టిలో మా వారు చాలా యోగ్యుడు!

గొప్ప డాక్టరు. నా పట్ల ఎంతో ప్రేమాభిమానాలున్న మంచి భర్త! జగదీష్ కూడా మా నాన్న పట్ల కొండంత గౌరవ మర్యాదలు ఒలకబోస్తారు. నాన్నగారిని ఎంతగా ఆకట్టు కున్నారంటే, నేను ఆయన గురించి ఏ మాత్రం చెడ్డగా చెప్పినా తిరిగి నాన్నగారే నన్ను కూకలేస్తారు. ఇంకెప్పుడూ జగదీష్ గురించి అలా చెప్పొద్దని మందలిస్తారు!"

"పోనీ, కొన్నాళ్ళపాటు మీరు చుట్టం చూపుగా మీ పుట్టింట్లో గడిపి చూడకపోయారా?"

"అది కూడా జరిగేపనికాదు లాయర్‌గారూ! ఇరవై నాలుగ్గంటలు కూడా గడవకముందే జగదీష్ వచ్చి తీసుకు వెళ్ళిపోతారు. మా అమ్మ అసలే హడావిడి మనిషి. అతను రావటం ఆలస్యం, వెళ్ళు వెళ్ళు అంటూ తరిమేస్తుంది అతనివెంట."

"ఒక్కమాట చెప్పండి మంజులా! మీకు మీవారిపట్ల చాలా ప్రేమ, ఆరాధన వుంది వుండాలి. అవునా? మీరు అతన్ని ఒదులుకోవాలను కోవటంలేదు. అందం విషయం వదిలెయ్యండి—మీ మటుకు మీకు అతనే సర్వస్యం! మీ అంతట మీరు అతన్ని మీ దారికి తిప్పుకోవట మొక్కటే దీనికి పరిష్కారం! ఈ చిన్న విషయానికి లాయర్లు, డిటెక్టివ్‌లు అక్కర్లేదు. మీ వారిని మీ వంక ఆకర్షింప చేసుకోండి. హైసొసైటీలో తాగటం తప్పుకాదు, నేరం కాదు. స్టేటస్ సింబల్! ప్రెస్టేజి యిష్యూ. దాన్ని పట్టించు కోకండి! బి ఛీర్‌ఫుల్!" అన్నది బిందు.

మంజుల తల విదిలించింది. "ఉహూఁ! తాగుబోతుని సహించటం నావల్లకాదు" అన్నది.

"సరే! మరి డైవోర్సుకి ప్రయత్నించమంటారా మంజులా?!"

మంజుల యిబ్బందిగా చూపింది బిందువైపు.

"డైవోర్స్ తీసుకుని విడిపోతే సంఘంలో నాన్నగారి పరువేం కాను? చెప్పానుగా, పరువుకోసం ప్రాణం పెట్టే మనిషి నాన్నగారు!" అన్నది.

బిందుకి కోపం వచ్చింది మంజులమీద. ఆమె మనసేమిటో అర్థం కాకుండావుంది. భర్తను వదులుకోలేదు, అతనితో సంసారం చెయ్యలేదు. ఏ క్షణంలో తనని చంపేస్తాడోననే అనుమానంతో అనుక్షణం ప్రాణాలరచేతుల్లో పెట్టుకుని అతనింట్లోనే ఎందుకు వుండాలి? తండ్రి పరువు ప్రతిష్ఠలతో ముడిపెడుతోంది. కాని అదెంతవరకు నమ్మొచ్చును?

బిందుకు యిందులో ఏదో మెలికెవున్నట్టు అనుమానంగా వుంది. మంజుల మనస్తత్వం చాలా చిత్రంగా వున్నది. ఆమె కెలాంటి సహాయం కావాలో కూడా ఆమెకే తెలియటం లేదు. లాయర్‌గా యిందులో తన ప్రమేయం ఎంతవరకు? ఆమెకి తనేవిధంగా సహాయపడాలి?

బిందు మంజులవంక సూటిగా చూసి, "మీక్కావలసిన సహాయమేమిటో స్పష్టంగా చెప్పండి మంజులా!" అన్నది.

మంజుల ఓ క్షణం ఆలోచించి, "మీరు ఓ వారం రోజులపాటు నాతో మా యింట్లో గడపాలి. ఆయన నా మీద హత్యా ప్రయత్నాలు చేయకుండా కాపాడాలి! ఆయన తప్పు ఆయనే తెలుసుకుని మారేలా చెయ్యాలి!" అన్నది.

బిందు బిగ్గరగా నవ్వేసింది. "చూడండి మంజులా! నేను లాయర్ని, నేను ఒక్కరికే పరిమితమైనదాన్ని కాదు. ప్రతిక్షణం నా అవసరమున్న వాళ్ళెందరో! నా క్లయింట్సు నిరంతరం నన్ను కలవటానికి వస్తుంటారు. వారంరోజులపాటు నేను మీ యింట్లో గడపటం అన్న ప్రశ్నేలేదు!

ఒక్కగంట కూడా గడపలేను....

ఇకపోతే. మనిషి ప్రవృత్తి అంత తేలిగ్గా మారదు. నేను వారంరోజులు కాదు, సంవత్సరంపాటు మీ యింట్లో వున్నా మీ వార్ని మార్చటం అసంభవం! అంతేకాదు, అతను మిమ్మల్ని హతమార్చాలని ఖచ్చితంగా నిర్ణయించు కునే వుంటే, ఎవరూ రక్షించలేరు—మీరతనికి దూరంగా వెళ్ళిపోతే తప్ప! మీ కోరిక తీర్చలేను....సారీ!" అన్నది బిందు.

మంజుల దెబ్బతిన్నట్టు చూసింది బిందువంక. వేనిటీ బ్యాగ్‌నించి వందరూపాయల నోట్లకట్ట తీసి టేబిల్‌మీద పెట్టింది. "ఎన్నివేల రూపాయలు కావాలన్నా ఫీజు కింద యిస్తాను. మీకు...."

మంజుల మాటలు పూర్తి కానేలేదు. బిందు ముఖం కోపంతో జేవురించింది. ముక్కుపుటాలు అదిరాయి.

"ప్లీజ్, కీపిట్ యిన్‌సైడ్! నన్ను డబ్బుతో కొనటా నికి ప్రయత్నించవద్దు. మీ డబ్బుకి దాసోహమనే వాళ్ళు చాలామంది వుండొచ్చు, వెళ్ళి వాళ్ళని వెతుక్కోండి. ప్లీజ్ గో అవుట్!" అన్నది బిందు, తీక్షణంగా.

మంజుల నోట్లకట్టను బ్యాగ్‌లో పడేసుకుని హుం అంటూ గట్టిగా నేలని తన్ని విస విస బయటకి వెళ్ళి పోయింది.

బిందు కళ్ళు మంజుల కూచుండిన కుర్చీకింద వున్న వస్తువుమీద పడ్డాయి. కిందికి వంగి దాన్ని అందుకున్నది!

2

మరునాడు ఉదయం లోకల్ పేపర్ తిరగేస్తూ ఉలిక్కి పడింది లాయర్ బిందు. చివరి కాలంలో ఓ మూలగా వున్న వార్త ఆమె నాకర్షించింది.

'హృద్రోగాల స్పెషలిస్ట్ డాక్టర్ జగదీష్ మరణం!' అన్న హెడ్డింగ్ కింద యిలా రాయబడి వున్నది.

"ప్రఖ్యాత హృద్రోగ నిపుణులైన డాక్టర్ జగదీష్ గత రాత్రి గుండెపోటుతో మరణించారు. ఆయన వయసు ముప్పయిరెండు సంవత్సరాలు. ఆయన భార్య ప్రఖ్యాత పారిశ్రామికవేత్త నిరంజన దాస్‌గారి ఏకైక కుమార్తె. ఆయనకు పిల్లల్లేరు. అతి పిన్నవయసులోనే దివంగతులైన డాక్టర్ జగదీష్ మరణంపట్ల సన్నిహితులు తీవ్ర సంతాపం ప్రకటిస్తున్నారు."

లాయర్ బిందు మస్తిష్కం, తీవ్రంగా ఆలోచిస్తోంది. మంజుల తన భర్తవల్ల తనకి ప్రమాదం శంకిస్తూ ఫిర్యాదు చేసి యిరవైనాలుగ్గంటలు కూడా కాలేదు. యింతలోనే జగదీష్ గుండెపోటుతో మరణించటం నమ్మశక్యంగావటం లేదు. ఇందులో ఏదో మెలికెవున్నది!

బిందు ఫోన్ ముందుకు లాక్కుని ఏదో నంబర్ రింగ్ చేసింది.

అవతల్నుంచి "హల్లో, క్రైంబ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ హియర్!" అని వినిపించింది.

బిందు "అయామ్ బిందూ దిస్ సైడ్!" అన్నది.

శ్రీనివాస్ గొంతులో ఉత్సాహం, ఆనందం ప్రకటితమయ్యాయి. "నమస్తే వదినగారూ! చాన్నాళ్ళ తర్వాత మిమ్మల్ని ఫోన్‌మీద చూస్తున్నాను" అన్నాడు.

"ఈరోజు పేపర్లో డాక్టర్ జగదీష్ మరణం గురించి వార్త చూశారా?"

"ఆఁ, యిప్పుడే చూశాను. పాపం, గుండె ఆగి చనిపోయాడట. చాలా మంచి డాక్టరుగా జగదీష్‌కి పేరుంది. చిన్న వయసులోనే గొప్ప అనుభవం సంపాదించాడు

అతని హస్తవాసి మంచిదంటారు."

"అతను యింత చిన్న వయసులోనే అకస్మాత్తుగా చనిపోయాడంటే మీ కనుమానం రావటం లేదా?"

"నిజమే ననుకోండి. కాని, గుండె పోటని రాశారు కదా! నిజమే కావచ్చును."

"నిజం కాకపోవచ్చును. వెరిఫై చేసి చూడండి!"

"కాని....ఏక్సిడెంటో, మర్డరో అయితే తప్ప మేం కల్పించుకోవటం సబబుగా వుండదేమో...."

"అనుమానంమీద పరిశోధించే హక్కు మీ కుంటుం దిగా ..."

"అంటే మీరు జగదీష్‌ది సహజ మరణం—అదే గుండెపోటుతో మరణించటం—విషయం నమ్మటంలేదు-అవునా?"

"ఎగ్జాట్లీ! అందుకు బలమైన కారణముంది. ఆ విషయం ముఖతః మాట్లాడుకోవచ్చును. నా మాటమీద నమ్మకముంటే వెంటనే. శవాన్ని స్మశానానికి తరలించక ముందే మీ పోలీస్ డాక్టరుచేత పరీక్ష చేయించండి, పోస్ట్ మార్టం చెయ్యాల్సిన అవసరం గురించి డాక్టరే ప్రకటిస్తాడు!"

"ఓ-కే! మీ మాటమీద నాకు గురి! మీరు అనుమానించారంటే. అది ఖచ్చితంగా సెంట్ పర్సెంట్ కరెక్టు! గతంలోని అనుభవాలు యీ సంగతి యిదివరకే రుజువు చేశాయి. యిప్పుడే సిబ్బందితో బయల్దేరున్నాను బై దిబై, అడ్రసు వివరంగా తెలీదు. మీకు తెలిస్తే చెప్తారా?"

బిందు తనకు మంజుల యిచ్చిన చిరునామా శ్రీనివాస్‌కి చెప్పింది.

"జగదీష్ యింటిదగ్గర్నుంచి సరాసరి మీదగ్గరకు వస్తాను" అంటూ ఫోన్ పెట్టేశాడు శ్రీనివాస్.

బిందు ఓ రెండు నిమిషాలేదో ఆలోచిస్తూ కూచున్నది. ఆ తర్వాత చకచక లేచి డ్రెస్ చేసుకున్నది.

పోర్టికోలోంచి ఫియట్ కారు బయటకు తీసింది.

3

శ్రీనివాస్ తన సిబ్బందితో జగదీష్ యింటికి వెళ్ళే సరికి అక్కడ జనం మహా ప్రవాహంలా వున్నారు. డాక్టర్లు, జగదీష్ కస్టమర్సు, బంధు మిత్రులు చాలామంది చేరారు

జగదీష్‌ని బరియల్ గ్రౌండ్‌కి తరలించటానికి సన్నాహాలు పూర్తయ్యాయి. పోలీసులు రంగప్రవేశం చెయ్యగానే అందరు ఆశ్చర్యంగా చూశారు.

పోలీసు డాక్టరు జగదీష్ శవంవైపు నాలుగడుగులు వేశాడో లేదో "ఆగండి!" అంటూ అరిచాడో యువకుడు.

డాక్టరు ఆగి శ్రీనివాస్‌వంక, ఆ యువకుడివంక ప్రశ్నార్థకంగా చూశాడు.

ఆ యువకుడు శ్రీనివాస్‌వంక తీవ్రంగా చూసి, "మా బావగారు గుండె ఆగి మరణించారు. హత్యగాని, ఆత్మహత్యగాని కాదు. మీ పోలీసులు యిందులో జోక్యం చేసుకోవలసిన పనిలేదు. మీరెందు కొచ్చారో తెలుసుకో వచ్చునా?" అన్నాడు.

"డాక్టర్ జగదీష్‌గారిది సహజ మరణం కాదని మాకు రిపోర్టులు వచ్చాయి. మా డాక్టర్‌తో ఒక్కసారి ఎగ్జామిన్ చేశాక మా అనుమానం నిరాధారమైనదయితే క్షమాపణ చెప్పుకుని వెళ్ళిపోతాం!" అన్నాడు శ్రీనివాస్ అనునయంగా.

"మా బావగార్ని పరీక్షించిన డాక్టర్ యిక్కడేవున్నారు. ఆయన బాగా అనుభవమున్న కార్డియాలజిస్ట్. ఎమ్మెస్. ఆయనకన్న గొప్పవారా మీ డాక్టరు?" సవాల్ చేస్తున్నట్టు అన్నాడు ఆ యువకుడు.

"మీరు డాక్టర్ జగదీష్ కేమవుతారు?" అడిగాడు శ్రీనివాస్.

"జగదీష్ మా బావగారు, నా పేరు చంద్రబాబు" అన్నాడా యువకుడు.

"ఐ-సీ-గ్లాడ్ టు సీ యు. మీ డాక్టర్‌గార్ని కించపరుస్తున్నామని మీరు భావించకపోతే ఒక్కసారి మా డాక్టర్‌ని పరీక్ష చేయనివ్వండి!" అన్నాడు శ్రీనివాస్.

ఎర్రగా లావుగా పొట్టిగావున్న ఒకాయన ముందుకొచ్చి శ్రీనివాస్ వంక తీక్షణంగా చూసి "అయాం డాక్టర్ ధనంజయ్. డాక్టర్ జగదీష్‌ని పరీక్ష చేసింది నేనే! ఆయన గుండెపోటువల్ల మరణించారు. సందేహం లేదు! ఇక ఆయన్ని వేరే పరీక్షించాల్సిన అవసరం లేదు!" అన్నాడు.

శ్రీనివాస్‌కి విషమ పరిస్థితి ఎదురయింది. తనది చాలా డెలికేట్ పొజిషన్. అధికారం వుపయోగించే అవకాశం లేదు కేవలం అనుమానం మీద చేసే యిన్వెస్టిగేషన్! మరో చోట అయితే పోలీస్ జులుం ఉపయోగించేవాడే! కాని యిక్కడి పరిస్థితి వేరు!

"అవతల క్రిమేషన్‌కి ఆలస్యమవుతుంది!" అన్నాడు చంద్రబాబు యింక మీరు వెళ్ళొచ్చు అన్నట్టుగా.

అప్పటికే పోలీస్ డాక్టరు జగదీష్ శవాన్ని పైనుంచే జాగ్రత్తగా పరిశీలించాడు. శవం ముక్కునుంచి నోటి నుంచి రక్తం స్రవించిన సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. గుండెపోటుతో జగదీష్ మరణించివుంటే గుండె

ఆగిపోయాక రక్తప్రసరణ ఎలా జరిగింది? అంటే.... రక్తం గుండె ఆగిపోవటానికి ముందే స్రవించి వుండాలి! అంటే గుండెపోటు కారణంగా డాక్టర్ జగదీష్ మరణించాడన్న విషయం అబద్ధం!

అదీగాక గుండెపోటుతో బాధపడ్డ రోగి ముఖంలో బాధ తాలూకు చిహ్నాలు స్పష్టంగా వుంటాయి. కాని, జగదీష్ ముఖం చాలా ప్రశాంతంగా వున్నది! చాలా సుఖంగా, యింకా నిద్రపోతున్నట్టే వున్నది! శరీరం నీలిరంగుకు తిరిగి వున్నది. కారణం తేలిగ్గానే వూహించవచ్చును

"అనుమానం లేదు, జగదీష్ గుండెపోటుతో మరణించిన మాట అబద్ధం. విషప్రయోగం జరిగింది. మనం అధారిటేటివ్‌గా శవాన్ని పరీక్ష చేయటానికి అప్పగించమని అడగొచ్చు." అన్నాడు పోలీస్ డాక్టరు, శ్రీనివాస్‌కి మాత్రమే వినిపించేటంత మెల్లిగా.

శ్రీనివాస్ ముఖంలో సంతోషం బయటికి ప్రకటితం కాకుండా జాగ్రత్తపడ్డాడు. చంద్రబాబువంక సూటిగా చూపి "డాక్టర్ జగదీష్‌ది సహజ మరణం కాదు. మేము ఆయన శవాన్ని పరీక్షచేసి తీరాలి! కావాలంటే యిప్పుడే ఫోన్‌మీద కమిషనర్ ఆఫ్ పోలీస్ చేతగానీ, ఐ. జి. చేతగాని ఆర్డర్సు తెచ్చుకోమంటే అందుకు సిద్ధంగా వున్నాం!" అన్నాడు.

అప్పటిదాకా మౌనంగా నిల్చునివున్న ఏభైఏళ్ళ భారీ వ్యక్తి వాళ్ళ ముందకొచ్చి, "జగదీష్ గుండెపోటుతో మరణించలేదని మీరు విశ్వసిస్తున్నారా?" అనడిగాడు.

శ్రీనివాస్ అవునని తలూపి, "మీ రెవరో తెలుసుకోవచ్చునా?" అన్నాడు.

ఆయన దీర్ఘంగా నిశ్వసించి, "జగదీష్ నా అల్లుడు.

నా పేరు నిరంజనదాస్. జగదీష్‌ని మీరు యధేచ్ఛగా పరీక్షించుకోవచ్చును.” అన్నాడు.

శ్రీనివాస్ ఆయనవంక కృతజ్ఞతగా చూశాడు. పోలీస్ డాక్టరు జగదీష్ మృతదేహాన్ని పరీక్షిస్తూంటే చంద్రబాబు, ధనంజయ్ గుర్రుగా చూశారు.

పోలీస్ డాక్టర్ పరీక్ష ముగించి, “పోస్టుమార్టం చెయ్యాలి! ఈయనకు విషప్రయోగం జరిగింది.” అన్నాడు.

నిరంజనదాస్‌తో బాటు అక్కడున్న అందరు నిర్ఘాంతపోయారు.

చంద్రబాబు అడ్డొచ్చి, “నాన్నగారూ! ఈయన మాటలు మీరు నమ్మొద్దు. పోస్టుమార్టమ్‌కి అంగీకరించవద్దు. బావగారి శరీరాన్ని తునాతునకలు చేసి మనకి అప్పగించటాన్ని చెల్లాయి యెలా భరించగలదు? మనం మాత్రం యెలా సహిస్తాం? వద్దని చెప్పండి!” అన్నాడు.

నిరంజనదాస్ ముఖం గంభీరంగావుంది. నిండుకుండలా వున్నాడు. అతని మనసులో జరిగే సంఘర్షణను బయటికి వ్యక్తం కాకుండా అతి నిగ్రహంతో వ్యవహరిస్తున్నాడు.

“ఇనస్పెక్టర్! ప్రొసీడ్!” అన్నాడు నిరంజనదాస్.

4

లాయర్ బిందు కారు పోర్టికోలో పార్కుచేసి లోపలికొచ్చేసరికి ఆమెకోసం ఎదురుచూస్తున్న ఇనస్పెక్టర్ శ్రీనివాస్ కనిపించాడు.

“మీ అనుమానం సెంట్ పర్సెంట్ కరెక్టు వదినగారూ! అసలు యీ కేస్ వివరాలు తెలియకుండానే మేము రంగంలోకి దిగిపోయాం, కేవలం మీ మాటమీద ఆధారపడి! ఇప్పుడు చెప్పండి, యీ కేస్ పూర్వాపరాలు!”

అన్నాడు శ్రీనివాస్.

బిందు మంజులతో తనకి జరిగిన సంభాషణ వివరంగా చెప్పింది. శ్రీనివాస్ ఆశ్చర్యంగా విన్నాడు.

"మంజుల చెప్పిందంతా అబద్ధమని జగదీష్ మరణం రుజువు చేసింది. జగదీష్‌కి విషప్రయోగం జరిగింది.... అయితే, ఆత్మహత్యా హత్యా అన్నది నిర్ధారణ కావాల్సి వున్నది పోస్ట్‌మార్టమ్ రిపోర్టు యింకా రాలేదు." అన్నాడు శ్రీనివాస్.

"జగదీష్‌ని హత్యచేశారు!" అన్నది బిందు తాపీగా. శ్రీనివాస్ ఆసక్తిగా చూశాడామెవంక.

"మీరు చెప్పిన కథనంబట్టి మంజులే యీ హత్య చేయించి వుండాలి. చంద్రబాబు అందుకు సహాయపడి వుండాలి! అందుకే చంద్రబాబు జగదీష్‌ని పరీక్షించటానికి తీవ్ర అభ్యంతరాన్ని లేవదీశాడు. ఏమై రైట్?" అన్నాడు శ్రీనివాస్.

లాయర్ బిందు మందహాసం చేసింది.

"కాదు. డాక్టర్ ధనంజయ్‌ని వెంటనే అరెస్టు చెయ్యండి. అతనే హంతకుడు!" అన్నది బిందు.

శ్రీనివాస్ నిర్ఘాంతపోయాడు. "వాట్?" అన్నాడు ఆశ్చర్యంగా.

"అవును మిస్టర్ ఇనస్పెక్టర్! ఇదిగో యీ చీటీ చూడండి. ఇది మంజుల నాకు డబ్బివ్వటానికి వేనిటీ బాగ్ తెరిచినపుడు నేలమీద పడిపోయింది. దీని అర్థం నాకు నిన్న అర్థంకాలేదు. ఈరోజు పేపర్లో జగదీష్ మరణ వార్త చదివాక లింక్ అందింది. వెంటనే మీకు ఫోన్ చేశా నందుకే!" అంటూ ఒక కాగితం ముక్క అందించింది బిందు.

శ్రీనివాస్ అందుకుని చూశాడు. అది మందులషాపుల వాళ్ళు డాక్టర్ పేరుతో లెటర్ హెడ్ వేయించి, కింద తమ మందులషాపు పేరు రాసుకునే ప్రిస్క్రిప్షన్‌పాడ్‌లోని కాగితం.

దానిలో తెలుగులో రెండే లైన్లు రాసివున్నాయి.

"లాయర్ బిందును ఎలాగైనా ఒప్పించి నీతో రెండు మూడు రోజులు, కనీసం రేపు ఒక రాత్రి అయినా నీతో గడపటానికి అంగీకరింప చెయ్యి. అనుమానం నీ మీద రాకుండా తిరుగులేని ఎలిబీ వుంటుంది. వీలయినంతవరకు రేపు రాత్రికే పని పూర్తిచేస్తాను." అని వున్నది. సంతకం లేదు.

బిందు తనవంకే ప్రశ్నార్థకంగా చూస్తున్న శ్రీనివాస్‌తో, "మీకు ఫోన్‌చేశాక డాక్టర్ జగదీష్ నడుపుతున్న క్లినిక్ కెళ్ళాను. డాక్టర్ మరణవార్తవిని అతని దగ్గిర పనిచేస్తున్న స్టాఫంతా జగదీష్ యింటికి వెళ్ళారు. ముసలి ఆయా మాత్రం వున్నది. ఆమెనుండి ముఖ్యమైన సమాచారం రాబట్టాను.

నిన్న సాయంత్రం ఆరుగంటలనుంచి డాక్టర్ ధనంజయ్ జగదీష్‌తోనే వున్నాడు. ధనంజయ్‌కి కూడా కార్డియాలజీలో మంచి ప్రాక్టీస్ వుంది. జగదీష్ తర్వాత అతనంత ప్రతిభగల కార్డియాలజిస్ట్ సిటీలో అతనే!

రాత్రి ఎనిమిది గంటలనుంచి తొమ్మిది గంటలవరకు జగదీష్ డిస్పెన్సరీలోని పర్సనల్ గదిలో యిద్దరు డాక్టర్లు తాగుతూ వుండిపోయినట్టు ఆయా చెప్పింది. నేను ఆ గదిలో వాళ్ళు తాగిన గ్లాసుల గురించి వెతికాను. కనిపించలేదు. ఆ గది వెనకపక్కనున్న రాళ్ళగుట్ట దగ్గిర పగిలిన గాజుముక్కలు కనిపించాయి. వాటిని కాగితంలోకి తీసు

కుని చూశాను.

అవి బ్రాందీతాగిన గ్లాసులు. అడుగున ఎర్రటి ద్రవం యింకా తడి ఆరకుండా వున్నది. ఓ గ్లాసు అడుగు ముక్క మీద పూర్తిగా కరగని పొడివున్నది. ఇవిగో ఆ గాజు ముక్కలు.

నేను తిరిగొస్తూ లాబరేటరీలో పరీక్ష చేయించాను. సైనేడ్ క్రిస్టల్స్ ...తక్కువ పర్సెంటేజిలో, తాగిన రెండు మూడు గంటల తర్వాత ప్రభావం చూపించేలా జాగ్రత్తలు తీసుకున్నాడు ధనంజయ్. బ్రాందీలో విషం కలిపి, తొమ్మిది గంటలకి సంజీవరెడ్డి నగర్‌లోని జగదీష్ యింట్లో అతన్ని దిగబెట్టి తన యింటికి వెళ్ళిపోయాడు.

ఆ తర్వాత అరగంటకో, గంటకో సైనేడ్ తన ప్రభావం చూపించింది. మెలకువ రాకుండానే ఆ మత్తులోనే హాయిగా ప్రాణాలొదిలేశాడు జగదీష్ మంజుల హడావిడి చేసి అందర్నీ లేపి. ఏం ఎరగనట్టు ఫోన్‌మీద ధనంజయ్‌ని పిలిపించి గుండెపోటుతో జగదీష్ చనిపోయినట్టు ప్రకటింప చేసింది.

ఇదంతా మంజుల ధనంజయ్‌లు ఆడిన నాటకం! ధనంజయ్‌లాంటి పేరుమోపిన హృద్రోగ నిపుణుడు గుండె పోటు అని నిర్ధారించాక మరొకరు పరీక్షచేసే అవసరమే లేదు. సిటీలోకల్లా పేరుమోపిన కార్డియాలజిస్ట్ కావటంవల్ల జగదీష్ మరణవార్త లోకల్ పేపర్లో వెంటనే వచ్చేసింది.

ఇవిగో, యీ గ్లాసు ముక్కలమీద మీ క్కావలసిన ధనంజయ్ వేలిముద్రలు దొరుకుతాయి. ధనంజయ్ ప్రిస్క్రిప్షన్ చీటీమీద దస్తూరీ అతనిదేనని దానికింద రాయబడ్డ మందులషాపువాళ్ళు కన్ఫర్మ్ చేశారు కూడా. ఈ రెండు ఆధారాలు చాలవా ధనంజయ్‌ని పట్టివ్వటానికి?"

అన్నది.

శ్రీనివాస్ దిగ్భ్రాంతినుంచి తేరుకుని, "ధనంజయ్ యీ హత్య ఎందుకు చేసినట్టు?" అనడిగాడు.

బిందు మందహాసం చేసింది. "నంబర్ వన్! జగదీష్ పోతే ధనంజయ్ సిటీలోని నంబర్ వన్ కార్డియాలజిస్ట్ అవుతాడు. రెండోది, ధనంజయ్ మంజుల మధ్య అక్రమ సంబంధం."

శ్రీనివాస్ ఆమెకు కృతజ్ఞతలు చెప్పి వెళ్ళిపోయాడు. ఓ గంట తర్వాత బిందుకి శ్రీనివాస్ ఫోన్‌చేసి చెప్పాడు. "ధనంజయ్ నేరం అంగీకరించారు!" అని. □

పెద్ద పాదం! పెద్ద దొంగ!!

జొన్నలగడ్డ రామలక్ష్మి

పాపజీవి

సీతన్న పంతులు ఒక్కడూ ఇంట్లో కూర్చుని అకౌంట్ పుస్తకాలు తిరగేస్తున్నాడు. ఆ పుస్తకాలాయన ఇన్‌కం టాక్సు డిపార్టుమెంటువారికోసం ప్రత్యేకంగా తయారు చేసినవి. అయితే వాటిలోనే అసలకౌంట్సుకి సంబంధిం

చిన క్లూలుంటాయి. అవి సీతన్న పంతులొక్కడు మాత్రమే తెలుసుకోగలడు.

ఆయన కా ఊళ్ళో కిరాణా దుకాణముంది. రోజుకి చిల్లరగా అమ్మేది యాభై వేలకు తక్కువుండదని అంతా చెప్పుకుంటారు. పద్దు పుస్తకంలో మాత్రం అమ్మకం వెయ్యి పై చిలుకని ఉంటుంది. చిల్లర బేరాలు కాకుండా టోకున ఆయన రోజుకి రెండులక్షల రూపాయల వ్యాపారం చేస్తారని ప్రతీతి. అందులో కొంత బంగారం స్మగ్లింగూ ఉంటుంది. కొంత బియ్యం, పప్పులాంటివీ ఉంటాయి.

సీతన్న పంతులిది చిన్న డాబాయిల్లు. అందులో ఆయన, భార్య, ముగ్గురు పిల్లలు వుంటున్నారు. ఆ యిల్లుచూస్తే రోజూ లక్షల వ్యాపారంచేసే భాగ్యవంతుడి నివాస గృహ మనిపించదు. నెలకు రెండువేలు తెచ్చుకునే గవర్నమెం టుద్యోగి క్వార్టర్లా ఉంటుందది.

ఆయన వ్యాపారం పదేళ్ళక్రితం ప్రారంభించాడు. అప్పుడీ యింట్లోనే అద్దెకు ప్రవేశించాడు. బాగా కలిసొచ్చింది. రెండేళ్ళలో ఆ యిల్లే కొనేశాడు. యింట్లోకి కాస్త ఫర్నిచర్ చేరింది తప్పితే—యింట్లో యింకేమీ మార్పులు చేయించలేదాయన. మనిషికి గర్వంలేదని, సింపుల్‌గా జీవిస్తాడనే కాక బాగా పాపభీతి ఎక్కువని అంతా చెప్పుకునేవారు. ఇప్పటికీ చుట్టుపక్కల ఆయనకు మంచి పేరుంది.

ఇప్పుడు పెద్దబ్బాయి విశాఖపట్నంలో ఇంజనీరింగ్ కాలేజీలో ఫైనలియర్లో ఉన్నాడు. పెద్దమ్మాయి మెడిసిన్ రెండో సంవత్సరం. ఆఖరివాడిక్కడే తొమ్మిదవ తరగతి చదువుతున్నాడు. ఈరోజు తల్లీ కొడుకు లిద్దరూ కలిపి

మేట్నీ సినిమాకు వెళ్ళారు.

సీతన్న పంతులు సినిమాలు చూసేది తక్కువ. ఎప్పుడైనా చూసినా ఒంటరిగా చూస్తాడు దుకాణాన్ని నమ్మకస్థులైన మనుషు లిద్దరికప్పగించాడు. వాళ్ళమీద ఎప్పుడు మెరుపుదాడులు చేస్తాడో వాళ్ళకే తెలియదు. ఆయనకీ తెలియదు. అందువల్ల వాళ్ళు అయిదేళ్ళనుంచీ ఆయనకు నమ్మకస్థులుగానే ఉంటున్నారు. అదీకాక సీతన్నపంతులు—వాళ్ళిద్దరికీ నెలజీతాలివ్వడమేకాక—అవసరమైనప్పుడల్లా ధనరూపేణా, వస్తు రూపేణా సాయంచేసి ఆదుకుంటూంటాడు. అందుకాయన అవసరమే కారణమైనా—అంత బాగా మరెవరివద్దా ముట్టకపోవడంవల్ల కూడా వాళ్ళాయనకు నమ్మకస్థులుగా ఉంటున్నారు.

వ్యాపారం ఏ దశలో ఉన్నదీ తెలుసుకోవడంకోసం, ఇన్‌కంటాక్సువారి నింకా ఏవిధంగా తప్పుదారిని పట్టించవచ్చో అన్నది తేల్చుకోవడం కోసం, తన మెరుపుదాడి ఎప్పు డవసరమూ అన్నది నిర్ణయించడంకోసం యిప్పుడాయన పద్దు పుస్తకాలు తిరగేస్తున్నాడు. సరిగ్గా అప్పుడే ఎవరో కాలింగ్‌బెల్ మ్రోగించారు.

సీతన్న పంతులు పుస్తకాలు మూసి అలమారాలో పెట్టి తనే వెళ్ళి తలుపు తీశాడు. అక్కడ పనిమనిషి రత్తమ్మ ఉంది.

"ఈవేళ పనిలోకి రానన్నావేమో!" అన్నాడాయన.

"పనిలోక్కాదు బాబూ! డబ్బులకోసం వచ్చాను...."

"డబ్బులెందుకే—ఏనెల జీతం ఆనెలే ఇస్తున్నాంగా."

"మావాడికి జబ్బు చేసింది ..." అంది రత్తమ్మ.

"ఎంతకావా లేమిటి?" అన్నాడు సీతన్నపంతులు.

"యాభై రూపాయలండి...." ఆదుర్దాగా అంది

రత్తమ్మ.

"లోపలకు రా...." అన్నాడు సీతన్న పంతులు తను లోపలకు నడుస్తూ. రత్తమ్మ ఆయన్ననుసరించి లోపలకు వెళ్ళింది.

"అలా కూర్చో...." అన్నాడు సీతన్న పంతులు.

రత్తమ్మ నేలమీద కూర్చుంది.

సీతన్న పంతులు బీరువా తలుపులు తీశాడు. అందులో వానిటీ బ్యాగొకటి తీసి రత్తమ్మ చేతికిచ్చి—"ఇందులో ఏముంటే అది నీదే—తీసుకో!" అన్నాడు.

ఊహించని ఈ ఔదార్యానికి రత్తమ్మ తెల్లబోయింది. అది ఆత్రుతగా ఆ బ్యాగుతెరచి డబ్బుకోసం చూసింది. అంతా వెతికితే రెండు పదిపైసల నాణేలూ, ఓ అయిదు పైసల నాణెమూ ఉన్నాయి.

"నాతో ఎగతాళేంటి బాబూ!" అంది రత్తమ్మ.

"ఎగతాళికాదు. ఇంట్లోవున్న డబ్బదే...." అన్నాడాయన.

"ఇష్టం లేకపోతే ఇవ్వనని చెప్పొచ్చుగా బాబూ...." అంది రత్తమ్మ.

"నేను నిజమే చెప్పాను...." అన్నాడు సీతన్న పంతులు.

"నేను నమ్మను."

"పోనీ నువ్వే బీరువాలో ఏముందో చూడు."

ఏమనుకుందో రత్తమ్మ వెంటనే లేచి బీరువాదగ్గరకు వెళ్ళింది. వెతకక్కర్లేకుండానే బీరువా అరలో ఎదురుగా ఓ మనీపర్సు కనిపించింది రత్తమ్మకు. ఆమె అది తీసి చూసింది. నిండా నోట్లు. వంద, యాభై, ఇరవై, పది—రూపాయలనోట్లున్నాయి.

"ఇదిగో బాబూ—ఇందులోంచి యాభై రూపాయలు నా కివ్వండి...." అంది రత్తమ్మ.

"అయ్యో అది నా డబ్బు. అమ్మగారికి తెలీకుండా ఖర్చుపెట్టాలనుకున్నప్పుడే నే నిందులో డబ్బు వాడతాను." అన్నాడు సీతన్న పంతులు.

"అంటే?"

ఇంటి వాడకాని కింట్లో కొంత డబ్బుంటుంది. అదంతా ఆయన భార్యవద్దనే వుంటుంది. ఇప్పు డామె సినిమాకి వెడుతూ ఆ డబ్బంతా తీసుకుని వెళ్ళిపోయింది.

"మగాళ్ళకి ఆడాళ్ళకు చెప్పకూడని ఖర్చులుంటాయి. ఆ ఖర్చులకోసం ఇది నేను దాచుకున్నాను. నువ్వు మా యింట్లో పనిచేస్తున్నావు. నీవల్ల మీ అమ్మగారికే ప్రయోజనం. నీ కెప్పుడు అవసరమైనా ఆవిడే డబ్బిస్తుంది. నాకూ నీ వల్ల ప్రయోజనమేదైనా వుందంటే చెప్పు. ఆ పర్సులోంచి తీసి డబ్బిస్తాను."

రత్తమ్మకు కాస్త అర్థమయింది.

సీతన్న పంతులు వయసు నలభై అయిదుంటుంది. రత్తమ్మ వయసు ఇరవై కీ పాతిక్కీ మధ్య. మనిషి పని చేసుకుని బ్రతుకుతుంది కాబట్టి దృఢంగా వుంటుంది. ఆయన ఆమెవంక చాలాసార్లు ఆకలి చూపులు చూశాడు. ఒకటి రెండుసార్లు దాన్ని చేయిపట్టుకునీ, కావాలని ఢీకొనీ చూశాడు. రత్తమ్మలో అనుగ్రహానికి బదులు ఆగ్రహం కనపడ్డంలో, అవన్నీ పొరపాటున జరిగినట్లు నటించడమే కాక "కాళ్ళు నెత్తిమీదెట్టుకొని నడుస్తున్నావా-" అని తనే కసిరాడు కూడా.

ఇప్పుడాయన కవకాశ మొచ్చింది. డైరెక్టుగా అడిగాడు.

"నే నలాంటిదాన్ని కాదు బాబూ!" అంది రత్తమ్మ.

"సరే—ఆ పర్సలాగిచ్చి వెళ్ళిపో" అన్నాడు సీతన్న పంతులు.

రత్తమ్మ యింకేమీ మాట్లాడకుండా ఆయనకు పర్సు తిరిగిచ్చేసి అక్కణ్ణించి వెళ్ళిపోబోయింది.

"అబ్బ యేం పౌరుషమే నీకు....డబ్బిస్తాన్లే" అన్నాడాయన.

రత్తమ్మ వెనుదిరిగింది. సీతన్న పంతులు చేత్తో యాభై రూపాయల నోటు పట్టుకున్నాడు. ఆశకూ, అనుమానానికీ మధ్య ఆమె మనసు కొద్దిక్షణా లూగిసలాడింది. ఆశ అనుమానాన్ని జయించగా ఆమె మళ్ళీ సీతన్న పంతుల్ని సమీపించింది.

సీతన్న పంతులు నోటు కిందపెట్టాడు. దానిమీద పర్సు ఒత్తుపెట్టాడు.

"ఉత్తినే డబ్బు తీసుకోవడం అన్యాయం కదే...." అన్నాడాయన.

"మీరు నన్నలాగనడం న్యాయమా బాబూ." అంది రత్తమ్మ.

"ఇందులో తప్పేముందే? నువ్వాడదానివి. నేను మగాణ్ణి. భగవంతుడు మనల్నొకరికోసం ఒకరిని పుట్టించాడు. నాకు నువ్వంటే మనసైంది. నీకూ నేనంటే మనసైతే కాసేపు స్వర్గం చూడొచ్చు...." అన్నాడు సీతన్న పంతులు.

రత్తమ్మ ఏదో అనబోయింది. ఆయన బలవంతంగా దాన్ని దగ్గరగా తీసుకుని "దేవుడు మగాడికి బలాన్నిచ్చింది ఆడదాన్ని లొంగదీసుకునేందుకే." అన్నాడు.

రత్తమ్మ విదుల్చుకోబోయింది. ఆయన పట్టు బలంగా వుంది.

"వదలకపోతే అరుస్తాను బాబూ!" అంది రత్తమ్మ కోపంగా.

సీతన్నపంతు లొకచేత్తో ఆమె నోరు నొక్కి, "అరవ దంవల్ల నీకే నష్టం. నువ్వు నాయింట్లో దొంగతనాని కొచ్చావని చెబుతాను. చుట్టుపక్కల జనం, పోలీసులు అందరూ నామాటే నమ్ముతారు. అప్పుడు నువ్వు జైల్లో కెడతావు. అక్కడ పోలీసులు నిన్ను దారుణంగా చెడ గొడతారు. జైలుకెళ్ళావని నీ కింకెక్కడా పని దొరకదు. నీ మొగుడు నిన్ను వదిలేస్తాడు. నీ జీవితం కుక్కలు చింపిన విస్తరవుతుంది" అన్నాడు.

రత్తమ్మ భయంగా ఆయనవంకే చూసింది.

"ఎందుకే అలా భయిపడతావు? నీకేమో డబ్బుకి డబ్బు....అటుపైన ప్రమాదమూ తప్పుతుంది." అన్నా డాయన.

రత్తమ్మ ప్రతిఘటించడం మానేసింది.

సీతన్న పంతు లామె నోటినుంచి చేయి తీశాడు.

ఆ తర్వాత ఆమె అరవనూ లేదు.

2

టైము సాయంత్రం అయిదు గంటలయింది.

గవరయ్య విసురుగా సీతన్న పంతు లింటి కొచ్చాడు.

అర్జెంటుగా యాభై రూపాయలు కావలసొచ్చాయి. తనకు వంట్లో బాగోలేదని అబద్ధమాడి యజమాని నడిగి డబ్బుతెమ్మని భార్యను మూడున్నరకు కాబోలు పంపాడు. ఇప్పటికీ రాదు. ఎప్పటికీ రాదు.

ఉన్నపళంగా వస్తే రానూ పోనూ కలిపి అరగంట. ఇప్పుడే వస్తానన్న మనిషి ఎప్పటికీ రాకపోయేసరికి గవ రయ్యకు ఓపిక చచ్చి తనే బయల్దేరాడు.

ఇంటి తలుపులు వేసి వున్నాయి.

కాలింగ్‌బెల్ కొట్టాలన్న ఊహ వాడికి రాలేదు. బలంగా తలుపు నొక్కి తోపు తోశాడు ఆవేశంలో వున్నపుడు వాడి బుర్ర సరిగ్గా పనిచేయదు.

వాడు తలుపు తోసీ తోయగానే వేయబడిన నేల గడియ సరిగా పడలేదో ఏమో - భళ్ళున తెరుచుకుంది. అప్పుడు వాడక్కడ అటూ యిటూ చూశాడు. ఓ పక్కగదిలోంచి అలికిడవుతోంది. అటే నడిచి గదిలో అడుగుపెట్టాడు.

గదిలో మంచం. మంచంమీద ఇద్దరు స్త్రీ పురుషులు. వారిలో స్త్రీని రత్తమ్మగా గుర్తుపట్టాడు గవరయ్య.

అలికిడి కిద్దరూ గవరయ్యవైపు తిరిగారు.

తప్పు చేస్తున్నారని ఏమాత్రమూ అనుమానించ నవసరం లేని స్థితిలో వాళ్ళిద్దరూ గవరయ్యకు దొరికి పోయారు.

రత్తమ్మకు కళ్ళు తిరిగినట్లయింది.

సీతన్న పంతు లుత్సాహమంతా చల్లారిపోగా నోటమాట రాలేదు.

గవరయ్య వారివంక ఓ క్షణం తీక్షణంగా చూశాడు. తర్వాత గదంతా కలయజూశాడు.

తెరచివున్న బీరువా. నేలమీద యాభై నోటు. దాని మీద మనీపర్సు.

గవరయ్య బీరువా దగ్గరకు నడిచాడు. అందులో అయిదారు నగలు కనిపిస్తే వాటిని జేబులో వేసుకున్నాడు. నేల మీద డబ్బునూ, పర్సునూ జేబులో పెట్టుకున్నాడు. తర్వాత సీతన్న పంతులు దగ్గరకు వెళ్ళాడు. ఎడా పెడా రెండు

చెంపలూ వాయించాడు. రత్తమ్మ చేయి పట్టుకున్నాడు.

"తప్పైపోయింది...." అంది రత్తమ్మ భయంగా.

"తప్పు నీ దెందుకవుతుందే.... పెద్దోళ్ళింట్లో ఆడదానికే అన్యాయం జరిగినా ఆ తప్పు ఆడదానిది. మనిళ్ళలో ఆడదానిది తప్పుండదు. తప్పంతా మగాడిది. నిన్ను పనికి పంపడం నా తప్పు. ఆపైన నీమీద మనసవడం వీడి తప్పు...." అని "నాతో వచ్చేస్తావా?" అన్నాడు గవరయ్య.

"ఊఁ" అంది రత్తమ్మ.

గవరయ్య జేబులో నగలున్నాయి. డబ్బుంది అంతా సీతన్న పంతులుకు చెందినదే! వాడు రత్తమ్మను తీసుకుని ఇంట్లోంచి వెళ్ళిపోతూ. "ఇది నీ తప్పుకి జరిమానా. ఇంకెప్పుడూ ఇలాంటి తప్పులు చేయకు. అస్తమానూ యిలాగే జరిమానాతో వదిలిపెట్టను నేను...." అన్నాడు.

సీతన్న పంతులు కిక్కురుమనలేదు.

గవరయ్య, రత్తమ్మ ఇంట్లోంచి వెళ్ళిపోగానే ఆయన వీధి తలుపులు జాగ్రత్తగా వేసివచ్చి టెలిఫోన్ దగ్గరకు వెళ్ళాడు. పోలీసులకు ఫోన్‌చేసి తన పనిమనిషీ, ఆమె భర్తా వచ్చి తనను బెదిరించి దోచుకుపోయారనీ—పోలీసులకు చెబితే ఆయన శీలానికే చెడ్డపేరు తెస్తామని హెచ్చరించారనీ చెప్పాడాయన.

"నాకు చెడ్డపేరు వచ్చినా ఫరవాలేదు. నేరస్థులు తప్పించుకుపోవడానికి వీల్లేదు." అంటూ సీతన్న పంతులు పోయిన నగల వివరాలు, డబ్బు మొత్తం అన్నీ పోలీసులకు చెప్పాడు.

"మీరేమీ వర్రీ కాకండి. వెంటనే వాళ్ళనరెస్టుచేస్తాం!" అన్నాడు అవతల్నుంచి పోలీస్ ఇన్‌స్పెక్టర్.

3

రాత్రి ఎనిమిది గంటలకు సీతన్న పంతులుకు పోలీస్ స్టేషన్నించి ఫోన్ వచ్చింది. దొంగలు పట్టుబడ్డారు. పోలీసు లాయన్ని రమ్మంటున్నారు. భార్య కూడా వస్తానన్నప్పటికీ వద్దని ఆయనొక్కడే స్టేషనుకు వెళ్ళాడు.

ఇనస్పెక్టర్ ఆయన్ను పోయిన నగల వివరాలడిగాడు. సీతన్న పంతులు నగలు, డబ్బు మనీపర్సు వర్ణనతో సహా కచ్చితంగా చెప్పాడు. దొరికిన వస్తువులు ఆయన వర్ణనకు సరిపోయాయి.

ఇప్పు డాయన ముందు గవరయ్య, రత్తమ్మ ప్రవేశ పెట్టబడ్డారు. గవరయ్యాయన్ను చూస్తూనే "నువ్వింత పని చేస్తావా? ఆ వెధవ పని చేస్తున్నప్పుడే నిన్ను నిలువునా నరికేసి ఉండాల్సింది" అన్నాడు.

"వెధవ పని చేసింది నువ్వా....పైగా నరకడం కూడానా... నోటికి వచ్చినట్లు పేలకు. శిక్ష పెరగ్గలదు." అన్నాడు సీతన్న పంతులు.

రత్తమ్మ ఆయనవంక ఛీత్కారంగా చూసి - "మా కన్యాయం చేశావు. ఇంతకింతా నాశనమైపోతావు...." అంది.

"న్యాయాన్యాయాలా భగవంతుడికే తెలుసు. అన్యా యాన్నాయన అప్పుడే శిక్షించాడు కూడా...." అన్నాడు సీతన్నపంతులు.

"జైల్నించి తిరిగిరాగానే నీ అంతు చూస్తాను...." అన్నాడు గవరయ్య ఉద్రేకంతో రొప్పుతూ.

ఇనస్పెక్టర్ సీతన్నపంతులు వంక వినయంగా చూసి - "వాళ్ళ సంస్కారమే అంత....మీరేమీ అనుకోకండి. రెండ్రోజులు లాకప్పులో ఉన్నారంటే గౌరవంగా మాట్లా

ర్థం నేర్చుకుంటారు" అన్నాడు.

"అదేం నాకు బాధగాలేదు ఇనస్పెక్టర్! ఈ రత్తమ్మ మా యింట్లో చాలా నమ్మకంగా పనిచేస్తోంది. దీనికిలాంటి బుద్ధి పుడుతుందనుకోలేదు." అన్నాడు సీతన్నపంతులు నిట్టూర్చుతూ.

"అందుకే వీళ్ళ బ్రతుకులిలా తగలడ్డాయి సార్. వీళ్ళకు బొత్తిగా పాపభీతి లేదు" అన్నాడు ఇనస్పెక్టర్.

"ఇనస్పెక్టరుగారూ - అలా మాట్లాడకండి. తాళి కట్టించుకుని తనతో కాపరం చేయడానికొచ్చిన పెళ్ళానికే పంతులుగారన్యాయం చేయబోతే తప్పులేదా - నేను చేసింది అంతకంటే పెద్ద తప్పా!" అంది రత్తమ్మ ఆవేశంగా.

చాలాసేపు రత్తమ్మ, గవరయ్య కూడా సీతన్నపంతుల్ని తూలనాడారు. ఆయన అంతా శాంతంగా సహించి యినస్పెక్టర్‌తో "అయ్యా! ఇందులో నేను మిమ్మల్నికోరేదొక్కటే. ఈ దేశంలో ఆడదాని సంగతి మీకు తెలియందేముంది. భర్తకోసం ఏమైనా చేస్తుంది. తప్పంతా ఆ గవరయ్యగాడిది. మీరు దీన్ని వదిలిపెట్టండి. దాని మాటల్ని పెద్దగా పట్టించుకోకండి." అని గవరయ్యతో "జైల్నించి తిరిగొచ్చేక నన్నేంచేయాలో జైల్లో కూర్చుని తీరికగా ఆలోచించుకుందువుగాని. ముందు నీ భార్య జైల్లోపడకుండా ఉండే మార్గం చూడు. ఇందులో నేను చేయగల సాయం నేను చేస్తాను" అన్నాడు.

అప్పటికా దంపతులిద్దరూ మంచి ఆవేశంలో ఉన్నారు. అంచేత సీతన్నపంతులింకేమీ చెప్పకుండా వెళ్ళిపోయాడు.

ఇనస్పెక్టర్‌కి కూడా రత్తమ్మను లాకప్‌లో ఎక్కువ రోజులుంచుకోవడం ఇష్టంలేదు. ఆయనకు కొన్ని ఆదర్శాలున్నాయి. అసలే యిప్పుడు పోలీసులకు చెడ్డపేరు వచ్చింది.

రత్తమ్మేమో మనిషి బాగుంది. వయసులో వుంది. ఏ కాని వేళలో ఎవరో ఒకరు దానితో మోటుగా ప్రవర్తించవచ్చు. తమ వృత్తి అలాంటిది. కానీ జనమది అర్థంచేసుకోరు. నేరస్థులతో వ్యవహరించే వాళ్ళని యూనివర్సిటీ ప్రొఫెసరులా మసలా అంటారు. యూనివర్సిటీ ప్రొఫెసర్లెలా మసలుతున్నారో ఎంతమందికి తెలుసు?

రెండు రోజుల్లో గవరయ్య, రత్తమ్మ కూడా దిగి వచ్చారు. తప్పంతా తనదేనని గవరయ్యొప్పేసుకున్నాడు. రత్తమ్మను వదిలిపెట్టేశారు.

4

"నిన్నా-మళ్ళీ పనిలో పెట్టుకోవడమా. అమ్మబాబోయ్-అయ్యగారొప్పుకోరు." అంది సీతన్నపంతులు భార్య గౌరీదేవి.

"మీ కిష్టమైతే అయ్యగారొప్పుకుంటారామ్మా...." అంది రత్తమ్మ.

"వెళ్ళి ఆయన్నే అడుగు. నిప్పులాంటి మనిషిమీద నింద వేశావు. ఆ పాపమే నిన్ను కట్టి కుడుపుతోంది" అంది గౌరిదేవి.

"మీరూ రండమ్మా" అంది రత్తమ్మ.

"నేను రాను. నేనొస్తే నిన్ను తనదాకా రానిచ్చానని మండిపడతా రాయన" అంది గౌరీదేవి తను స్నానాలగది లోకి వెడుతూ.

అప్పుడు రత్తమ్మ సీతన్నపంతులు గదిలోకి వెళ్ళింది. ఆయన పద్దు పుస్తకాలు చూసుకుంటూండగా - "బాబూ!" అంది.

"ఊఁ" అన్నాడాయన తలెత్తి చూడకుండా.

"నేను రత్తమ్మని బాబూ!" దీనంగా అంది రత్తమ్మ.

సీతన్నపంతులు తలెత్తి చూసి "నువ్వా-ఇక్కడి కెందు కొచ్చావ్?" అన్నాడు కోపంగా.

"మీ యింట్లో పనిప్పించండి బాబూ." అంది రత్తమ్మ.

"మళ్ళీ మా యింటి గడప తొక్కనన్నావ్ కదా."

"ఏదో ఆవేశంలో అలాగన్నాను బాబూ! ఎక్కడి కెళ్ళినా నాకు పనివ్వనంటున్నారు. అంతా నేను నా మొగుడి చేత దొంగతనం చేయించాననుకుంటున్నారు. వాళ్లెవ్వరూ నా మాట వినడంలేదు."

"ఎవరింట్లోనో దొంగతనం జరిగిందనే నీకు పనివ్వ మంటున్నారంతా మరి మా యింట్లోనే దొంగతనం జరిగితే మేము నీకెలా పనిస్తామనుకున్నావ్?"

"వాళ్ళకు నిజం తెలియదు. మీకైతే తెలుసు."

సీతన్నపంతులదోలా నవ్వి-"నేను పైకి బుద్ధిగా కన బడ్డా-కనబడ్డ ఆడదానిచేయల్లా పట్టుకుంటానని చెప్పావ్" అన్నాడు.

"తప్పైపోయిందండి."

"తప్పుకాదు. నువ్వు నిజమేచెప్పావు. ఇప్పటికీ నేనలాంటి వాణ్ణే. మరి మా యింట్లో ఎలా పనిచేస్తావ్?" అన్నాడు సీతన్నపంతులు.

"లేదుబాబూ! మీరలాంటి వారుకాదు."

సీతన్నపంతులు చటుక్కున లేచి నిలబడి దాన్ని సమీ పించి ఓసారి దగ్గరగా తీసుకుని వదిలి "నేనిప్పుడు చెడ్డగా ప్రవర్తించానా?" అన్నాడు.

"లేదుబాబూ!" అంది రత్తమ్మ అసహాయంగా. అయితే దాని కళ్ళలో ఆశ్చర్యం ప్రతిఫలిస్తోంది. ఇంత జరిగేక కూడా యింకా ఆయనిలా ప్రవర్తిస్తాడనుకోలేదది.

సీతన్నపంతులు దానివంక అనుమానంగా చూసి-"నీలో

చాలా మార్పొచ్చినట్లు కనబడుతోంది" అన్నాడు.

"యిప్పుడు నాకెవ్వరున్నారు బాబూ - నన్ను నేనే పోషించుకోవాలి."

"అయితే యిలా పనిచేసుకుని బ్రతకడమేం కర్మనీకు. వయసులో వున్నావు. ఆరోగ్యంగా ఉన్నావు. నువ్వు తలచు కుంటే యింకో రకంగా కూడా సంపాదించుకోవచ్చు."

రత్తమ్మ నిట్టూర్చి-"వ్యభిచారం నాకు సరిపడదుబాబూ! నేనలాంటిదాన్ని కాదు" అంది.

సీతన్నపంతులు అనుమానంగా "మరైతే మా యింట్లో పనిచేయగలవా?" అన్నాడు.

"అదివేరు యిదివేరు" అంది రత్తమ్మ "నా కిష్టమై నేను వ్యభిచారం చేస్తే అది తప్పు. కష్టపడి వళ్ళువంచి పనిచేసుకోవాలని నా కోరిక. అందుక్కూడా ఏదైనా నా మనసుకు నచ్చని పనిచేస్తే ఆ తప్పు నాదికాదు. మీదే అవు తుంది."

"చాలా తెలివిగా మాట్లాడుతున్నావు" అన్నాడు సీతన్న పంతులు "ఏమైతేనేం ఆ తెలివితేటలే నీ కీయింట్లో పనిప్పి స్తున్నాయి."

5

రత్తమ్మ మళ్ళీ సీతన్నపంతులింట్లో పనికి జేరింది. అందరూ ఆయన ఔదార్యాన్ని మెచ్చుకున్నారు. సీతన్న పంతులికి రత్తమ్మతో అన్నిరకాల సరదాలూ తీరుతున్నాయి. తన సరదాకోసం ఆయన అప్పుడప్పుడు భార్యకు నిద్ర మాత్రలిచ్చి పడుకోబెట్టేసేవాడు కూడా. రత్తమ్మ మకాం తనింటికే మార్చాలని కూడా ఆయననుకున్నాడు. కానీ అలగా జనాన్నింట్లో చేరనిస్తే అఙసని గౌరీదేవి అందు కొప్పుకోలేదు.

రత్తమ్మ కిప్పుడు రోజులు బాగానే గడిచిపోతున్నాయి. ఆమెకు సీతన్నపంతులంటే కోపం పెరిగిపోతోంది. కానీ గౌరీదేవంత దగ్గరగానూ వెళ్ళిన మూలాన ఏ మూలో అభిమానమూ చేరుకుంటోంది.

అలా కొంతకాలం గడిచేక ఒకరోజున రత్తమ్మ తనకు నెల తప్పిందని సీతన్నపంతులికి చెప్పింది.

"అలాగా—తండ్రి ఎవరు?" అన్నాడాయన.

"మీరే?"

సీతన్నపంతు ఉలిక్కిపడలేదు, "చాలా మంచివార్త చెప్పావే" అన్నాడు. "నువ్వు బిడ్డ తండ్రి ఫలానా అని చెప్పకుండా ఉన్నావంటే నీ బిడ్డ నా బిడ్డలా పెరుగుతాడు."

రత్తమ్మ ఆశ్చర్యంగా - "అంటే?" అంది.

"వాడికి మంచిబట్టలు కుట్టిస్తాను. మంచి చదువులు చెప్పిస్తాను. వాడు గొప్పవాడౌతాడు. అప్పుడు నువ్వూ గొప్పదానివి కావచ్చు."

"బాబూ! అప్పటిదాకా ఎందుకు? ఇప్పుడే నేను గొప్పదాన్ని కాకూడదా-నిజానికి నేను మీ రెండో పెళ్లాన్నికదా!" అంది రత్తమ్మ.

"చూడు. నువ్వు నా బిడ్డకు తల్లివి కాగలవు. కానీ నాకు భార్యవు కాలేవు. ఇదీ ఈ సమాజం పద్ధతి." అన్నాడు సీతన్నపంతులు. ఆయన దానికి నెమ్మదిగా నచ్చజెప్పి తన మాటలకు ఒప్పించాడు.

ఆ తర్వాత సీతన్నపంతులు బుర్ర చకచకా పనిచేసింది. రత్తమ్మవల్ల తన కెప్పటికైనా ప్రమాదమేనని ఆయన గ్రహించాడు. గర్భిణీస్త్రీకి జాగ్రత్తలు అంటూ ఆయన ఆమెచేత రోజూ ఓ టాబ్లెట్ మింగించేవాడు. అది స్లో పాయిజన్ అని దానికి తెలియదు.

సరిగ్గా నెల రోజుల తర్వాత ఏదో తెలియని రోగంతో ఆమె చచ్చిపోయింది. అది హత్య అయ్యే అవకాశ ముంటుందని కూడా ఎవ్వరూ ఆలోచించలేదు.

రత్తమ్మ శవానికి దగ్గరుండి సీతన్న పంతులు యథా విధిగా దహన సంస్కారాలు జరిపించాడు. ఒక పని మనిషిపట్ల ఆయన చూపించిన శ్రద్ధ చూసి అంతా మెచ్చు కున్నారు.

"పాపభీతి లేని మనుషులు వాళ్ళు. అందుకే అలా అనుభవిస్తూంటారు. లేకపోతే యింత చిన్నవయసులో చావు రావలసింది కాదు దానికి...." అంది గౌరీదేవి బాధగా.

"అంటే ఏమంటావ్?" అన్నాడు సీతన్న పంతులు.

"మనిషి పాపాలు చేయకూడదు. ఎవరుచేసిన పాపాలు చివరికి వాళ్ళనే కట్టి కుదుపుతాయి...." అంది గౌరీదేవి.

"అలాగనకే బాబూ—మనమూ బోలెడు సంపాదించు కుంటున్నాం. ఎక్కడా ఏ పాపం లేకుండానే అంతా సంపా దించుకుంటున్నామా?" అన్నాడు సీతన్న పంతులు.

"మన మనసులో పాపచింతన లేకపోతే ఏ పాపమూ మన నంటదు. మనం పచ్చగా ఉన్నామంటే దానర్థం మన మే పాపాలూ చేయడంలేదనే! తెలిసి చేసిన పాపాలే కానీ తెలియక చేసిన పాపాలు మన నంటవు...."

అప్పుడు సీతన్న పంతులుకి రత్తమ్మ మాటలు గుర్తు కొచ్చాయి. అది తప్పు చేసినా ఆ తప్పు దాని కిష్టం లేనప్పుడు—అది సీతన్న పంతులుదే అవుతుందంది రత్తమ్మ. అంటే తను పాపం చేశాడు. తెలిసి చేశాడు. రత్తమ్మను కోరడం మొదటి పాపం. దాన్ని స్లో పాయిజ నింగుతో చంపడం రెండో పాపం.

"తెలిసి చేసిన పాపాలు కట్టి కుదుపుతాయి." అంది

గారిదేవి.

తన పాపాలు తననేం చేస్తాయో!

6

"హలో!" అన్నాడు సీతన్న పంతులు.

"నేను—పోలీస్‌స్టేషన్నించి మాట్లాడుతున్నారు. మీరు చాలా జాగ్రత్తగా ఉండాలి. గవరయ్య జైల్నించి తప్పించుకున్నాడు. వాడికి మీమీద బాగా పగ ఉంది. మీ జాగ్రత్తలో మీ రుండడం మంచిది. పోలీసులు కూడా మీకు తగినంత రక్షణ ఇవ్వగలరు...." అంది అవతల గొంతు.

అప్పుడు సీతన్న పంతులి శరీరంలో సన్నని వణుకు ప్రారంభమైంది.

గవరయ్య నాయన ఆ రోజు చూశాడు. వాడి భార్య తన పక్కలో ఉంటే వాడు చూసిన చూపు మరిచిపోలేడాయన.

అయితే గవరయ్యలో ఇంకో గొప్పతనముంది. వాడు భార్యను తిట్టలేదు. ఆమె నసహ్యించుకోలేదు. తనతో వచ్చేయమన్నాడు. ఆమెను పని మనిషిగా చేయడం తప్పు తనదే నన్నాడు. జరిమానాగా డబ్బు, నగలు తీసుకొని వెడతానన్నాడు.

అప్పుడు తనూరుకుని ఉంటే!

రత్తమ్మ, గవరయ్య కలిపి సుఖంగా జీవించేవారు. ఆనందంగా బ్రతికేవారు. తను చేసిన తప్పుకు గవరయ్య జరిమానా వేశాడు. అది గవరయ్య జడ్జిగా వ్యవహరించిన విశేషం. తన తీర్పుకు సీతన్న పంతులు విలువ నిస్తాడని వా డనుకున్నాడు.

రత్తమ్మకు సీతన్న పంతులి సాంగత్య మిష్టంలేదు. ఆయన ఆమెను మానభంగం చేసినట్లే లెక్క!

మానభంగానికి కోర్టులో శిక్ష ఏమిటి?

జరిమానా, జైలుశిక్ష, ఒకోసారి ఉరికంబం....

గవరయ్యే తనను జరిమానాతో వదిలిపెట్టాడు. కానీ తను గవరయ్యను వదిలిపెట్టలేదు. వాడికి జైలుశిక్ష పడేలా చేశాడు. అప్పుడు కూడా గవరయ్యే తన భార్యను నేరం నుండి తప్పించాడు.

తనకు భార్య అయిందని, తనతో కాపురం చేసిందని గవరయ్యే తన భార్య తప్పుల్ని క్షమించడమేకాక— ఆమెను జైలుపాలవకుండా రక్షించాడు.

సీతన్న పంతు లేం చేశాడు?

అనుభవించినంతకాలం అనుభవించి అటుపైన ఆమెను చంపేశాడు.

చాలా దారుణమైన పాపాలివి. వీటికి శిక్ష తప్పదు.

ఇప్పుడు గవరయ్యే జైల్నించి పారిపోయి వస్తున్నాడు వాడికి తనమీద పగ.

"నేను పాపం చేశాను. నా పాపానికి ప్రాయశ్చిత్తం చేసుకోవాలి...." అనుకున్నాడు సీతన్న పంతులు.

"ఎలా?"

ముందాయన గవరయ్యకు డబ్బివ్వాలనుకున్నాడు. తనకు తానై వాడి ఎదుట పడలేడు. అందుకే ఆయన భీమేంద్రకు కబురుపెట్టాడు.

భీమేంద్ర గురించి ఎక్కువగా ఎవరూ చెప్పనవసరం లేదు. ఊళ్ళో గొప్ప గొప్పవాళ్ళందరూ గొప్పగా చెలామణీ అవడానికి అతడు సహకరిస్తూంటాడు.

భీమేంద్రకు గవరయ్య గురించి క్లుప్తంగా చెప్పి— "నాకు వాడంటే భయంలేదు. జాలి ఉంది. వాడి భార్య

కూడా పోయింది. ఎలాగో అలా వాడు సుఖంగా బ్రత కాలి. మళ్ళీ మంచి మనిషి కావాలి. వాడు పోలీసులకు దొరక్కుండా సాయం చేద్దాం. వాడింకో ఊళ్ళో ఎక్కడైనా చిన్న వ్యాపారం చేసుకుంటానంటే పది పదిహేను వేలదాకా సాయం చేస్తాను." అన్నాడు.

గవరయ్య నందు కొప్పించడానికి భీమేంద్రకు వేరే ఫీజుంటుంది.

"మీరు చెప్పింది బాగానే ఉంది. వా డొప్పుకోకపోతే ఏం చేయమంటారు—ఫినిష్ చేసేయొచ్చా?"

"మనిషిని ఫినిష్ చేసేయడమా?" అదేదో తనకు కొత్తయినట్లు ఆశ్చర్యపడ్డాడు సీతన్న పంతులు.

"అంటే వాణ్ణి ఫినిష్ చేయకపోతే మీరు ఫినిషయ్యే ప్రమాదముంటే...." అన్నాడు భీమేంద్ర.

"చూడు భీమ్! నాకు పాపభీతి ఎక్కువ. ఏదో విధంగా వాడివి నిలబెట్టాలన్నది నా కోరిక...." అన్నాడు సీతన్న పంతులు.

"అలాగే ప్రయత్నిస్తాను. కానీ మీ మంచితనాన్ని వాడు నిలబెట్టుకోవాలి గదా సార్!" అన్నాడు భీమేంద్ర.

సరిగ్గా నాలుగు రోజుల అనంతరం పాముకాటుకు గురై మరణించాడు గవరయ్య. భీమేంద్ర తను స్వయంగా సీతన్న పంతుల్ని కలుసుకుని—"నన్ను క్షమించాలి సర్! ఇందులో మనం చేసిందేమీలేదు. అంతా దేవుడే చేశాడు. గవరయ్య పాము కరిచి మరణించడం దేవుడు వాడికి విధించిన శిక్ష అనుకుంటాను." అన్నాడు.

"అలాగని ఎందుకు చెబుతున్నావు?" అన్నాడు సీతన్న పంతులు.

"అసలే మీకు పాపభీతి ఎక్కువ. ఇది మీ కారణంగా జరిగిన హత్య అనుకుంటే ఏ గుండైనా ఆగిపోతుందని భయపడి నిజం చెప్పేస్తున్నాను. ఇందులో మీరూ, నేను చేసిందేమీలేదు." అన్నాడు భీమేంద్ర.

"ఇంత మంచివార్త చెప్పినందుకు నిన్నభినందించాలి. సత్కరించాలి. గవరయ్య చావాలన్నది నా కోరిక కాదు. కానీ దేవు డతడికి అదే శిక్ష విధించాలనుకుంటే మనం చేయగలిగిం దేమీలేదు. మనం ఏమీ చేయకుండా గవరయ్య మన దారినుంచి తప్పుకున్నప్పటికీ నీ కివ్వాల్సిన డబ్బు నీ కిస్తాను...." అన్నాడు సీతన్న పంతులు.

"మీ రుదార స్వభావులు...." అన్నాడు భీమేంద్ర.

సీతన్న పంతు లతడికి పదిహేనువే లిచ్చాడు.

భీమేంద్ర తెలివిగా హత్య చేశాడని సీతన్న పంతులికి తెలుసు. ఆ విషయం ఆయనకు తెలుసునని భీమేంద్రకూ తెలుసు.

తమకు తెలిసిన నిజాలు తెలియనట్లు నటిస్తూ జీవించడం లోనే గొప్పతనం ఉంది.

సీతన్న పంతులు గొప్పవాడు. భీమేంద్ర గొప్పవాళ్ళు గొప్పగా చెలామణీ కావడానికి సహకరించేవాడు.

అయితే సీతన్న పంతులుకు పాపభీతి లేదనుకోవాలా!

ఆయన ఓ అతివకు మానభంగంచేసి, ప్రాణాలు తీశాడు. ఓ మనిషి ప్రాణాలు తీయించాడు.

ఇన్ని చేసినా ఆయనలో పాపభీతి లేదనడానికి లేదు.

ఎందుకంటే....ఒకటి కాదు....రెండు కాదు...మొత్తం మూడులక్షల రూపాయలనాయన తిరుపతిలో శ్రీ వెంకటేశ్వరస్వామి హుండీలో వేశాడు. □

హనుమంతు గురక

చంద్రశేఖర ఆజాద్



నేను శ్రీకాంత్‌కు హనుమంతు గురక గురించి చెప్పి నప్పుడు పెళ్ళున నవ్వేడు.

"నువ్వెప్పుడూ ఇంతేరా. విషయాన్ని ఎగ్జాజరేట్ చేసి చెబుతావు. నేను నమ్మను" అన్నాడు.

"ఎగ్జాజరేషనా, అంటే ఎలా అని నీ భావం."

"ఏం లేదు. ఓ అమ్మాయి ఏడుస్తూంది అని చెప్పా అనుకో, ఆమె కన్నీళ్ళు వరదలా పారుతున్నాయి. నేను అందులో ఈదుకొచ్చానంటావ్. అసలు విషయం ఆమె ఏడుస్తోంది. మహా వస్తే రెండు కన్నీటిబొట్లు రావచ్చు. మొత్తంమీద ఒక విషయం నిజంరా. నువ్వు చెప్పే దాంట్లో పదోవంతు నిజం ఉంటుంది. అంతే." అన్నాడు శ్రీకాంత్.

"ఓరేయి నీకు అర్థం కావటంలేదు. నయాగారా జలపాతం చూశావా?"

"చూశాను - ఫోటోల్లో."

"దాన్నిబట్టి ఆ హోరు ఊహించగలవనుకుంటాను. హనుమంతుగాడి గురక దానికి దీటుగా ఉంటుంది. అందులో ఎలాంటి అతిశయోక్తిలేదు. కావాలంటే ఈరోజు వాడి గదికి వెళ్దాం. వాడితో ఈరాత్రి గడిపాక నా మాటతో నువ్వు ఏకీభవించికపోతే నువ్వేం చెయ్యమంటే అది చేస్తాను" అన్నాను.

"మరి వాళ్ళావిడా, పిల్లలు లేరా?"

"లేరు. శెలవులకు పుట్టింటి కెళ్ళారు."

"ఓ పని చేద్దాంరా. నువ్వన్నట్లు హనుమంతు అంత భయంకరంగా గురక పెడతాడని నేను అంగీకరిస్తే నీకు బ్రహ్మాండమయిన పార్టీ ఇస్తాను. లేకపోతే నువ్వివ్వాలి" అన్నాడు.

"ష్యూర్" అన్నాను సంతోషంగా వాడివ్వబోయే పార్టీని తలుచుకుంటూ.

వెంటనే హనుమంతుతో మాట్లాడాను. "సాయంకాలం మీ రూంకొచ్చి పేకాడుకుందాంరా.... ఈరోజు రాత్రి

అక్కడ పడుకుంటాం" అన్నాను.

"రండిరా. వక్కడ్నే పడుకోవాలంటే బోర్‌గా ఉంది. సరదాగా కబుర్లు చెప్పుకుంటూ కాలక్షేపం చేద్దాం" అన్నాడు హనుమంతు.

అనుకున్నట్లుగానే శ్రీకాంత్‌తో కలిపి హనుమంతు ఇంటికి వెళ్ళాం. కొంచెంసేపు పేకాడుకున్నాం. ఆ తర్వాత ఏవేవో కబుర్లు చెప్పుకున్నాం.

పది గంటలు కొట్టింది గడియారం.

"నాకు నిద్రొస్తోందిరా" అన్నాడు శ్రీకాంత్ ఆవులిస్తూ.

"అప్పుడేనా" అన్నాడు హనుమంతు.

"రోజూ అయితే ఈపాటికి నిద్రపోయి గంటయి ఉండేది."

"సర్లే పడుకుందాం" అని లేచి దుప్పట్లు తీశాడు.

గదిలో మూడు మంచాలు వేశాడు. విడి విడిగానే పడుకున్నాం.

"ఫ్యాన్ వెయ్యమంటావురా" అన్నాడు హనుమంతు.

"వద్దురా. చలిగా ఉంది. మీ ఇంటిలో అంతగా దోమలు కూడా లేవు" అన్నాడు శ్రీకాంత్.

అందరం పడుకున్నాం.

అయిదు నిమిషాలు గడిచాయి.

దూరంనుండి ఏదో కారు వస్తున్న శబ్దం మొదలయింది.

శ్రీకాంత్ ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు.

"కంగారు పడకు" అన్నాను మెల్లగా.

వాడు అయోమయంగా చూశాడు.

"నిద్రలోకి జారిపోతున్నాడు హనుమంతు. దానితాలూకు శబ్దం.... త్రీడి ఎఫెక్ట్‌లో కారుమీదకొచ్చిం దనుకున్నావా?" అన్నాను.

అరగంట గడిచింది.

శ్రీకాంత్ నావంక దిమ్మెరపోయి చూస్తున్నాడు.

అప్పటికి హైదరాబాదు నగరంలో, ఆబిడ్స్ సెంటర్లో సాయంకాలం అయిదు గంటలకు నిలబడినట్లుంది.

"నాకింక నిద్రపట్టదురా" అన్నాడు శ్రీకాంత్.

"ఏం చేస్తానంటావ్"

"నువ్వే చెప్పు"

"ఏదైనా పుస్తకం చదువుకో"

"ఈ రొదలో దానిమీదకు మనసేంపోతుంది"

"ఇదిగో రొదంటూ వాడికన్యాయం చేయకు. సరిగ్గా పన్నెండుగంటల ప్రాంతంలో వినాలి".

శ్రీకాంత్ నిటారుగా కూర్చున్నాడు.

"నో. ఇదేం గొప్ప గురకకాదు. కాకపోతే నాకు క్రొత్త కాబట్టి కొంచెం యిబ్బందిగా ఉందంతే" అన్నాడు.

ఓటమిని అంత తేలిగ్గా అంగీకరించడు శ్రీకాంత్.

"దెన్ ఓ కె" అన్నాను.

కొంచెం సేపయ్యాక శ్రీకాంత్ అన్నాడు తిరిగి—

"అదికాదురా, ఎవరికయినా నిద్ర పోయాక ఎప్పుడో మొదలవుతుంది. వీడికి పడుకోగానే స్టార్టయిందేవిటి?"

"అదే వాడి స్పెషాలిటీ...."

"వీడి గురక్కి విశ్రాంతిలేదా....కంటిన్యూ అవుతుంది"

"సముద్రపు అలలకు విశ్రాంతివుందా....హనుమంతు గాడంటే ఏమిటనుకున్నావ్. నథింగ్ బట్ ఏన్ ఓషన్. మామూలుగా గురకపెట్టేవారు ప్రక్కకు తిరిగి పడుకుంటే గురక ఆగిపోతుంది. కనీసం ఆ స్థాయి తగ్గుతుంది. వీడు ఏ మూలకు తిరిగి పడుకొన్నా ఒకటే సౌండ్."

"స్టీరియోఫోనిక్ సౌండ్ సిస్టమా" అన్నాడు శ్రీకాంత్. ఇద్దరం నవ్వుకున్నాం.

మా కెటూ నిద్రరాదు. చిన్ననాటి విశేషాలు చెప్పు కుంటూ కూర్చున్నాం. మేం ముగ్గురూ "ఒరేయ్" అని పిలుచుకుంటున్నా మా స్నేహం ఈ ఉద్యోగాల్లో చేరాక వృద్ధి చెందిందే.

పన్నెండు గంటలు కొట్టింది గడియారం.

ప్రపంచమంతా గాఢాంధకారంలో మునిగిపోయి ఉంది.

శ్రీకాంత్ కళ్ళలో ఆందోళన స్పష్టంగా కనిపించింది.

హనుమంతు ఈ ప్రపంచంలో లేడు.

అప్పటిదాకా ఉన్న గురకలో మార్పు.

పరిణతి చెందిన ఆ గురక శిఖరాగ్రాల్ని గుర్తుకు తెస్తూంది.

సముద్రంలో అమావాస్యకూ, పౌర్ణమికీ ఆటు పోట్లు వస్తుంటాయి. ఆ సమయంలో సముద్రం మహా భీకరంగా వుంటుంది.

హనుమంతు ఆ స్థితిలోనే ఉన్నాడు.

గురకమాటున గదిలో గుండెల్ని జలదరింపచేసేనిశ్శబ్దం!

"ఓడిపోయానురా" అన్నాడు శ్రీకాంత్.

నేను చిరునవ్వు నవ్వాను.

"ఒరేయ్ వాడిది గురక కాదు. వంద సముద్రాలఘోష. వాడ్ని తీసుకెళ్ళి నయాగారా జలపాతం దగ్గర పడుకో బెడితే, ఆ హోరు ఎవరికీ వినపడదు. సూపర్‌సానిక్ విమా నాలు ఓ వెయ్యి తిరుగుతుంటే యిదే శబ్దం వస్తుంది వాడి గురకని వర్ణించటానికి నా దగ్గర భాష లేదు" అన్నాడు రొప్పుతూ.

"నువ్వు మరీరా. ఎగ్జాజరేట్ చేసి చెబుతున్నావేమో"

అన్నాను.

"లేదురా. చెంపలేసుకుంటున్నాను. వీడి గురించి ఎంత చెప్పినా అది అతిశయోక్తి కాదు. గిన్నెస్‌బుక్ వాళ్ళను పిలిస్తే వాడ్ని తప్పకుండా ఎక్కిస్తారు. ఆ రకంగానైనా దేశానికి, రాష్ట్రానికి సేవ చేస్తాడు" అన్నాడు శ్రీకాంత్.

"ఒరేయ్ టేప్ రికార్డరుందా వీడి దగ్గర" అరిచాడు.

"ఉందిరా" అన్నాను.

"వాడి గురక రికార్డు చేసుకుందామురా" అన్నాడు.

నేను లేచి వెళ్ళి టేబుల్‌మీదున్న టేప్ తెచ్చి ఆన్ చేశాను.

పదినిమిషాలయ్యింది.

"యింక చాలా" అన్నాను.

"మొత్తం టేపంతా నిండిపోవాలి" అన్నాడు శ్రీకాంత్. టేపుకు రెండు ప్రక్కలా రికార్డు చేశాం.

"యింకా ఈ రాత్రికి నిద్ర ఉండదా" అన్నాడు దిగులుగా.

తెల్లవారేక ఎర్రబడ్డ కళ్ళతో హనుమంతుదగ్గర క్యాసెట్ అడిగి తీసుకువెళ్ళాం.

2

బార్ అండ్ రెస్టారెంట్‌లో కూర్చున్నాం నేనూ, శ్రీకాంత్. మాముందు గ్లాసుల్లో విస్కీ వుంది. వాడి ముందు చిప్స్, నాముందు చిల్లిచికెన్ వున్నాయి. స్పెషల్ పలావ్‌తోపాటు తందూరి చికెన్‌కు ఆర్డరు ఇచ్చాం.

"ఆ క్యాసెట్ విన్నవాళ్ళేం అన్నారోతెల్సా" అన్నాడు శ్రీకాంత్.

ఏమన్నారన్నట్లు చూశాను.

"ఆ నడుమ 77 లో ఉప్పెనొచ్చింది గుర్తుందా. దాన్ని గుర్తుకు తెచ్చిందట. మీ రెప్పుడు రికార్డు చేశారండీ. అబ్బ

ఆ హోరు వింటుంటే ఆ రోజులు గుర్తుకొచ్చాయి. ఇంకెప్పుడూ వద్దండీ అలాంటి ఉప్పెనలు అని గుండెమీద చెయ్యి వేసుకున్నారు."

"అంటే టార్నెడో అన్నమాట. దాని వేగం గంటకు రెండువందల నుండి మూడువందల కిలోమీటర్లు. మనవాడి లెవెల్ అదన్నమాట."

శ్రీకాంత్ నవ్వాడు.

అప్పటికి కొంచెం మందు ప్రభావం చూపించింది.

"ఒరేయ్ నీకో విషయం చెప్పాలనుకుంటున్నాను."

"చెప్పరా"

"నేనో వ్యక్తిమీద పగ తీర్చుకోవాలి"

"పగా?" అన్నాను.

"అవును"

"ఏం చేయాలని నీ ఉద్దేశ్యం?"

"వాడ్ని చంపేయాలన్నంతకోపం వచ్చింది. మొన్న అనవసరంగా తగాదా పెట్టుకున్నాడు. వాడ్ని ఏదో ఒకటి చెయ్యందే నాకు మనశ్శాంతి లేదురా"

"ఎవడురా వాడు?"

"మా కోటెనెంట్. అబ్బ ఎంత తగాదా అయిందని. వాడ్ని ఊరికే వదలకూడదు."

"ఎందుకురా తగాదాలు. ఎవడితోనో కొట్టించామనుకో. వాడి అనుమానం నీమీదకు రావటం, తగాదాలు, కోర్టులూ, కేసులూ, వెధవ తలకాయనొప్పి"

"అది కాదురా. వాడు చావకూడదు. మనమని తెలియకూడదు. వాడు మాత్రం గిలగిలలాడిపోవాలి. మానసిక క్షోభ ననుభవించాలి. వెంటనే ఆ ఇల్లు ఖాళీచేసి పోవాలి" అన్నాడు.

"నీకు హిప్నటిజం తెలిసిన మిత్రులెవరైనా ఉన్నారా" అన్నాను.

"మనకెవరున్నార్రా ... నేనూ ఈనడుమే ఆ ప్రకటనలు చూస్తున్నా.... నేర్చుకోవాలి. నేను వెంటనే వాడ్ని ఏదో ఒకటి చెయ్యందే భరించలేనురా" అన్నాడు పట్టుదలగా.

"ఏం చేద్దాం" అంటూ ఓ గుక్క సిప్ చేశాను.

"గుడ్ ఐడియా" అరిచాను సంతోషంగా.

"ఏమిటిరా?"

"మన హనుమంతుగాడున్నాడుగా. అంతకంటే మన కింకెవరు కావాలి. నీ శత్రువును కత్తితో పొడవనవసరం లేదు. తలకాయలు బ్రద్దలు చేయాల్సిన పనిలేదు. వాడూ, వాడి కుటుంబం చిత్రవధ ననుభవించి, పిచ్చెక్కి, జుట్టు పట్టుకొని మీ యింటి ప్రక్కనుండి ఖాళీచెయ్యాలి"

"నిజంగానా"

"ఒక్కవారం రోజులు హనుమంతుగాడ్ని మీ ఇంటిలో పడుకోమనటమే"

"మా యింటిలో ఒక్క ఫ్యానే వుందిరా. దోమలు విప రీతంగా వున్నాయి"

"దోమలగురించి నువ్వేం బాధపడకు. ఈ ఊర్లో దోమలు ఎక్కువయ్యాయని పారిశుధ్యం లోపించని ఛైర్మన్ గారిని ప్రతిపక్షాలు వాయించేస్తున్నాయి. తెలుసుగా"

"అవును"

"హనుమంతుగాడి పరిసరాలు అలాగే ఏడ్చాయికదా. మరెందుకని వాడింటిలో దోమలు లేవు?"

"నిజమేరా" అన్నాడు ఆశ్చర్యంగా.

"వాడి దెబ్బకు ఈగలూ, దోమలూ, పాములూ ఆ ప్రాంతాల్లోకి రావురా. వీడ్ని అడవుల్లోకి పంపితే ఆ మృగా

అన్నీ నగరాల్లోనే బ్రతకాలి"

శ్రీకాంత్ విరగబడి నవ్వాడు.

"ఇంతకూ వాడు ఒప్పుకుంటాడంటావా" అన్నాడు.

"దుష్టశిక్షణ, శిష్టరక్షణ వాడి కార్యక్రమం. కల్కి అంశ వాడిలో వుంది. ఆ బాధ్యత నామీదపెట్టు" అన్నాను.

"నువ్వింకో ప్లేటు ఛికెన్ రోస్ట్ తెప్పించుకోరా" అన్నాడు.

"హనుమంతుగాడి పుణ్యంరా బాబు. ఇంతకూ వాడు లేడు" అన్నాను.

"మనం అనుకున్నట్లు సక్సెస్ కావాలేగాని గ్రాండ్‌గా యిద్దాంరా పార్టీ" అన్నాడు శ్రీకాంత్.

"సరే మీ గదికి, వాడి గదికి అడ్డంగా గోడ వుందా."

"ఉందిగాని పూర్తిగా లేదురా. అదే బాధ. ఏం మాట్లాడుకున్నా వినిపిస్తాయి అవతలకి."

"అంటే స్టూలు వేసుకుంటే అవతలివారు కపపడ తారా?"

"అంత లేదనుకో"

"ఓరి పిచ్చోడా! అది మనకు అడ్వాంటేజేరా. ఓవేళ గోడలున్నాయనుకో. మనవాడి దెబ్బకు బయట పడుకున్న వారు లోనికి వెళితే ఆ గోడల్ని చీల్చుకు వెళ్ళటం కొంత కష్టంకదా....ఇప్పుడయితే నీ శత్రువు ఎక్కడ పడుకున్నా నాశనమే"

"ఛీర్స్" అన్నాడు సంతోషంగా గ్లాసెత్తి శ్రీకాంత్.

3

హనుమంతు, నేనూ, శ్రీకాంత్ ఏ.పి. గదిలో కూర్చున్నాం. వాడికి విషయమంతా వివరంగా చెప్పాం.

"అదిరా సంగతి. ఇప్పుడంతా నీ చేతిలో వుంది. వాడ్ని మానసిక క్షోభకు గురిచెయ్యాలి. ఎటూ మీ ఫ్యామిలీ లేదు. ఈ వారంరోజుల్లో మనం అనుకొన్నది సాధిస్తే బ్రహ్మాండమయిన పార్టీ. ఈ వారం రోజులూ నీ మకాం అక్కడే. రాత్రీ-పగలూ నిద్రపోవాలి. వెంటనే బట్టలు సర్దుకొని వచ్చేయ్" అన్నాను.

అప్పుడు శ్రీకాంత్‌కో అనుమానం వచ్చింది.

"ఒరేయ్....వాడికి మెంటల్ తేవాలని ఈ విషయం ఆలోచించలేదు. నా పిల్లలకు ఈ వారం రోజుల్లో మెదడు చెడిపోయిందంటే చావాలి. వెంటనే వాళ్ళని ఊరు పంపిం చేస్తాను" అన్నాడు శ్రీకాంత్.

"నిజమేరా- లేకపోతే మనకే ఎదురుతిరిగేది" అన్నాను.

"యింతకూ ఒప్పుకున్నట్లేనా"

"భలేవాడివిరా. మిత్రుడికి ఆపద ఎదురయితే ఆమాత్రం సాయం చేయలేనా" అన్నాడు హనుమంతు.

"మరయితే వెంటనే బట్టలు సర్దుకొని అతిథిలా యింటి దగ్గర రిక్షాలో దిగు" అన్నాను లేస్తూ.

శ్రీకాంత్ బిల్లు అందుకున్నాడు.

హనుమంతు వెళ్లిపోయాడు.

నేనూ, శ్రీకాంత్ నడుస్తున్నాం రోడ్డుమీద.

"మొత్తంమీద హనుమంతుగాడూ పాపుల్ని శిక్షిస్తు న్నాడు" అన్నాను.

"అది సరేరా. వాడింతగా గురకపెడతాడని నీ కెప్పుడు తెలిసింది"

"అదా బాబు. ఆ నడుమ మేం రెండు నెలలు టూర్ మీద వెళ్ళాం గుర్తుందా. అప్పుడు తెలిసింది" అన్నాను.

4

పార్టీలో హనుమంతు గ్లాసెత్తి "ఛీర్స్" అన్నాడు.

మేమిద్దరం గ్లాసులు టకటకలాడించాం.

"శ్రీకాంత్‌గాడు వర్ధిల్లాలి" అన్నాడు వాడే.

మాకు తలుచుకుంటే యిప్పటికీ నవ్వొస్తుంది. వారం రోజులకాదు. కేవలం మూడు రోజుల్లోనే హనుమంతు జనాన్ని అదరగొట్టేశాడు. మొదటిరోజుతో ఓ పిల్లవాడు దడుసుకొని జ్వరం తెచ్చుకున్నాడు. బయట పడుకొన్న వారంతా యింట్లోకి మారారు. రెండోరోజు హనుమంతు యింట్లోకి మారాడు. మూడోరోజు ఓ చిన్నపిల్లాడితో రాయబారం వచ్చింది.

"ఈ అంకుల్ ఎంతకాలం ఉంటాడు"

"ఈ అంకుల్ ఎప్పుడూ ఉంటా"రని కబురెళ్ళింది.

సాయంకాలానికల్లా శ్రీకాంత్ కోటెనెంట్ కాళ్ళబేరానికొచ్చాడు.

"క్షమించండి. బుద్ధి తక్కువయి మీతో తగాదా పెట్టుకున్నాను. లెంపలేసుకోమంటే వేసుకుంటాను. కావాలంటే వంగుతాను. ఫెడేల్‌మని తన్నండి. అంతేగాని, ఈ చిత్రహింస నేను భరించలేను. ఆయన్ని ఏమంటానికి నాకు నోరు రావటం లేదు.

మొదటిరోజు బయట పడుకున్నాడు. అర్ధరాత్రి మా పిల్లాడు ఉలిక్కిపడి లేచాడు, దడుసుకున్నాడు. దెయ్యం పట్టినట్లు పిచ్చి చూపులు చూస్తున్నాడు. ఇంతవరకు 102 డిగ్రీల జ్వరం తగ్గటంలేదు. డాక్టర్లకి ఏం జబ్బో అర్థం కావటంలేదు.

మీకింకో విషయం చెబుతున్నాను. నాలుగురోజులనుండి నాకేం తినాలనిపించటంలేదు. ఆకలివుండదు. మల్లెపూల

వాసన తెలియటంలేదు. పనిచేయాలనిపించటంలేదు. నా అవయవాలు మొద్దుబారిపోయాయి. వెంటనే వేరే యిల్లు కోసం ఊరంతా పిచ్చికుక్క తిరిగినట్లు తిరిగాను. ఎక్కడా దొరకలేదు. వందలుపెట్టి నేను తీసుకోలేను. బాబూ నన్ను క్షమించి, మా పిల్లల మొఖాలు చూసి ఆయన్ను పంపించెయ్యండి.

నా సంగతటుంచినా మీకు మాత్రం నిద్రెలాపడుతుంది సార్. నిద్రలేకుంటే పీడాబోయింది మెదడు బలహీనమయిపోతుందండి. నేను పురాణాల్లో చదివానుగాని ఎప్పుడూ వినలేదు....మీకాళ్ళెక్కడ" అని వంగబోతుంటే—

"భలేవారండి ఆయన వెళ్ళిపోతాడులెండి" అంటూ అభయ హస్తమిచ్చాడు శ్రీకాంత్.

"అమ్మయ్య అమెరికావాడు న్యూట్రాన్ బాంబు పేల్చినా నేనంత భయపడనండి బాబూ....నా ఆత్మ విశ్వాసం మీద దెబ్బకొట్టాడు. వస్తాను సార్. యింట్లో ఎవరూ లేరమకుంటాగా. అయ్యయ్యో మీ రింతవరకూ కాఫీ త్రాగలేదుగా. ఉండండి....రాత్రికి భోజనం మా యింట్లోనే"

"అబ్బే ఎందుకండి" అని శ్రీకాంత్ యిబ్బందిపడితే—

"మీరు కాదంటే నా మీదఒట్టే" అని బ్రహ్మాండమయిన విందుభోజనం ఏర్పాటు చేశాడు.

ఈ విషయం శ్రీకాంత్‌గాడు భార్యను తీసుకురావటానికి వెళ్ళి చెబితే ఆమె నమ్మలేదు. యింటికొచ్చాక వారి ఆతిథ్యం, నమ్రత గమనించి ఆశ్చర్యపోయిందట.

యివన్నీ తలుచుకుంటే మాకు పొరలు పొరలుగా

నవ్వొస్తూంది.

లైట్లు డిమ్ముగా వెలుగుతున్నాయి.

అప్పటిదాకా మేం వింటున్న సంగీతం ఆగిపోయింది.

అప్పుడు మొదలయిందో సంగీతం.

బుసలాంటి ధ్వనితో!

మా శరీరం గగుర్పొడుస్తూంది_వింటుంటే.

వెయిటర్‌ను పిలిచాం.

"ఏంటయ్యా క్రొత్త మ్యూజిక్కా_"

"అవునండి. ఈ నడుమే రికార్డు చేయించాం. హర్రర్ మ్యూజిక్ సార్. ఈ రికార్డువేస్తే సేల్స్ పెరుగుతున్నాయి."

"హాలిఉడ్‌లో క్రొత్తగా వచ్చిందా?"

"లేదుసార్. యిది యిండియన్ మ్యూజిక్. యింకా చెప్పాలంటే ఆంధ్రామ్యూజిక్....ఖచ్చితంగా చెప్పాలంటే మనూరి మ్యూజిక్"

"మనూరిదా?"

"అవునండి. కాకపోతే కాస్త ట్రిక్ చేశాం"

"ఏమిటయ్యా అది"

"ఈ నడుమ మా పెద్దయ్యగారి ఫ్రెండొకాయన ఓ క్యాసెట్ విని బాగుందని తెచ్చిచ్చారండి. ఆ క్యాసెట్ మొత్తం ఒకటే హోరండి. వెంటనే ఆయనకో ఐడియా వచ్చింది. మధ్య మధ్య కొంత సంగీతం మిక్స్‌చేసి ఆ హోరును తిరిగి రికార్డు చేయించారండి. ఇంక చూడండి ఎంత గొప్పగా వచ్చిందో. ఇప్పుడు ఈ ఊర్లో రికార్డింగ్ సెంటర్లన్నీ బిజీ .... అంతా ఈ రికార్డే కావాలంటున్నారు."

శ్రీకాంత్ దిమ్మెరబోయి చూస్తున్నాడు.

వెయిటర్ వెళ్ళిపోయాడు.

తిరిగి మేం ఆర్డరిచ్చిన ఫుడ్ సర్దాడు.

"ఈ రికార్డు మద్రాసు వెళ్ళిందండి. ఓ కాపీ దర్శకుడు ఆయన చిత్రంలో దీన్ని బ్యాక్ డ్రాప్‌గా వాడుకుంటున్నాడు. అసలాయన ఈ సంగీతం విన్నాకే ఓ కథ రాశాట్టండి....ఆ కథను హిందీలోనూ....ఆ తర్వాత హా...."

"బేరర్" ఎవరో పిలిచారు.

మాకు సంతోషంతోనో, హక్కులు మాకు లేకపోయాయే అనో నోటంట మాటరాలేదు.

"ఏమి రికార్డురా అది" అన్నాడు హనుమంతు.

వాడికి తెలియదు అది వాడి గురక రికార్డే అని.

"వింటున్నావుగా" అన్నాను.

"ఏమిట్రా అంత భయంకరంగా వుంది" అన్నాడు.

ఇంక మేం నవ్వు ఆపుకోలేకపోయాం.

"నాకో అనుమానం రా" అన్నాడు శ్రీకాంత్.

"అడుగు....అడుగు" అన్నాం.

"నీ భార్యా పిల్లలు నీతో ఎలా వుండగలుగుతున్నారు. పాపం వాళ్ళకి నా సానుభూతి" అన్నాడు శ్రీకాంత్.

"ఒకటిరా వీడి గురక మొదట్లో కొంచెం ఇబ్బందిగా వున్నా ఆ తర్వాత అలవాటయిపోతుంది. నా అనుమానం వీడి గురక లేకుండేనే వాళ్ళు నిద్రపోరు" అన్నాను.

"ఏడ్చారుగానీ మా యింట్లో అంతా గురకపెడతారు. మా రెండో వాడయితే మరీనూ" అన్నాడు హనుమంతు.

□

కె.వి.రమణ

కాలిన కనుబొమ్మలు

నలుదిక్కులా గాఢాంధకారం. ఎటు తిరిగినా ముళ్ళ డొంకలు. పిచ్చిమొక్కలు తోవకు అడ్డం వస్తున్నాయి. హోరున వీచేగాలికి చెట్లు పిశాచాల్లా నృత్యం చేస్తున్నాయి. గుడ్లగూబలు వికృతంగా అరుస్తూ తొంగితొంగి దొంగ

చూపులు చూస్తున్నాయి. కీచురాళ్ళు కొంపలు మునిగిపోతున్నట్టు నిర్విరామంగా రొదపెడుతున్నాయి.

నడుంమీద రెండుచేతులూ వేసి అయోమయంగా నిలబడిపోయాడు ఆదయ్య.

సరయిన తోవన గడిస్తే తా నీపాటికి తారురోడ్డును పట్టి వుండాలి. బండి బాటలో నడుస్తూనే ఆలోచనలో పద ఎప్పుడు తోవతప్పాడో తనకే తెలియదు. ఏదో పొది కాళ్ళకు అడ్డంపడి బోర్లా పడ్డప్పుడుగాని తన పరిస్థితి అర్థం కాలేదతనికి. చుట్టూ చూస్తే యింకేముంది. చిట్టడవిలాగుంది.

సాయంత్రం బాగా చీకటిపడ్డాక కబురు తెలిపింది: స్నేహితుడికి సీరియస్‌గా వుందని. అప్పటికప్పుడు దుకాణం ఎత్తి బయల్దేరాడు ఆదయ్య. పట్నానికి పది మైళ్ళ దూరంలో వుంది కొంపల్లి. రోడ్డుమీద బస్సు దిగి ఐదుమైళ్ళు నడవాలి. కొండలమధ్య వుందావూరు. ఇంత శ్రమపడి ఆదయ్య కొంపల్లి చేరితే వైద్యంకోసమని స్నేహితుణ్ణి పట్నమే తీసుకువచ్చారని తెలిపింది. ఆ రాత్రికిక అక్కడ చేసేదేముందని తిరుగుముఖం పట్టాడు ఆదయ్య.

సుమారు మూడుమైళ్ళు సరయిన తోవనే నడిచాడు తను. ఆ తర్వాతనే దారి తప్పాడు. నిట్టూర్చాడు ఆదయ్య. తిరిగి ధైర్యం చిక్కబట్టుకున్నాడు ఆదయ్య. అలా ఎంతసేపని దిక్కూమొక్కూ లేని ఆ అడవిలో వుండగలడు. కొండల్ని వెనక్కి నెడుతూ నడిస్తే ఏదో వేళకు రోడ్డు చేరకపోడు. కాకపోతే శ్రమ! తప్పదుగా! ముందుకు రెండడుగులు వేశాడు ఆదయ్య.

ఇంచుమించు యాభై అరవై గజాల దూరంలో చిన్నగా వెలిగి మాయమయిందేదో. ఏమిటది? మిణుగురు పురుగు

కాదుగదా! మరోసారి వెలిగి ఆరింది. ఎవరో అగ్గిపుల్లో లైటరో వెలిగిస్తున్నారు. గాలికి వెంటనే ఆరిపోతున్నది. మొత్తంమీద అక్కడెవరో మనుషులు వున్నారు. రాత్రుళ్ళు ఈ ప్రాంతాల్లో సాధారణంగా వేటగాళ్ళు తిరుగుతూ వుంటారు. కుందేళ్ళు. అడవిపందులు విస్తారమిక్కడ.

ఆదయ్య వేగంగా అడుగులు వేసాడటు. మనుషుల ఆకారాలు లీలగా కనపడుతున్నాయి. ఇద్దరే వున్నట్టుంది. ముందుకి వంగి ఏదో చేస్తూ హడావుడి పడుతున్నారు.

ఆదయ్య వారికి బాగా చేరువయ్యాడిప్పుడు. సుమారు పదిహేనడుగుల దూరం వుందనగా ఏదో అనుమానం కలిగి ఓ పొదవెనక్కి తగ్గాడు ఆదయ్య. మాటలు వినపడుతున్నాయి.

"పెట్రోలు వెయ్!" అన్నాడొకడు. వెనువెంటనే ఘాటుగా ముక్కుపుటాలకు సోకింది పెట్రోలు వాసన. ఆ వాసన ఆదయ్యకు పడదు. నేలమీదకు వంగి చప్పుడు కాకుండా వుమ్మివేసాడు. ముక్కును పైగుడ్డతో మూసుకున్నాడు.

"జాగ్రత్త. ఒకేసారి అంటించకు...." మొదటిస్వరం ఆ మాటల్ని పూర్తిచేసీ చెయ్యక మునుపే గుప్పుమంది మంట. ఆ వ్యక్తి లావుగా వున్నాడు. తృళ్ళిపడుతూ వెనక్కిపడ్డాడు.

"కాలిందా?" ఆత్రంగా అడిగాడు రెండోవాడు. పడ్డ వ్యక్తి దుమ్ము దులుపుకుంటూ లేచాడు.

"కాస్తలో తప్పింది. నీకు చెప్పలా! ఓ ప్రక్క మొహం మాడి మసిబొగ్గయ్యేది. సర్లే కానివ్! తొందరగా!" అంటున్నాడు లావాటి వ్యక్తి.

ఆదయ్య మునికాళ్ళమీద నిలబడి చూసాడు. నేలమీద

పడివుందొక యువతి. ఎర్రచీర. అదేరంగు జాకెట్టు. పొట్ట ప్రాంతంలో లేచాయి మంటలు. యువతి మొహం ఆదయ్యకు ఎదురుగా వుంది. ఒక్కసారి గతుక్కుమన్నాడు ఆదయ్య. ఆ అమ్మాయి రోజూ ఆస్పత్రికొస్తుంది. గేటు దగ్గర బస్టాపులోనే బస్సెక్కుతుంది.

ఇంచుమించు ప్రతిరోజూ చూస్తాడామెను ఆదయ్య. బస్టాపులో యెవరూలేనపుడు తనదగ్గర శనక్కాయలు కొంటుంది. డాక్టరు చదువుతుంది. చూసేందుకు రెండు కళ్ళూ చాలని అందం.

మంటల వెలుగులో పురుషులిద్దర్నీ చూశాడు ఆదయ్య. పెట్రోలును డబ్బాలతో ఆత్రంగా ఒంపుతున్నారు వాళ్ళు ఆ అమ్మాయి శరీరంమీద. మరోసారి నిర్ఘాంతపోయాడు ఆదయ్య. ఆదయ్యకు వాళ్ళూ తెలుసు.

వెధవలిద్దరూ జేరి ఆ అమ్మాయినేదో చేసి చంపేసుంటారు. గుట్టు చప్పుడు కాకుండా ఈ మారుమూల ప్రదేశంలో తగలెట్టేస్తున్నారు. రాక్షసులు వాళ్ళు. "అమ్మ నా కొడుకల్లారా! బంగారమంటి పిల్లను పొట్టనబెట్టుకున్నారుగదరా!"

తానిప్పుడు బయటపడితే చాలా ప్రమాదం. కంటబడితే తననూ వదలరు. కిక్కురుమనకుండా పోయి పోలీసులకు చెప్పాలి సంగతి.

నెమ్మదిగా వెనక్కి అడుగేసాడు ఆదయ్య. ఆదయ్యకు గుండెలు అదురుతున్నాయి. కాళ్ళూ చేతులూ వణుకు. ఆదయ్య కాలు ఆ చీకటిలో ఎండిన కట్టెపుల్లమీద పడింది. "ఫట్" మంటూ విరిగిందది.

మంటదగ్గర వున్న మగవాళ్ళిద్దరూ వులిక్కిపడుతూ ప్రక్కకు తిరిగారు. దిక్కుతోచక కొయ్యలా నిలబడి పోయిన ఆదయ్య కనపడ్డాడు వాళ్ళకు.

"ఒరేయ్! కొంప మునిగింది! శనక్కాయల వెధవ! చంపెయ్ వాణ్ణి" కీచుగా అరిచాడు లావాటి వ్యక్తి. సన్నని వ్యక్తి మొలలోవున్న బాకును పైకిలాగాడు.

తారెత్తిపోయాడు ఆదయ్య. ఒక్కసారిగా కదలిక వచ్చిందతడిలో. వెనక్కి తిరిగి పరుగందుకున్నాడు.

"వదలకు వాణ్ణి...." అరుస్తున్నాడు లావాటి వ్యక్తి.

ఆదయ్య రెండునిముషాల పరుగుకే అలసిపోయాడు బాగా. ఆయాసంతో రొప్పుతున్నాడు. సుమారు నలభై అయిదేళ్ళుంటాయతనికి. ఎండుపుల్లలా వుంటాడు. వెంట తరుముతున్న వ్యక్తి ముప్పైఏళ్ళకు లోపువాడు. సన్నని మనిషయినా రక్తబిగువులో వున్నాడు. రైలింజన్‌లా దూసుకువస్తున్నాడు.

ఆదయ్య పళ్ళబిగువున పరుగెడుతున్నాడు. కాళ్ళు వణుకుతూ తడబడుతున్నాయతడికి. ఏ క్షణంలో తూలి ముందుకు పడతాడో తనకే తెలియని పరిస్థితి. అయినా ప్రాణాలమీద తీపి! పరుగెత్తిస్తోం దతణ్ణి!

సుమారు మూడువందల అడుగుల దూరంలో దారికి అడ్డంగా ఎత్తుగా కనబడుతోందేదో. చాలా దూరంనుండి లైట్లు రెండు వెలుగుతూ ఆ దిశగా వస్తున్నాయి. ఆద య్యలో ఆశ చిగురులు తొడిగింది.

ఆ ఎత్తయినది రోడ్డు సుమారు వందగజాల దూరంలో వుంది పాపుగంట క్రితం తెగతిరిగినా కనపడని రోడ్డు అనుకోని విధంగా దర్శనమిచ్చిందిప్పుడు. కారో, జీపో వస్తోంది. ఏదోలా రోడ్డుచేరితే గండం గడిచినట్టే. పరు గెడుతూనే వెనక్కి చూసాడు ఆదయ్య. బాగా దగ్గరకొచ్చే సాడావ్యక్తి. ఆదయ్య పరుగు వేగాన్ని పెంచాడు.

ఆదయ్యాను తరుముతున్న వ్యక్తి పరిస్థితిని గమనిం

చాడు. శనక్కాయల వెధవ రోడ్డుచేరితే ముప్పు తప్పదు. గురిచూసి కత్తి విసిరాడు. సరిగ్గా ఆదయ్య వీపులో నాటింది కత్తి. కెవ్వున అరుస్తూ ముందుకు తూలాడు ఆదయ్య.

కత్తివిసిరిన వ్యక్తి ఆనందంతో ముందుకు రాబోయాడు. కాలికి ఏదో తగిలి బోర్లా పడ్డాడు. ఆ పడడంలో తల పెద్ద రాతికి తగిలింది బలంగా. వెంటనే స్పృహ తప్పిందతనికి.

వెన్నులో నిప్పుకణం దూరినట్టు బాధ. నిలబడే ఓపిక లేదు. వీపునుండి రక్తం ధారగా ప్రవహిస్తోంది. తనపై కత్తి విసిరిన వ్యక్తి వెనక్కి తిరిగి పోయాడో, మరే మయ్యాడో తెలియదతనికి. ఏమయినా తానిప్పుడు రోడ్డు చేరాలి. లేకుంటే ప్రాణం పోయినట్టే.

నెమ్మదిగా దేకుతూ ముందుకు సాగుతున్నాడు ఆదయ్య. అతి కష్టంమీద రోడ్డును చేరగలిగాడు. లైట్లు వెలుగు దగ్గ రయింది. రోడ్డుకి అడ్డంగా స్పృహతప్పి పడిపోయాడు ఆదయ్య.

2

కుర్చీలో ఆసీనుడవుతూ "డాక్టర్! పేషెంటు పరిస్థితి ఎలా వుంది? ఎనీ హోప్!" ఆత్రంగా అడిగాడు ఇన్స్పె క్టర్ షరీఫ్.

పెదవి విరిచాడు వార్డ్ ఇన్చార్జ్ డాక్టర్ సదానందం "చెప్పలేం. కత్తి బాగా లోతుకు పోయింది. అదే ఓ అరంగుళం ముందుకుపోతే గుండెకు దెబ్బతగిలి స్పాట్ లోనే పోయుండేవాడు, ఎనీహౌ! మా ప్రయత్నం మేం చేసాం! ఏ సంగతీ చెప్పేందుకు తక్కువలో ముప్పై ఆరు గంటలు పడుతుంది" అన్నాడు.

"ఈలోగా పేషెంటుతో మాట్లాడే అవకాశం...."

"నో....నో....నో... ఎంతమాత్రం కూడదు. నిజానికి ఇప్పుడతను పూర్తిగా అపస్మారకంలో వున్నాడు. ఖచ్చితంగా చెప్పాలంటే చావు బ్రతుకుల మధ్య వూగిసలాడుతున్నాడు. దయచేసి మీరు నేచెప్పిన గడువు దాటేవరకూ అటువంటి ప్రయత్నాలేమీ చెయ్యొద్దు" అన్నాడు సదానందం.

తలవూపుతూ నిట్టూర్చాడు ఇన్ స్పెక్టర్. బయట వరండాలోకొచ్చి నిలబడ్డాడు. జీపుదగ్గర హెడ్ ఐరావతం నిలబడి వున్నాడు.

రాత్రి పదకొండుగంటల సమయంలో హాస్పిటల్నుండి స్టేషనుకు ఫోన్ కాల్ వచ్చింది. హైవేమీద కార్లో పోతున్న టూరిస్టు లెవరో రోడ్డుకు అడ్డంగా పడివున్న ఆదయ్యను చూసి హాస్పిటల్లో చేర్చి తమదారిన తాము తిరిగి పోయారు.

ఆదయ్య వివరాలకోసం తామంతగా శ్రమపడవలసిన అవసరమేదీ లేకపోయింది. హాస్పిటల్ మెయిన్గేటు ప్రక్కన బస్ షెల్టరువద్ద గోనెపరచి వేరుశనక్కాయలమ్మే ఆదయ్యను హాస్పిటల్ సిబ్బంది అంతా ఎరుగుదురు. ఆదయ్య ఒంటరివాడు.

ఇంచుమించు సాయంత్రం ఆరున్నర ఏడుగంటలవరకు వేరుశనక్కాయలు అమ్ముతూ వుంటాడట ఆదయ్య. నిన్న సాయంత్రంకూడా అక్కడ కాయలమ్ముతూ వున్న ఆదయ్యను చూసినట్టు హాస్పిటల్ సిబ్బంది కొందరు చెప్పారు. సాయంత్రం వరకూ బస్ షెల్టరువద్ద వున్న మనిషి ఆవేళప్పుడు అటువంటి నిర్జన ప్రదేశానికి యెందుకు వెళ్ళినట్టు?

భార్యాపిల్లలు లేనివాడు. ఆస్తిపాస్తులు లేనివాడు. ఒక

రితో ఏ రకంగానూ సంబంధం పెట్టుకోని వాడు! ఇటువంటి వ్యక్తిని ఎవరు, ఎందుకు హత్యచేసే ప్రయత్నం చేస్తారు. ఆదయ్య విషయంలో పరిశోధన ముందుకు సాగాలంటే అతడు వేరుశనక్కాయలమ్మే బస్ షెల్డరువద్ద విచారించాలి.

103, 301 లను ఆదయ్యను వుంచిన స్పెషల్‌రూమ్ బయట కాపలా వుంచుతూ కొత్తవారి నెవరినీ లోపలకు పంపవద్దని వాళ్ళను గట్టిగా హెచ్చరించాడు షరీఫ్. ఎందుకంటే ఆదయ్య చనిపోలేదని తెలిసిన మరుక్షణం అతనిపై హత్యాప్రత్నం జరిపిన వాళ్ళు ఈసారి గట్టి ప్రయత్నంమీద వచ్చే అవకాశం యెంతయినా వుంది.

ఐరావతం జీపు స్టార్టుచేసి షరీఫ్ మొహంలోకి చూసాడు. "గేటుకి పోనియ్!" చెప్పాడు షరీఫ్. బస్ షెల్డరుకు కాస్తంత యెడంగా జీపును ఆపించి దిగాడు షరీఫ్. షెల్డరు యెదురుగా రోడ్డుకి అవతలప్రక్క ఓ కిళ్ళీ బడ్డీ వుంది. నెమ్మదిగా అటు అడుగులు వేసాడు షరీఫ్.

ఖాకీ దుస్తుల్లో వున్న ఇనస్పెక్టర్ని చూస్తూనే బడ్డీ యజమానితో అంతవరకూ మాటాడుతూ వున్న ముగ్గురు వ్యక్తులు చల్లగా జారుకున్నారు. ఆదయ్యమీద హత్యాప్రయత్నం జరిగి అతడు హాస్పిటల్లో చావుబ్రతుకుల మధ్య తూగాడుతున్న సంగతి ప్రస్తుతం చర్చనీయాంశంగా వుందా ప్రాంతంలో.

షరీఫ్ అడిగిందానికి: "అవున్సార్! అదిగో ఆ షెల్డరు ప్రక్కనే వేరుశనక్కాయలమ్ముతూ వుంటాడతను. చాలా మంచివాడు సార్! తన గోడవేదో తనది. ప్రతిరోజూ వుదయం ఏడింటికి దుకాణం తెరచి ఇంచుమించు సాయంత్రము ఏడువరకూ కాయలమ్మేవాడు. తర్వాత కాయలేదన్నా

మిగి_లే వాటిని గోనెమూటలోనే కట్టి మా బడ్డీలోనే వాటిని దాచేవాడు. తను ఏదోచోట ఆ పూటకు భోంచేసి ఆ బస్ షెల్టరులోనే నిద్రపోయేవాడు.

నిన్న సాయంత్రం ఆరింటికి తన స్నేహితుడెవరికో బాగులేదని చెప్పి దుకాణం ఎత్తి గోనెమూటను మా బడ్డీలోనే దాచిపోయాడు. అలా వెళ్ళినవాడు మరి తిరిగిరాలేదు. కొంపల్లి నుండి ఆస్పత్రికి వచ్చినవాళ్ళు చెబుతున్న దానిని బట్టి రాత్రి ఎనిమిదిన్నర ప్రాంతంలో ఆదయ్య కొంపల్లి చేరాడట. స్నేహితుణ్ణి యిక్కడ ఆస్పత్రికే తరలించారని తెలిపి వెంటనే తిరిగి వచ్చేసాడట. ఆ రావడంలో ఏమయిందో మరి. ఇంత జరిగింది" అన్నాడు కిళ్ళీకొట్టు యజమాని.

షరీఫ్ కిళ్ళీబడ్డీలో ఓ మూల దాచబడిన శనక్కాయల మూట విప్పి కాయల్ని పూర్తిగా నేలమీద వేసాడు. కాయలు తప్ప మరేమీ లేదందులో. తిరిగి వాటిని యథా ప్రకారం మూటకట్టి ప్రక్కన పడేసాడు.

అప్పటికిక కిళ్ళీబడ్డీ యజమానిని ప్రశ్నించేందుకేంలేదు. అవసరమయినపుడు మరలా వస్తానని చెప్పి జీపెక్కాడు షరీఫ్. తిన్నగా హైవేమీదకు పోనివ్వమన్నాడు. జీపు రయ్యిన ముందుకు సాగింది.

3

ఆదయ్య మునుపు పడివున్నచోట రక్తం ఎండి చారలు కట్టివుంది. కొంపల్లిని హైవేకు కలిపే బాట అక్కడికి రెండుమైళ్ళ దూరం ముందుకి వుంది. ఆదయ్య మరి ఇంత దూరం దేనికి వచ్చినట్టు? ఆలోచిస్తే అందుకు కారణం ఒకటే కనబడుతోంది:

ఆదయ్య కొంపల్లి చేరాడు. తిరిగి ఎకాఎకిన వెనక్కి

బయల్దేరాడు. చీకటివేళ. కొంపల్లి తోవ పట్టపగలే దారుణ మనిపిస్తుంది. ఆదయ్యే పొగపాటున దారితప్పి వుంటాడు. ఈ ప్రాంతాల్లో ఎక్కడో చూడకూడనిదేదో చూపి వుంటాడు. ఆ వ్యక్తులు ఆ విషయం కనిపెట్టి ఆదయ్యను చంపే ప్రయత్నం చేసివుండాలి. ఇది కేవలం తన వూహ! నూటికి నూరుపాళ్ళు నిజం కాకపోవచ్చు!

అక్కడక్కడా నేలమీద పడి ఎండిన రక్తపు జాడ ఆధారంగా రోడ్డుదిగి పల్లంలోకి నడిచాడు షరీఫ్. ఆదయ్యే నేలమీద ప్రాకుతూ వచ్చిన దానికి నిదర్శనాలు కనపడు తున్నాయి. రోడ్డుకి సుమారు రెండువందల అడుగుల దూరంలో ఆ జాడలు అంతమయ్యాయి. అంటే ఆదయ్యను దుండగులెవరో ఇక్కడే కత్తితో పొడిచారు.

ఆ తర్వాత ఏం జరిగింది? పొడిచిన వాళ్ళు ఆదయ్యను చంపకుండా యెందుకు వదిలేసారు? ఆ దెబ్బకు చనిపోయా డని భావించిపోయారా? లేక మరేదన్నా జరిగి వెనక్కి పోయారా? ఆదయ్య కత్తిదెబ్బతిని వున్న చోటుగా భావిస్తూ షరీఫ్ మార్కు పెట్టుకున్న స్థలానికి పది పన్నెండడుగులు వెనక రాతిదగ్గర తిరిగి ఎండినరక్తం మరకలు కనపడ్డాయి. ఇదేమిటి? ఈ రక్తపు జాడ ఎలా ఏర్పడిందిక్కడ?

రాతికి సరిగ్గా నాలుగయిదడుగుల దూరంలో నేలమీద అడ్డంగా వుందొక చెట్టువేరు. దుండగుడు కత్తి విసిరి, దురదృష్టవశాత్తూ అదే సమయంలో ఆ వేరు తన్నుకొని పడిపోయివుండాలి. నేలమీద ఎండిన రక్తాన్ని బట్టి దెబ్బ గట్టిదే తగిలి వుంటుంది. దుండగుడు వెంటనే స్పృహతప్పి వుంటాడు. వాడికి ఆ తర్వాత ఎప్పుడో స్పృహ వచ్చి వుంటుంది. లేక మరో వ్యక్తి అతణ్ణి వెతుక్కుంటూవచ్చి మోసుకుపోయి వుండాలి.

ఇంతకూ ఆదయ్య ఏం చూసి వుంటాడిక్కడ. పరిసర ప్రాంతాల్లో ఇళ్ళేవీ లేవు. అంతా ఓ మోస్తరు చిట్టడవి. మరి కొంచెం ఓపికపడి వెదికితే ఏదన్నా ఆధారం లభిస్తుందేమో.

షరీఫ్ విసుగూ విరామం లేకుండా పొదలు, ముళ్ళ డొంకలు, రాళ్ళూ రప్పలతో నిండిన ఆ ప్రదేశాన్ని వేయి కళ్ళతో వెదుకుతున్నాడు. ఐరావతాని కిదంతా అయోమయముగా కాస్తంత చిరాగ్గా వుంది. అయినప్పటికీ లాఠీ భుజాన వేసుకొని ఓపిగ్గా బాస్ వెంట తిరుగుతున్నాడు.

చటుక్కున ఆగాడు ఇన్‌స్పెక్టర్. ఎదురుగా బూడిద కుప్ప. ఎవరో ఏదో కాల్చారిక్కడ! ఏమిటది? సాధారణంగా వేటగాళ్ళు కుందేళ్ళను, అడవి పందులను వేటాడి వాటిని యిక్కడే కాల్చి పట్నంలోకి తీసుకుపోవడం జరుగుతూ వుంటుంది. ఒకవేళ అటువంటిదేమయినా జరిగిందా?

ప్రక్కన వున్న పొదకు అంటుకొని ఎండలో యెర్రగా మెరుస్తూ కనపడిందేదో. రెండడుగుల్లో పొదను చేరి తీసాడు దానిని.

సుమారు రెండంగుళాల సిల్కు గుడ్డముక్క! చీరలేక పరికిణీ కొంగు చివరభాగమది. ఒకప్రక్క కాలిన అంచులు మసిబారి వున్నాయి. చీరలేక పరికిణీ మొత్తం మంటలో కాలిపోగా ఈ కొసముక్క గాలికి ఎగిరి యిటుగా వచ్చి పొదకు తగులుకుంది.

ఈ మంట వేటగాళ్ళు వేసింది కాదు. జంతువుల్ని కాల్చిన గుర్తులేవీ లేవిక్కడ. చీరల్ని పరికిణీల్ని తీరిగ్గా కూర్చొని కాల్చరెవరూ! జరిగిందేమిటో షరీఫ్ చూచాయగా ఆలోచించగలుగుతున్నాడు. బూడిద మొత్తం చేతితో కలిపాడు ఓపిగ్గా. గట్టివి చిన్నచిన్న మట్టిముద్ద

ల్లాంటివి దొరికాయి. పై బూడిదను శుభ్రంగా తుడిచాడు. మట్టిముద్దలు కావవి. బంగారం! పచ్చనిరంగు సూర్యుని ఎండలో మరింత పచ్చగా మెరుస్తోంది.

తన అనుమానం నిజమే అయ్యింది. స్త్రీ శవాన్ని మంటలో తగలబెట్టారెవరో. ఆమె ఎర్రరంగు దుస్తులు ధరించింది. బంగారం నగలు ఆమె ఒంటిన వున్నాయి. ఆదయ్యా ఆ దృశ్యమే చూసివుంటాడిక్కడ. ఇంకేముంది! కొంప మునిగిందనుకున్నారు హంతకులు. తన అంచనా ప్రకారం వారు ఇద్దరయ్యేందుకు అవకాశముంది.

ఒకడు మంటదగ్గర వుండగా రెండోవాడు ఆదయ్యాను వెంటాడి వుంటాడు. అంతకు మించి మనుషులు ఎక్కువ వుంటే ఆదయ్యాను ఒకరికంటే ఎక్కువమందే వెంటాడ తారు. అప్పుడు ఆదయ్యా బ్రతికి బయటపడే అవకాశం వుండేదికాదు.

షరీఫ్ తన పరిశోధనా ఫలితాన్ని క్రోడీకరించి రాత్రి జరిగిన సంఘటనకు ఒక రూపాన్ని కల్పిస్తున్నాడు.

కొంపల్లి వెళ్ళిన ఆదయ్యా తిరుగు ప్రయాణంలో దారి తప్పి ఇటు వచ్చాడు. అదే సమయాన ఇద్దరు వ్యక్తులు ఒక స్త్రీ శరీరాన్ని తగలబెడుతున్నారిక్కడ. ఆదయ్యా ఆ దృశ్యాన్ని చూసాడు. హంతకులు ఆదయ్యాను గుర్తించి అతణ్ణి చంపాలని నిశ్చయించుకున్నారు.

హంతకుల్లో ఒకడు ఆదయ్యా వెంటపడ్డాడు. కత్తివిసిరి మొత్తానికి అతడు ఆదయ్యాను దెబ్బతీయగలిగాడు. కానీ దురదృష్టవశాత్తూ కాళ్ళకు చెట్టువేరు అడ్డంపడగా కిందపడి స్పృహతప్పాడు. ఈలోగా ఆదయ్యా దేకుతూ రోడ్డు చేరాడు. అటుపిమ్మట రెండవ హంతకుడు తన సహచరుణ్ణి వెతుక్కుంటూ వచ్చి స్పృహతప్పి పడివున్న వాణ్ణి

మోసుకుపోవడమో లేక స్పృహవచ్చి ఆ వ్యక్తే వెనక్కి తిరిగిపోవడమో జరిగి వుంటుంది—

తన ఆలోచన నిజమే అయితే ఆదయ్యమీద మరోసారి తప్పకుండా హత్యాప్రయత్నం జరుగుతుంది. కాబట్టి హాస్పిటల్ దగ్గర కాపలా మరింత పకడ్బందీగా వుండాలి. స్టేషనుకు వెళుతూ తాను చెయ్యాల్సిన పని అదే యిప్పుడు.

గుడ్డముక్కను భద్రంగా జేబులో దాచి, కాలిన బూడిదను కొంత పొట్లం కట్టాడు. బూడిదను లేబరేటరీలో టెస్టు చేయిస్తే మంటల్లో మానవ శరీరం తగలబెట్టబడిందీ లేనిదీ స్పష్టమవుతుంది.

4

ఇన్స్పెక్టర్ షరీఫ్ జీపు దిగి స్టేషన్లో అడుగుపెట్టాడు. తనకోసమని అప్పటికే సిద్ధంగా వున్నాడొక ముసలాయన. షరీఫ్ కుర్చీలో ఆసీనుడు కాగానే నమస్కరిస్తూ లోనికి ప్రవేశించాడు.

యాభై అయిదు అరవై ఏళ్ళ మధ్య వుంటుందాయన వయసు. సన్నని పొడవాటి శరీరం. గ్లాస్కో పంచె లాల్చి ధరించాడు. కళ్ళకు గోల్డుఫ్రేమ్ అద్దాలు. మనిషి హుందాగా దబ్బపండు ఛాయలో వున్నాడు. మొహంలో మాత్రం ఏదో ఆందోళన ఆదుర్దా స్పష్టమవుతోంది.

ప్రతినమస్కారం చేస్తూ కుర్చీ చూపించి "కూర్చోండి" అన్నాడు షరీఫ్. కుర్చీలో చతికిలబడ్డాడాయన. పైకండువాతో నుదుట పట్టిన చెమటను అద్దుతూ:

"నా పేరు పురుషోత్తమ్. విశాఖ డ్రగ్స్టోర్సు మాదే.." అని ఆగాడు.

షరీఫ్ తలవూపుతూ "చెప్పండి" అన్నాడు.

"మా అమ్మాయి సౌందర్య ఎం.బి.బి.ఎస్. థర్డ్ యియర్

చవదువుతోంది. నిన్న మధ్యాన్నం ఏవో ప్రాక్టికల్ క్లాసు లంటూ హాస్పిటల్‌కి వెళ్ళింది. ఇంతవరకూ రాలేదు....” పురుషోత్తమ్ కంఠం వణికింది.

“ఎవరన్నా స్నేహితులు లేక చుట్టాలు....” అంటున్న షరీఫ్ మాటల కడ్డొస్తూ.

“అంతా వెతికాం.... తెలిసిన ప్రతి యింటికీ ఒకటికి పదిసార్లు వెళ్ళాం. అంతటా ఒకే సమాధానం. సౌందర్య మా యింటికి రాలేదు....రాలేదు....” అద్దాలు తీసి గుడ్డతో కళ్ళు వత్తుకున్నాడు పురుషోత్తమ్.

“అడుగుతున్నానని మరోలా భావించకండి! అమ్మాయికి మగ స్నేహితులు అదే బాయ్‌ఫ్రెండ్స్ యెవరయినా వున్నారా?”

పురుషోత్తమ్ తల అడ్డంగా వూపాడు. ఓ క్షణం మౌనం వహిస్తూ “ఇన్‌స్పెక్టర్‌గారూ కాకిపిల్ల కాకికి ముద్దంటే నే చెప్పేదేం వుండదు. సౌందర్య నిజంగా నాకు గర్వకారణం. చాలా చక్కగా చదువుతుంది. ఆమెకి ఆడ స్నేహితులు కూడా లేరంటే మీరు ఆశ్చర్యపోవచ్చు. టైముకు క్లాసులకు వెళుతుంది. టైముకి యింటికి వచ్చేస్తుంది. సినిమాలయినా సరదాలయినా మా కుటుంబంతోనే” కూతుర్ని గూర్చి గర్వంగా చెప్పాడు పురుషోత్తమ్.

షరీఫ్ “పురుషోత్తమ్‌గారూ! వ్యాపారరీత్యా గాని, కుటుంబ వ్యవహారాలకు సంబంధించిగాని, మీకు విరోధు లెవరయినా వున్నారా? బాగా ఆలోచించి చెప్పండి. ఎందు కనంటే కక్షలు కార్పణ్యాలు ఎక్కువకాలం బ్రతికి వుంటాయి” అన్నాడు.

పురుషోత్తమ్ కొద్దిక్షణాలు ఆలోచించి నెమ్మదిగా “లేదు! అటువంటి అవకాశమే లేదు” అని చెప్పాడు.

షరీఫ్ తల వూపుతూ "సరే! మీరొక రిపోర్టు రాసి వ్వండి. మీ అమ్మాయి ఆచూకీ కనిపెట్టే ప్రయత్నం మేం వెంటనే ఆరంభిస్తాం. మీ అమ్మాయి ఫోటో ఏదన్నా తెచ్చారా?" ప్రశ్నించాడు షరీఫ్.

పురుషోత్తమ్ జేబులో నుండి కార్డుసైజు ఫోటో ఒకటి తీసి షరీఫ్ చేతికిచ్చాడు. ఫోటోవంక రెప్పవాల్చకుండా చూస్తూ వుండిపోయాడు షరీఫ్. సౌందర్య పేరుకు తగ్గ మనిషి. ఆ అందాన్ని తిలకించేందుకు రెండు కళ్ళూ చాల వనిపించిందతనికి.

ఫోటోమీద నుండి దృష్టి మరల్చి "సౌందర్య నిన్న ఇంటినుండి బయల్దేరేటపుడు ఎటువంటి దుస్తులు ధరించిందో చెప్పగలరా?" యథాలాపంగా అడిగాడు షరీఫ్.

"ఎర్ర పిల్కుచీర, అదే రంగు బ్లౌజు" తడుముకోకుండా చెప్పాడు పురుషోత్తమ్.

కుర్చీకి జారబడివున్న వాడల్లా ఒక్కసారి నిటారుగా కూర్చొని "ఎరుపురంగు పిల్కుచీరా???" అన్నాడు షరీఫ్.

"అవున్సార్! ఆ రంగంటే అమ్మాయికి చాలా ఇష్టం" ఇంకా ఏమేమో చెబుతున్నాడు పురుషోత్తమ్. అతన్ని మధ్యలోనే ఆపి—

"సౌందర్య ఒంటి మీద బంగారు నగలేమన్నా వున్నాయా?" అడిగాడు షరీఫ్ ఆదుర్దాగా.

"వున్నాయి! చేతికి గాజులు, మెడలో చెయిను, రింగులు వగయిరా...." చెప్పాడు పురుషోత్తమ్.

షరీఫ్ ఆలోచిస్తున్నాడు. అయితే తన జేబులో ఎర్ర పిల్కుముక్క సౌందర్య చీరకు సంబంధించినదన్నమాట. బూడిదలో దొరికిన బంగారం సౌందర్య ఒంటిమీద వుండిన

నగలు కరిగి ముద్దయిన బాపతన్నమాట! మంటలో కాలి బూడిదయిన స్త్రీ శరీరం సౌందర్యదేకావచ్చు. ప్రాక్టికల్ క్లాసులకని వెళ్ళిని సౌందర్య ఆ హంతకుల చేతికి ఎలా చిక్కింది.

"మీ అమ్మాయి హాస్పిటల్ క్లాసులకు ఎలా వెళు తుంది?" ప్రశ్నించాడు షరీఫ్ పురుషోత్తమ్‌ని.

"సిటీబస్‌లో!"

కరెక్ట్! అటువంటప్పుడు సౌందర్యమొహం ఆదయ్యకు బాగానే తెలిసుంటుంది సౌందర్య మామూలు యువతికాదు. ఆమెను ఒకసారి చూపినవారు అంత వేగంగా మరిచి పోలేరు. ఆ చిట్టడవి ప్రాంతంలో ఆదయ్య చూపిన స్త్రీ శవం సౌందర్యదేకావచ్చు. ఆ పరిస్థితుల్లో హంతకులు సయితం హాస్పిటల్ ప్రాంతానికి సంబంధించిన వారన్న మాట!

షరీఫ్ తన జేబులోవున్న చీర ముక్కను పురుషోత్తమ్‌కి చూపిద్దామా? అనే వుద్దేశాన్ని అంతలోనే విరమించు కున్నాడు. ముసలాడు ఇప్పటికే బేజారుపడుతున్నాడు. ఈ స్థితిలో ఈ విషయం కూడా బయటపెడితే అసలు కోలుకో లేడు. ఏ సంగతీ పూర్తిగా తేలాక అసలు విషయం నెమ్మదిగా చెప్పవచ్చనే తలంపుతో అతనినుండి రిపోర్టు మాత్రం తీసుకొని, త్వరలో సౌందర్య విషయం తేలుస్తా మని చెప్పి, ఓదార్చి పంపేసాడు.

5

జీపులో ఎకాఎకిని హాస్పిటల్ మెయిన్‌గేటు దగ్గరబస్ షెల్టరు ఎదురుగావున్న కిళ్ళీబడ్డీ వద్దకు మరోసారి బయల్దే రాడు షరీఫ్. బస్ షెల్టరు బడ్డీకి ఎదురేగనక సౌందర్యను తరచూ చూసే అవకాశం బడ్డీ యజమానికీ వుంది. ప్రత్యే

కించి నిన్న సాయంత్రంవేళ సౌందర్య పరిస్థితిని అతదే మయినా వివరించగలదేమోనన్నది యిన్స్పెక్టర్ ఆశ!

షరీఫ్‌ని చూస్తూనే వినయంగా "నమస్కారం సార్!" అన్నాడు కిళ్ళీకొట్టు యజమాని.

షరీఫ్ చిరునవ్వుమొహంతో "నువ్వు నాకో సహాయం చెయ్యాలోయ్!" అన్నాడు.

"చెప్పండి సార్!" వుత్సాహంగా అన్నాడతను.

షరీఫ్ తన జేబులోవున్న ఫోటో తీసి అతని కళ్ళ ముందుంచుతూ "ఈ అమ్మాయిని నువ్వెప్పుడన్నా చూసావుటోయ్" అన్నాడు తాపీగా.

"ఈ అమ్మాయి రోజూ ఎదురుగావున్న ఆ బస్ షెల్టరు దగ్గరేకదండీ బస్ ఎక్కేది. తెలీకపోవడమేమిటి? నిన్న సాయంత్రం కూడా బస్‌కోసం ఆ అమ్మాయి అక్కడ నిలబడి వుండడం చూసాను"

షరీఫ్ వుత్సాహంగా "అప్పుడీ అమ్మాయి ఎలాంటి దుస్తులు ధరించిందో చెప్పగలవా?" అడిగాడు.

"ఎర్రచీర, ఎర్ర జాకెట్టూనండి!"

"కరెక్ట్! మరి ఆ అమ్మాయి అప్పుడు బస్సులో వెళ్ళిపోయిందా?"

"లేదండి. కారులో వెళ్ళింది"

"అలాగా! కారులో అప్పుడు ఎవరున్నారో చూసావా, కారు నెంబరు, పేరు, రంగు ఇలాంటివేమన్నా చెప్పగలవా?"

యిబ్బందిగా బుర్ర గోక్కున్నాడు బడ్డీయజమాని. "అవేవీ చెప్పలేనుగాని ఆ అమ్మాయి కారులో వెళ్ళిందని మాత్రం చెప్పగలనండి" అన్నాడు చివరకు.

"అదెలాగోయ్! కారునుగూర్చి ఏ వివరమూ చెప్పలేని

వాడివి ఆ విషయం మాత్రం అంత ఖచ్చితంగా ఎలా చెప్పగలవు?" అడిగాడు షరీఫ్.

"అదెలాగంటే! ఆ అమ్మాయి బస్‌కోసం షెల్టరులో నిల్చుందండి. అప్పుడే పెద్ద పార్శిలు వేనొకటి నా బడ్డీ ఎదురుగా సడన్ బ్రేకుతో ఆగిందండి. వేనుకి సైకిల్ కుర్రాడెవడో అడ్డంవచ్చాడు. వేన్‌డ్రైవరు సైకిల్ కుర్రాణ్ణి కేకలేస్తున్నాడు. ఈలోగా వేను అవతలి నుండి అంటే ఇంచుమించు బస్ షెల్టరుకు చేరువగా మూడుకార్లు వెళ్లాయి. రెండు మూడు నిమిషాల్లో వేనుకూడా వెళ్ళిపోయింది. ఆ అమ్మాయి బస్ షెల్టరులోలేదు. అంటే ఆ అమ్మాయి ఆ మూడు కార్లలో ఏదో ఒకదానిలో వెళ్ళినట్టేకదా!" అన్నాడు బడ్డీ యజమాని.

"అలా ఎలా అనుకోగలం? ఆ అమ్మాయి రోడ్డుకి అటో యిటో నడిచి వెళ్ళుండొచ్చుగా?"

"అలా వెళ్ళలేదండి! వెళ్తే ఆ అమ్మాయి తప్పకుండా నా కంటబడుతుంది" నమ్మకంగా చెప్పాడతను.

"అంటే ఆ అమ్మాయిని నువు చాలా జాగ్రత్తగా కనిపెడుతున్నావన్నమాట!" నవ్వుతూ అన్నాడు షరీఫ్.

కొట్టు యజమాని సిగ్గుపడుతూ తలవంచుకున్నాడు "ఆ అమ్మాయి ఎదురుగా వున్నంతసేపూ మరొకటి చూడాలనిపించదు సార్! ఫోటో చూసారుగా సార్! నిజానికి ఆ ఫోటోలో వున్నదానికన్నా అందంగా వుంటుంది ఆమె!" అన్నాడు.

కొట్టు యజమాని పాతికేళ్ళ కుర్రాడు. సౌందర్య ఆ వయసు కుర్రాళ్ళను అంతగా ఆకర్షించడంలో వింతేంలేదు.

"సార్! ఇన్ని అడుగుతున్నారు. యింతకూ జరిగిందేమిటి?" జంకుతూనే అడిగాడు బడ్డీకొట్టు యజమాని.

"మరేంలేదోయ్! ఆ అమ్మాయి నిన్నటినుండీ కనబడ డంలేదు!"

"ఆ!!!" ఆశ్చర్యపోయాడు కొట్టు యజమాని. "నిశ్చ యంగా అది వాళ్ళపనే అయ్యుంటుంది!" తనలో తాను గొణుక్కున్నాడతను.

"వాళ్లెవరు?" ప్రశ్నించాడు షరీఫ్ ఆసక్తిగా.

"వాళ్ళేసార్! ఎప్పుడూ ఆ అమ్మాయి వెంట వుంటారు, దొంగచూపులూ వాళ్ళూనూ! ఏదో ఒకటి సూటి పోటిమాటలు వదుల్తుంటారు. ఒకోసారి బడ్డీ దిగి వెళ్ళి వెధవలిద్దర్నీ చితక్కొట్టేద్దామన్నంత కోపం వస్తుంది నాకు" ఆవేశంగా అన్నాడు కొట్టు యజమాని.

"ఎలా వుంటారు వాళ్ళు! పేర్లూ మిగతా వివరాలేమన్నా తెలుసా నీకు!"

"పేర్లేవీ తెలియదుగానండి. ఆ అమ్మాయితో కలిసి చదువుకునేవాళ్ళే అనుకుంటాను. ఒకడు సన్నగా మరొకడు లావుగా. అవేవో యింగ్లీషు సినిమాల్లో మన రేలంగి, రమణారెడ్డిల్లా వుంటారు...." అంటూ బుర్ర తడుముకుంటున్నాడతను.

"లారెల్! హార్డీల్లానా...." అడిగాడు షరీఫ్.

"ఔన్సార్! అచ్చంగా అలానే వుంటారు వాళ్ళు" చెప్పాడు బడ్డీ యజమాని.

6

ఇన్‌స్పెక్టర్ షరీఫ్ హాస్పిటల్ ఆవరణలో అడుగు పెట్టేసరికి హడావుడిగా పరుగెత్తుకొస్తున్నాడు 103. భయం, ఆందోళన అతని మొహంలో స్పష్టంగా గోచరిస్తు న్నాయి.

"సార్! సార్....అదయ్యి వచ్చిపోయాడ్సార్! అతనికి

ఎవరో విషమిచ్చి చంపారు" అన్నాడు.

షరీఫ్ అదిరిపడుతూ "ఆ:!!" అన్నాడు ఒకేసారి. వెంటనే తేరుకొని స్పెషల్‌రూమ్ దిక్కుగా పరుగందు కున్నాడు.

డాక్టర్లు, నర్సులు, ఆదయ్య శవం చుట్టూ గుంపులా వున్నారు. అందరి మొహాల్లోనూ భయం, కంగారు తాండ విస్తున్నాయి. యిన్‌స్పెక్టర్ని చూస్తూనే ప్రక్కకు తప్పు కున్నారంతా!

"ఏం జరిగింది?" అడిగాడు షరీఫ్, శవం ప్రక్కనే నిల బడివున్న యిన్‌ఛార్జి సదానందాన్ని. అతని మొహం నల్లబారి వుంది.

"ఆదయ్య శరీరంలో విషాన్ని యింజెక్ట్ చేసారెవరో" చెప్పాడు సదానందం నెమ్మదిగా.

అనుకున్నంతా జరిగింది. పరిశోధన జోరులోపడి తను చేసిన కొద్దిపాటి ఆలస్యం ఆదయ్య ప్రాణాలను బలిగొంది. కేసుకు వున్న ఒకే ఆధారం మట్టికొట్టుకుపోయింది. 103, 301 లు బిక్కుబిక్కుమంటూ చూస్తున్నారు షరీఫ్‌వంక. వారిని చూస్తూనే రెచ్చిపోయాడు షరీఫ్.

"మీరిద్దరూ ఏం చేస్తున్నారు. ఇతరులెవరినీ లోనికి వెళ్ళవద్దని మీకు చెప్పలేదా?" కోపంగా అరిచాడు షరీఫ్.

103 నసుగుతూ "మీరు చెప్పినట్టే పైవాళ్ళెవరినీ లోని కసలు అడుగుపెట్టనివ్వలేదు సార్!....ఆస్పత్రి సిబ్బందిని మాత్రమే వదిలాం...." చెప్పాడు.

డాక్టర్ సదానందం గాఢంగా నిట్టూరుస్తూ "వాళ్ళను తప్పుపట్టి ప్రయోజనంలేదు ఇన్‌స్పెక్టర్! మనం ప్రత్యే కించి ఆదయ్యకోసమని ఓ డాక్టర్ని నర్సును నియమించి వుంచితే, ఏ సమస్యా వుండేదికాదు. అలా కాకుండా ఎవరు

పడితే వారు లోనికివెళ్ళి రావడం కారణంగా తెల్లబట్టలు తొడుక్కున్న ప్రతి వ్యక్తినీ లోనికి వదిలేసారు మీవాళ్ళు. పొరపాటు మనది!" అన్నాడు.

103, 301 లు సదానందంవంక కృతజ్ఞతగా చూసారు.

ఆదయ్యమీద పెట్టుకున్న ఆశ కాస్తా నిరాశేఅయింది. సదానందాన్ని "లారెల్ హార్డీల్లావుండి ఎప్పుడూ జంటగా తిరిగే మెడికల్ స్టూడెంట్సు ఎవరు?" అని అడిగాడు షరీఫ్.

"వారి విషయం దేనికిప్పుడు?" ఆశ్చర్యంగా అడిగాడు సదానందం.

"కావాలి" ముక్తసరిగా జవాబిచ్చాడు షరీఫ్.

"సారధి, సుధీర్‌లు వాళ్ళిద్దరూనూ. నిజానికి వాళ్ళను ఇక్కడ అందరూ లారెల్‌హార్డీలనే పిలుస్తారు. కావాలంటే వాళ్ళఫోటో కూడా వుందిక్కడ. మొన్నజరిగిన ఓ ఫంక్షన్‌లో మేమంతా వున్నాం అందులో. రండి చూపిస్తాను" అంటూ సదానందం కదిలాడక్కడ నుండి.

సదానందం వెంటనడిచాడు షరీఫ్. తన రూమ్‌లో గోడకు వున్న ఫోటోల్లో నుండి ఒక ఫోటో తీసి షరీఫ్‌కిచ్చాడు సదానందం.

ముందువరుసలో సదానందం మరి కొంతమంది డాక్టర్లు వున్నారు. మరికొంతమంది వెనుక వరుసగా నిలబడి వున్నారు. ఫోటో చాలా క్లియర్‌గా వుంది.

"సారధి సుధీర్‌లు వీళ్ళే!" నిలబడ్డవారిలో ఇద్దర్ని వేలితో చూపిస్తున్నాడు సదానందం. షరీఫ్ సదానందం మొహంలోకి ఆసక్తిగా చూసాడు.

"అచ్చం లారెల్ హార్డీల్లానే వున్నారు కదూ?" నవ్వుతూ అన్నాడు సదానందం. షరీఫ్‌తల వూపాడు అవు నన్నట్టుగా.

7

కోళ్ళగూడులా వున్న ఆ పెంకుటింట్లోకి ఒంగి ప్రవేశించాడు షరీఫ్. హెడ్ ఐరావతం, 103, 301 లు బయటే వుండిపోయారు. గదిలో ఒకే ఒక మంచంవుంది. అంతకు మించి ఓ కుర్చీకూడా పట్టేచోటు లేదక్కడ దుప్పటి కప్పుకొని మంచంమీద మునగదీసి పడుకున్నాడోవ్యక్తి,

"వైకుంఠం!" పిలిచాడు షరీఫ్ గట్టిగా.

తృళ్ళిపడుతూ లేచిన ఆ వ్యక్తి ఖాకీదుస్తుల్ని చూస్తూనే మరింత కంగారు పడిపోయాడు. వైకుంఠానికి పాతికేళ్ళ వయసుంటుంది. అతని తలకు బేండేజీవుంది.

"ఏ....ఏ ... ఏంటిసార్ .... ఎందుకు .... స్సార్!" అన్నాడు తడబాటుతో.

"నువ్వేం కంగారుపడకు వైకుంఠం ...మాకు అంతా తెలిసిపోయింది. పద పోలీస్‌స్టేషన్‌కి" కరుగ్గా పలికాడు షరీఫ్.

"అయ్యో! నాకేం తెలియదుసార్! నా మాట నిజం సార్! అంతా ఆయనే చేసాడు సార్! మీరు నామాట వింటానంటే జరిగింది చెబుతానుసార్!" అన్నాడు వైకుంఠం వణికిపోతూ.

"చెప్పు! కానీ ఒకటి గుర్తుంచుకో అబద్ధం చెప్పావా! తోలు వలిచేస్తాను" హెచ్చరించాడు షరీఫ్. వైకుంఠం తలవూపి చెప్పసాగాడు.

అరగంట తర్వాత షరీఫ్ ఒక్కడే డాక్టర్ సదానందం గదిలో ప్రవేశించాడు.

లోపల ప్రశాంతంగా వుంది వాతావరణం. పైన తిరిగే సీలింగు ఫేను చప్పుడు స్పష్టంగా వినపడుతోంది. గది

మధ్య అందంగా అలంకరింపబడిన పెద్ద టేబిలు వెనకవున్న రివాల్వింగ్ చెయిర్ వెనక్కి తిరిగివుంది. అందులో మనిషి కూర్చొని వున్నదానికి నిదర్శనంగా తలా కాళ్ళూ చేతులు కొద్ది కొద్దిగా కనిపిస్తున్నాయి.

"డాక్టర్!" పిలిచాడు షరీఫ్ గంభీరంగా. రివాల్వింగ్ చెయిర్‌లో ఏ కదలికాలేదు. షరీఫ్ నెమ్మదిగా కదిలాడటు. అతని బూట్ల చప్పుడు నిశ్శబ్ద వాతావరణంలో సమ్మెట దెబ్బల్ని పోలి వినిపిస్తున్నాయి.

డాక్టర్ సదానందం చెయిర్‌లో తల వెనక్కి వాల్చి ప్రశాంతంగా నిద్రపోతున్నాడు. ఆ తీరు అసహజమనిపించి సదానందం భుజం మీద చెయ్యివేసి కదిపాడు షరీఫ్. ఒక్కసారిగా ముందుకుపడింది సదానందం శరీరం. అతని చేతినుండి కిందపడి ప్రక్కకు దొర్లిపోతోందొక ఖాళీబాటిల్.

బాటిల్ అందుకున్నాడు షరీఫ్. పాయిజన్ అనే ఇంగ్లీషు అక్షరాలు సీసాకు అంటించివున్న లేబిలుమీద కనపడ్డాయి. షరీఫ్ దీర్ఘంగా నిట్టూర్చాడు. సదానందం జేబులో మడిచి పెట్టబడిన కాగితమొకటి కనిపిస్తోంది పైకి.

కాగితాన్ని బయటకు లాగాడు షరీఫ్. సదానందం స్వహస్తాలతో తన నుద్దేశించి రాసిన వుత్తరమది. చదవ సాగాడు షరీఫ్—

"ఇన్‌స్పెక్టర్!

మీరు నిజం తెలుసుకున్నారు! దాచినా దాగనిది నిజం అనే విషయం మరోసారి స్పష్టమయింది. అందుకే నా నేరాన్ని అంగీకరిస్తూ ఈ లోకం నుండి శాశ్వతంగా సెలవు తీసుకుంటున్నాను.

సౌందర్య నా మనసును ఆకర్షించినట్టుగా ఈ లోకంలో మరేదీ నన్ను ఆకర్షించలేదన్నమాట నమ్మాటికీ నిజం.

నాకు తెలుసు, సౌందర్యకంటే వయసులో రమారమి మూడింతలు పెద్దవాణ్ణి. అయినా నాలో వెర్రితలలు వేసిన బలహీనతను అదుపులో పెట్టలేకపోయాను. సౌందర్యను ఏదోలా నా స్వంతం చేసుకోనిదే నా మనసుకు శాంతిలేదని చివరికి తెగించక తప్పలేదు నేను.

సౌందర్య బస్టాపుదగ్గర బస్సుకోసమని వేచివుంది. డ్రైవర్ వైకుంఠం కారును సరిగ్గా ఆమె ముందు ఆపాడు. వాణ్ణి నేను నయానా భయానా ముందే నా వశం చేసుకున్నాను. సౌందర్యను కార్లోకి ఆహ్వానించాను. ఆశ్చర్యపోయిందామె. ఎందుకులెండి బస్సులోపోతానంది. నేనెలాగూ మీ యింటిమీదుగా వెళ్ళాల్సిన పనివుంది గనక ఫరవాలేదు రమ్మన్నాను. సౌందర్య నా మాట కాదనలేక కారెక్కింది.

కారు బయల్దేరింది. వెనకసీట్లో చెరోప్రక్కా వున్నాం మేమిద్దరం. నేను ఏమేమో ప్రశ్నలు వేస్తున్నాను. సిగ్గుపడుతూ ఒదిగి ఒదిగి సమాధాలు చెబుతోంది సౌందర్య. సౌందర్య ఆ సమయంలో మరింత ముద్దొచ్చింది నాకు. కారు తోవ మళ్ళాల్సిన సమయం వస్తోంది. చేతిలో పుస్తకాన్ని తెలివిగా సౌందర్య దిక్కుగా కిందకు జారవిడిచాను. సౌందర్య పుస్తకాన్ని తీసి నా కివ్వాలనే వుద్దేశంతో ప్రక్కకు వంగింది. సరయిన సమయం.

మత్తుమందు జల్లిన జేబురుమాలుతో సౌందర్య మొహాన్ని అదిమిపట్టాను. కాసేపు గిజగిజలాడి నా చేతుల్లో వాలిపోయింది సౌందర్య.

కారు తిన్నగా నా బంగళాచేరింది. నేనూ వైకుంఠం కలిపి సౌందర్యను లోపలికి మోసుకుపోయాం. సౌందర్యను బెడ్ రూమ్‌లో మంచంమీద వేసి తలుపులు బిగించాను.

డ్రైవర్ వైకుంఠం బయట ఎక్కడో వున్నాడు. మా వాళ్ళంతా వూరెళ్ళడం నాకు బాగా అనుకూలించింది. నిజానికి నేను అటువంటి సమయం కోసమే వేచివున్నాను చాన్నాళ్ళుగా.

సౌందర్య మంచంమీద స్పృహ లేకుండా పడివుంది. అవధుల్లేని వుద్రేకంతో సౌందర్య శరీరం మీద విరుచుకు పడ్డాను. సరిగ్గా అప్పుడే స్పృహలోకి వచ్చింది సౌందర్య.

కళ్ళు తెరుస్తూనే పరిస్థితిని గమనించి అదిరిపడింది. నేను నయానా భయానా సౌందర్యను లొంగదీసుకునే ప్రయత్నం చేసాను. ప్రయోజనం లేకపోయింది. ఇక బలవంతమే శరణ్యమనుకున్నాను. తనపైన పడుతున్న నన్ను ఒక్క సారిగా వెనక్కి నెడుతూ లేచింది సౌందర్య. ఆ వూపు కాచుకోలేక వెనక్కిపడ్డాను.

సౌందర్య మంచం మీద నుండి కిందకు దూకింది. ప్రక్కనే టేబిలు మీద పండ్లుకోసుకునే చాకువుంది. సౌందర్య చటుక్కున ఆ చాకు అందుకుంది. నేను మరో సారి సౌందర్యమీద దూకేందుకు సిద్ధపడుతున్నాను.

సౌందర్య తన చేతిలో కత్తిని నాకు చూపుతూ "ఖబడ్దార్" అంది కోపంతో వణికిపోతూ. నేను అటువంటివేవీ పట్టించుకునే స్థితిలోలేను. ప్రాణం పోయినాసరే సౌందర్య నాకు కావాలి! అంతే! పిచ్చివాడిలా నవ్వుతూ ముందుకు దూకాను. సౌందర్య చాకుతో నా గుండెల్లో పొడవబోయింది. చురుగ్గా ప్రక్కకు తప్పుకున్నాను. ఆ విసురులో ముందుకు తూలి పడింది సౌందర్య. కత్తిపట్టిన చేయి ముందుగా నేలకు తగిలి మెలితిరిగి చాకు సరిగ్గా ఆమె గుండెల్లో దూసుకు పోయింది.

అంతే! సౌందర్య చిన్నగా మూలిగి ఎలాపడింది అలాగే వుండిపోయింది.

నేను నిశ్చేష్టుణయ్యాను. వుద్రేకమంతా చప్పున చల్లారి పోయింది. కాళ్ళూచేతులూ వణుకుతూ ఒళ్ళంతా చెమటలు పట్టేసింది. తలుపులు తెరచి బయటికి పరుగెత్తాను. వైకుంఠం బయట మెట్లమీద కునికిపాట్లు పడుతున్నవాడల్లా నా వాలకంచూపి తారెత్తిపోయాడు.

అసలు విషయం చెప్పేసరికి వైకుంఠం భయంతో మూర్ఛపోయినంతగా బేజారెత్తిపోయాడు. అతణ్ణి తిరిగి మామూలు స్థితికి తెచ్చేసరికి నాకు తాతలు దిగివచ్చినంత పనయింది. ఇద్దరం కలిపి సౌందర్య శరీరాన్ని గుట్టు చప్పుడు కాకుండా దూరాన ఎక్కడో తగలబెట్టాలనే నిర్ణయానికి వచ్చాం.

అంతా సద్దుమణిగాక సౌందర్య శవాన్ని కార్లో తీసుకు పోయాం. సౌందర్యదేహాన్ని ఆ నిర్జనప్రదేశంలో తగల బెడుతుండగా ఒకేసారి మంట పైకుబికి నా కుడి కనుబొమ్మ మీద వెంట్రుకలు బాగా కాలిపోయాయి. దానిని సరిదిద్దేం దుకు రెండో కనుబొమ్మమీద వెంట్రుకల్ని తర్వాత నేనే తగ్గించేసాను.

నా కనుబొమ్మలు అందరిలాకాక బాగా ఒత్తుగా వుంటాయి. సారధి, సుధీర్‌లకోసం ఫోటో చూస్తూ మీరు నా కనుబొమ్మల వెంట్రుకల తేడాను కనిపెట్ట గలిగారని. ఆ ఆధారంతోనే మీరు తీగలాగుతున్నారని అర్ధమయింది నాకు.

ఫోటో చూసాక బయట ఓ వార్డుబాయ్‌ని ప్రశ్నిస్తుండగా మిమ్మల్ని తలుపుసందులో నుండి గమనించాను. మీరు

వెళ్ళిపోయాక వార్డుబాయ్‌ని అడిగాను. మీరు మొదట నా కనుబొమ్మల విషయం అతణ్ణి ప్రశ్నించి, ఆ తర్వాత డ్రైవర్ అడ్రసు అడిగినట్లు చెప్పాడు వాడు. వాడి తలకు తగిలిన గాయం ఇంకా అలాగేవుంది. వాడిచేత నిజం చెప్పించటము మీకో పెద్దపనిలోది కాదు.

దాదాపుగా బోనులో ఇరుక్కుపోయాననే నిర్ణయానికి వచ్చాను. బేడీలు, కటకటాలు, ఛీత్కారంగా చూసేవేలాది చూపులు; ఇవేవీ యిష్టంలేదు నాకు. అందుకే ఆత్మహత్యకు ఒడిగట్టాను. శలవు."

దిగువ డాక్టర్ సదానందం సంతకం వుంది.

వుత్తరం మడుస్తూ సదానందం శవాన్ని జాలిగా చూశాడు షరీఫ్. ఇన్‌స్పెక్టర్ ఎంతకీ రాకపోయేసరికి గదిలో అడుగుపెట్టిన హెడ్ ఐరావతం, 103, 301 లు ఆ దృశ్యాన్ని చూసి నివ్వెరపోయారు—

చెట్టుకింద ప్రమాదం!



రాత్రి తొమ్మిది గంటలు దాటింది.

చలికాలమైనా మెరీనా బీచ్‌లో జనం సందడిగానే వున్నారు.

స్విమ్మింగ్ పూల్‌కి దూరంగా ఇసుకలో వెల్లకిలా పడుకున్నాడు విష్ణుమూర్తి.

సముద్రపు హోరు నిరంతరంగా, నిరాటంకంగా సాగుతూనే వుంది.

చలిగాలికి శరీరం మీది రోమాలు లేచి నిలుచుంటున్నాయి.

సముద్రంలో దూరంగా ఓడలలోంచి దీపాలు మిణుగురు పురుగుల్లా వెలుగుతున్నాయి.

జనసమ్మర్దానికి, గోలకు దూరంగా ఇసుకలో పడుకుని ఆకాశంలోని నక్షత్రాలను లెక్కపెట్టడం విష్ణుమూర్తికి హాబీగా పరిణమించింది ఆ హాబీ రెండేళ్ళక్రితం అతను కాలేజీ వదిలి, వుద్యోగాల వేటను ఆరంభించినప్పటినుంచీ అలవడింది.

ఆ వేటలో విజయం సాధించలేక, మనశ్శాంతికోసం రోజూ బీచ్‌కి రావడం అలవాటయింది అతనికి. సందడికి దూరంగా....ఎగపిపడే అలలను ఆసక్తిగా చూస్తూ.... సముద్రపు హోరులో తన హృదయపు ఘోషను లీనం చేస్తూ .... ఆకాశంలోని నక్షత్రాలను చూస్తూ .... తన 'నక్షత్రం' ఎప్పుడు ప్రకాశిస్తుందోనని యోచిస్తూ....ప్రొద్దుపోయేంతవరకు అచ్చట కాలం గడపడమూ, ఆ తరువాత గూటికి చేరుకోవడమూ అతని దినచర్యలో భాగమయింది.

ఆ రోజూ ఎప్పటిలాగే ఆకాశంలోకి చూస్తూ ఆలోచిస్తున్నాడు విష్ణుమూర్తి. అయితే ఆనాటి అతని ఆలోచనలలో జీవం వుంది. ఆశ వుంది.

కారణం—మర్నాడు ఓ ఇంటర్వ్యూకి వెళ్ళబోతున్నాడు అతను.

అది మామూలు వుద్యోగం కాదు. డిటెక్టివ్ వుద్యోగం!

ఆ మధ్య పేపర్లో 'డిటెక్టివ్‌లు కావాలి' అంటూ ఓ ప్రముఖ ప్రయివేట్ డిటెక్టివ్ ఏజెన్సీ ప్రకటించడంతో వెంటనే అప్లయ్ చేసేసాడతను. ఏ వుద్యోగమూ దొరకని వాడికి ఏదో ఒకటి అనిపించింది.

పైగా, ఆ మధ్య 'అపరాధ పరిశోధన'ను విడవకుండా చదువుతున్నప్పటినుంచీ పరిశోధనలన్నా, పత్తేదారులన్నా ఆసక్తి ఏర్పడింది అతనికి.

ఆ సంస్థనుంచి ఇంటర్వ్యూ రానేవచ్చింది. మర్నాడే ఇంటర్వ్యూ.

సాధారణంగా ఏ జాబ్కైనా దానికి సంబంధించిన ప్రశ్నలు అడుగుతారు. ఆ పోస్టుకు చెందిన ఏం అడుగుతారా అన్న ఆసక్తి. కుతూహలమూ కలిగాయి అతనిలో.

ఏం అడుగుతారోనన్న భయం కొంతా. 'అపన'లు నేర్పిన అనుభవంతో ఏమడిగినా చెప్పెయ్యగలనన్న ధీమా కొంతా కలిగాయి.

అదే విషయాన్ని గూర్చి ఆలోచిస్తూన్న విష్ణుమూర్తికి హఠాత్తుగా సమీపంలోంచి ఏవో మాటలు వినిపించడంతో ఆలోచనలకు అంతరాయం కలిగింది.

"బాస్ ఇచ్చిన అసైన్మెంట్ ఈ రాత్రికే పూర్తి చేయాలి!" అంటున్నాడు ఓ వ్యక్తి.

"ఎస్, నో డౌట్ అబౌటిట్ .... రేపు ఈ వేళకల్లా ఆ వార్తతో నగరం అట్టుడికిపోతుంది" అన్నాడు రెండవ వ్యక్తి.

ఆ వార్త ఏమయివుంటుందా అన్న ఆసక్తి కలిగింది విష్ణుమూర్తికి.

మాటలు వినవస్తున్నవైపు చూసాడు.

చుట్టూ చీకట్లు నిండుకోవడంతో ఆకారాలు కనిపించడం లేదు.

సమీపంలో రెండు నీడలు మాత్రం లీలగా గోచరిస్తున్నాయి.

"జాన్! ఇంటి ఆనవాళ్ళు గుర్తున్నాయి కదూ?"

ప్రశ్నించాడు మొదటి వ్యక్తి.

"వున్నాయి, పీటర్! త్యాగరాయనగర్ మనకు కొట్టిన పిండేగా! ఆ ఇంటిని కనుక్కోవడం కష్టంకాదు" జవాబిచ్చాడు జాన్.

"అఫ్‌కోర్స్... సరిగా పదిన్నరకు నైట్‌క్లబ్‌కి బయలు దేరుతుంది రీనా. సో, పదకొండు గంటలకు వెళ్ళావంటే ఇంటిలో ఎవరూ వుండరు. నీ పని సులువవుతుంది."

చిన్నగా వులిక్కిపడ్డాడు విష్ణుమూర్తి.

అంతవరకు అదేదో మామూలు సంభాషణ అనుకున్నాడు. వింటూంటే ఏదో గూడుపుఠాణీ జరుగబోతున్నట్లు అనిపించింది. వాళ్ళెవరో నేరం చేయబోతున్నట్లు అనుమానం కలిగింది.

తాను ఇసుకలో పడుకుని వున్నందున ఆ చీకటిలో వాళ్ళు తనను చూడలేదనీ, అందుకే అంత నిర్భీతిగా తమ ప్లాన్‌ని గూర్చి మాట్లాడుకుంటున్నారనీ గ్రహించాడు విష్ణుమూర్తి.

సముద్రపు హోరులో కొన్ని మాటలు కలిసిపోతున్నాయి.

చెవులు రిక్కించాడతను.

"వెళుతూ వెళుతూ రహీంను కూడా పికప్ చేసుకో. సాయం వుంటాడు" అన్నాడు పీటర్.

"ఈపాటికే నాటు సారా పూటుగా కొట్టి ఫ్లాట్‌గా పడిపోయుంటాడు. వెళ్ళి చూస్తాలే. నిషాలో లేకుండావుంటే తీసుకువెళతాను" న్నాడు జాన్. అయినా "ఈ జాబ్‌కి నేను ఒక్కణ్ణే చాలు."

"నీ సామర్ధ్యం ఎరిగివుండే ఈపని నీకు అప్పగించాడు బాస్. మరో మనిషి తోడువుంటే మంచిదని రహీంని

తీసుకువెళ్ళమంటున్నా నంతే" అన్నాడు పీటర్.

"అలాగే" అన్నాడు జాన్.

"పదకొండుకి ఇంకా రెండు గంటలుంది" అన్నాడు పీటర్.

"ఇక్కడినుంచి తిన్నగా హోటల్‌కి వెళ్ళి భోజనం చేస్తాను. ఆ తరువాత రహీం యింటికి వెళతాను. ఆ లోపునే వాడు గుర్రం ఎక్కకుండా వుంటే, కూడా తీసుకు వెళ్తాను. లేకుంటే ఒక్కణ్ణే కాసేపు ఎక్కడైనా తిరిగి టైమ్‌కి రీనా యింటికి చేరుకుంటాను" అన్నాడు జాన్.

"గుడ్. వెళదాంపద" అని పీటర్ అనడంతో అక్కడ నుంచి కదిలారు ఇద్దరూ.

చటుక్కున లేచి నిలుచున్నాడు విష్ణుమూర్తి.

వారి సంభాషణంతా ఆలకించడంతో వాళ్ళు తప్పకుండా ఏదో గూడుపుఠాణి జరుపబోతున్నట్లు అనిపించింది.

అనాలోచితంగానే వారిని వెంబడించసాగాడు.

స్విమ్మింగ్‌పూల్ ప్రక్కగా రోడ్డువైపు నడవసాగారు ఆగంతకులు.

కొంత దూరంలో వారిని వెంబడించాడు విష్ణుమూర్తి.

పేవ్‌మెంట్ మీదకు చేరుకున్నారు ఇద్దరూ.

వెలుతురులో వారిని పరీక్షగా చూసాడు విష్ణుమూర్తి.

ఇద్దరూ ఆజానుబాహువులు. సూటూ, బూటూ, హ్యాటూ వున్నాయి.

హిందీ సినిమాలలోని స్మగ్లర్స్‌లా వున్నారు.

పేవ్‌మెంట్ ప్రక్కనున్న వైట్ బ్లూ స్టాండర్డ్ కారును సమీపించారు వాళ్ళు.

"ఓకే, జాన్! విష్ యూ ఆల్ ద బెస్ట్!" అంటూ చేయి అందించాడు ఇద్దరిలో ఒకడు.

దాంతో ఎవరు, ఎవరో తెలిసిపోయింది విష్ణుమూర్తికి. పీటర్‌కంటె జాన్ సన్నగా పీలగా వుంటాడు

జాన్ కారులో కూర్చున్నాడు.

పీటర్ బయట నిలుచునే మాట్లాడుతున్నాడు.

కంగారు పట్టుకుంది విష్ణుమూర్తికి.

కారులో వెళ్ళే జాన్‌ని తాను వెంబడించడం ఎలా?

వెంబడించకపోతే జరుగనున్న అఘాయిత్యాన్ని తెలుసు కునే దెలా? ఆపేదెలా?

అటువంటి సందర్భాలలో డిటెక్టివ్‌లయితే సొంత కారు లోనో, టాక్సీలోనో వెంబడిస్తారు.

మరి తానో—?

టాక్సీ వున్నా చేతిలో పైసలు కరువు!

జాన్ కారు స్టార్టుచేయడంతో విష్ణుమూర్తి హడావుడిగా రోడ్డుమీదకు పరుగెత్తాడు. ఆ కారుముందు అడ్డు నిలుచోవ డానికి కాదు!

అప్పటికప్పుడే ఓ నిర్ణయానికి వచ్చేసాడతను.

జాన్ కారు కదిలింది

సమీపంలో వున్న ఓ టాక్సీలో జొరబడ్డాడు విష్ణు మూర్తి.

"డ్రయివర్! ముందు వెళుతూన్న బ్లూ స్టాండర్డ్‌ని వెంబడించు. అనుమానం కలగకూడదు" అన్నాడు హడా వుడిగా.

ఆతనివంక అదోలా చూసాడు టాక్సీ డ్రయివర్. ఏదో అనబోయి మానుకుని మీటర్ త్రిప్పి, టాక్సీని స్టార్ట్ చేసాడు.

మరి కాసేపటిలో జాన్ స్టాండర్డ్ కారు. ఆ వెనుకే విష్ణుమూర్తి ఎక్కిన టాక్సీ పారిస్‌వైపు సాగిపోయాయి.

2

బర్మాబజారు దాటి ఓ హోటల్ ముందు ఆగింది స్టాండర్డు.

దానికి కొంత దూరంలో టాక్సీ ఆపాడు విష్ణుమూర్తి.

"ఇక్కడే వుండు. కాసేపట్లో తిరిగి వస్తాను" అన్నాడు. జాన్ కారులోంచి దిగడమూ, హోటల్లోకి నడవడమూ చూస్తూ.

"నేను వెళ్ళిపోవాలి, డబ్బులిచ్చెయ్" అన్నాడు టాక్సీవాలా.

"అలాగంటే యెలా? ఇది పోలీస్ కేస్. చివరివరకు నాతో వుండక తప్పదు నువ్వు" అన్నాడు విష్ణుమూర్తి ధీమాగా.

"అందుకే నన్ను వదిలెయ్యమంటున్నాను. ఇటువంటి వ్యవహారాలలో తగులుకోవడం నా కిష్టంలేదు" అన్నాడు టాక్సీవాలా.

"అదేం కుదరదు. నేను ప్లెయిన్ క్లోత్స్ పి.ఐ.డి.ని ఓ నాటోరియస్ క్రిమినల్‌ని వెంబడిస్తున్నాను. ఈ సందర్భంలో నాతో సహకరించావంటే ఆనక నీకు రివార్డు దొరుకుతుంది. లేదంటావో, చిక్కుల్లో పడతావ్. పోలీసులతో సహకరించని నేరానికి నీ లైసెన్స్ కాన్సిల్ చేయిస్తాను" అని బెదిరిస్తూ టాక్సీ నంబర్‌ని నోట్ చేసుకున్నాడు విష్ణుమూర్తి.

దాంతో టాక్సీవాలా బెదిరాడు.

"ఈ సంగతి ముందే తెలిస్తే నిన్నసలు టాక్సీలో ఎక్కించుకునే వాణ్నేకాదు" అని గొణుక్కుంటూనే ఇంజన్ ఆఫ్‌చేసాడు.

లోలోపలే నవ్వుకుంటూ హోటల్‌వైపు నడిచాడు విష్ణు

మూర్తి.

హోటల్ పాతదయినా, పెద్దదే. హాల్లో జనం నిండుగానే వున్నారు.

ఓ మూలగా వున్న టేబిల్ ముందు కూర్చుని వెయిటర్ తెచ్చే భోజనం కోసం ఎదురుచూస్తున్నాడు జాన్.

అదిచూసి బయటకు వచ్చేసాడు విష్ణుమూర్తి.

జాన్ భోజనం ముగించడానికి అరగంటైనా పడుతుంది.

తనకూ ఆకలిగా వుంది. కాని, జేబుల్లో డబ్బుల్లేవు. కేవలం రెండున్నరే వున్నది. అది ఏ మూలకూ సరిపోదు.

బస్ చార్జికి మిగుల్చుకుని, మిగతా దానితో టీ త్రాగుదామనుకున్నాడు.

ఆ హోటల్‌కి ఎదురుగా వున్న పేవ్‌మెంట్ మీద ఇరానీ స్టాల్ వుంది.

అటువైపు నడిచాడు అతను.

అక్కడినుంచి హోటల్ స్పష్టంగా కనిపిస్తోంది. కనుక జాన్ బయటకు వచ్చినట్టయితే తన దృష్టిలోంచి తప్పించుకోలేడు.

ఇరానీ స్టాల్‌లో ఓ బన్ను తిని. టీ త్రాగాడు విష్ణుమూర్తి. అతని చూపులు ఆ హోటల్ మీదే వున్నాయి.

అరగంట దాటినా జాన్ బయటకు రాలేదు.

ఓపికగా అతనికోసం ఎదురు చూస్తూనే వున్నాడు విష్ణుమూర్తి.

అతని బుర్రలో ఆలోచనలు కుమ్మరపురుగులా దొలిచేస్తున్నాయి.

జాన్ త్యాగరాయనగర్‌లో ఏం చేయబోతున్నాడు? రీనా ఇంటిని దోచుకోబోతున్నాడా?

రీనా యెవరు? నైట్‌క్లబ్‌కి యెందుకు వెళుతుంది?

ఎంజాయ్ చేయడానికా? లేక, అక్కడ పనిచేస్తోందా? ఏ క్లబ్‌కి వెళుతుంది?

జాన్‌ని చివరికంటా వెంబడించడం తనకు సాధ్యమవుతుందా? ఒకవేళ తాను అతని కంటపడితే ఏమవుతుంది? ప్రమాదం జరుగుతుందా?

పోలీస్‌కి ఫోన్‌చేసి విషయం చెబితే ఏమవుతుంది? రీనా ఎవరో తెలుసుకోగలుగుతారా? జాన్‌ని పట్టుకోగలుగుతారా? రీనా ఎవరో తెలుసుకునేసరికే అఘాయిత్యం జరిగిపోతేనో?

విష్ణుమూర్తి ఆలోచనలు పరి పరి విధాలుగా పోతున్నాయి.

అంతలోనే హఠాత్తుగా గుర్తుకొచ్చిందతనికి—ప్రయివేట్ డిటెక్టివ్‌గా సెలెక్ట్ అయితే అలాంటి కేసులు ఎన్నో తగలవచ్చునని కనుక అనుకోకుండా వచ్చిన ఆ అవకాశాన్ని వుపయోగించుకోవాలనుకున్నాడు. సక్సెస్ అయినట్లయితే యింటర్‌వ్యూలో ఆ అనుభవాన్ని కోట్ చేయవచ్చు ననిపించింది.

మరి కొంతసేపటికి హోటల్లోంచి బయటకు వస్తోన్న జాన్ కనిపించాడు. విష్ణుమూర్తి హడావుడిగా రోడ్ క్రాస్ చేసి టాక్సీ దగ్గరకు వెళ్ళాడు.

మరో నిముషంలో జాన్ స్టాండర్డ్ కారు, ఆ వెనుకే విష్ణుమూర్తి ఎక్కిన టాక్సీ వాషర్‌మాన్‌పేట వైపు దూసుకుపోయాయి.

3

కొంతసేపటికి వాషర్‌మాన్‌పేటలో పోలీస్ స్టేషన్ వెనుకనున్న వీధిలో ఓ చీకటి ప్రదేశంలో ఆగింది స్టాండర్డ్‌కారు.

దానికి కొంత దూరంలో వీధి మలుపులో టాక్సీని

ఆపించాడు విష్ణుమూర్తి.

జాన్ కారు దిగి, కాలి నడకను సాగడం గమనించాడు విష్ణుమూర్తి.

టాక్సీవాలాను, "ఆ వీధిలోకి కనిపించకుండా యిక్కడే చీకట్లో పార్క్ చెయ్యి. నేనతని వెనకే వెళతాను. నువ్వు సీట్లోంచి కదలకు" అని హెచ్చరించి, క్రీనీడలలో నడుస్తూ గబగబా జాన్ వెళ్ళిన వైపు నడిచాడు.

కొన్ని గజాలదూరం వెళ్ళేసరికి మరో వీధిలోకి తిరుగుతూన్న జాన్ కనిపించాడు విష్ణుమూర్తికి.

ఆ వీధిలో ఓ చిన్న పెంకుటింటిలో ప్రవేశించాడు జాన్.

ఆ యింటికి కొద్దిదూరంలో చీకట్లో నిలుచుని కనిపెట్ట సాగాడు విష్ణుమూర్తి.

పది నిముషాల తరువాత ఆ యింట్లోంచి వొంటరిగా బయటకు వస్తూన్న జాన్ని చూడగానే, నిలుచున్న చోటు నుంచి కదిలి చకచకా కారువైపు నడిచాడు విష్ణుమూర్తి.

జాన్ అనుమానించినట్లు రహీం తప్పత్రాగి నిద్రపోయి వుంటాడని గ్రహించాడు. అదీ మంచిదే అయిందనిపించింది.

ఒక్క మనిషినయితే హ్యాండిల్ చేయడం కష్టం కాకపోవచ్చు ననుకున్నాడు.

స్టాండర్డ్ దగ్గరకు చేరుకున్న విష్ణుమూర్తికి హఠాత్తుగా ఓ ఆలోచన తట్టింది. ఏమాత్రం సందేహించకుండా దానిని అమలులో పెట్టేస్తాడు.

స్టాండర్డ్ కారు డిక్కీని చప్పుడు కాకుండా తెరిచి అందులో కూర్చున్నాడు. డిక్కీ మూసేసి గాలి తగలడానికి కొద్దిగా సందు వుండేలా పట్టుకున్నాడు.

అందువల్ల రెండు ప్రయోజనాలు కనిపించాయి అతనికి.

మొదటిది—జాన్‌కి అనుమానం తగలకుండా సురక్షితంగా అతన్ని వెంబడించవచ్చును.

రెండవది—టాక్సీకి పేచేయడానికి తన దగ్గర డబ్బులు లేవు కనుక, సులభంగా టోకరా యిచ్చి తప్పించుకున్నట్టవుతుంది.

జాన్ కారులో కూర్చుని డోర్ మూయడం ఆ చప్పుడుకు ఆలోచనల్లోంచి తేరుకున్నాడు విష్ణుమూర్తి.

స్టాండర్డ్ చిన్న కుదుపుతో ముందుకు వురకడంతో, "సారీ, ఫ్రెండ్!" అనుకున్నాడు విష్ణుమూర్తి టాక్సీవాలానుద్దేశించి.

అతగాడు తన రాకకోసం ఎదురుచూస్తూ అక్కడే కూర్చుంటాడని తెలుసు.

స్టాండర్డ్ వెనక్కి తిరక్కుండా ముందుకుదూసుకుపోయి, రెండు వీధులవతల మలుపుతిరిగి మెయిన్ రోడ్ చేరుకుంది.

4

స్టాండర్డ్ సందు గొందులమ్మట ప్రయాణిస్తూ ఎక్కడెక్కడో తిరిగి త్యాగరాయనగర్‌లో ఒకచోట ఆగేసరికి పది నిముషాలు తక్కువగా పదకొండు అయింది.

చీకటిగావున్న ఓ ఇరుకు సందులో కారాపి క్రిందకు దిగాడు జాన్. ఓసారి చుట్టుప్రక్కలా చూసాడు. తరువాత చీకట్లో నడుస్తూ ముందుకు సాగాడు.

ఓ రెండు నిముషాలు ఆగి మెల్లగా డిక్కీలోంచి బయటకు వచ్చాడు విష్ణుమూర్తి.

ఆ చీకట్లోనే చుట్టూ పరికించాడు. అది త్యాగరాయ నగర్‌లో విజయరాఘవాచారి రోడ్ అన్న విషయం

గ్రహించడానికి కొంత సమయం పట్టింది అతనికి.
జాన్ కనిపించకపోయేసరికి కంగారుగా సందు చివరకు పరుగెత్తాడు.
కొద్ది దూరంలో వడివడిగా అడుగులు వేస్తూన్న జాన్ కనిపించడంతో తేలికగా వూపిరి పీల్చుకున్నాడు. క్రీనీడలలో నడుస్తూ అతన్ని వెంబడించాడు.
ప్రక్కవీధిలో ప్రవేశించాడు జాన్.
రెండిళ్ళ అవతలవున్న ఓ చిన్న బంగళాముందు ఆగాడు.
చీకట్లో మునిగివున్న ఆ బంగళా వెనుక ప్రహారీని దాటి లోపల ప్రవేశించాడు.
కొన్ని నిముషాల తేడాలో విష్ణుమూర్తి కూడా అదే పని చేసాడు.
ఈసారి అతని అనుమానం ధ్రువపడింది. ఏదో పెద్ద నేరమే జరుగబోతున్నట్లు రూఢి చేసుకున్నాడు.
జాన్ ఇంటి ముఖద్వారాన్ని సమీపించాడు.
జేబులోంచి పెన్ టార్చ్‌తీసి తలుపుమీద ఫోకస్‌చేసాడు.
ఓ తాళపు చెవిని తలుపు రంధ్రంలో దూర్చి త్రిప్పాడు.
తలుపు తెరుచుకోగానే లోపల ప్రవేశించాడు.
ఓ అయిదు నిముషాల పిదప తలుపు త్రోసి చూసిన విష్ణుమూర్తికి ఆనందం కలిగింది.
జాన్ తలుపును దగ్గరగా మూసి వుంచాడంతే!
దానిని చప్పుడు కాకుండా తెరుచుకుని లోపల ప్రవేశించాడు విష్ణుమూర్తి.
హాల్లో చీకటిగావుంది. కాని, లోపలిగదుల్లో ఒక దాన్లోంచి సన్నగా వెలుతురు కనిపిస్తోంది.
పిల్లిలా అడుగులు వేసుకుంటూ అటువైపు నడిచాడు విష్ణుమూర్తి.

ఆ గది గుమ్మంలో నిలుచుని లోపలికి తొంగిచూసాడు.

అది పడగ్గదిలావుంది.

ఆ గదిలో—

ఓ ఇనప్పెట్టె వుంది

మారు తాళాలతో కాబోలు దానిని తెరవడానికి ప్రయత్నిస్తున్నాడు జాన్.

గది తలుపులు మూసి గెడ పెడదామనుకున్నాడు విష్ణుమూర్తి, కాని, చప్పుడవుతుందని ఆగిపోయాడు.

ఇంట్లో టెలిఫోన్ వుండొచ్చును. కాని, పోలీసులకు డయల్‌చేస్తే ఆ చప్పుడుకు అతను అలర్ట్ అయిపోతాడు. పోనీ, బయటకువెళ్ళి ఫోన్ చేద్దామంటే, ఫోన్‌కోసం వెదికేసరికి ఆలస్యమయిపోవచ్చును....అందువల్ల ఆ పరిస్థితిని వొంటరిగా తానే ఎదుర్కోవడానికి సిద్ధపడ్డాడు.

జాన్ ఇనప్పెట్టె తెరచిన చప్పుడయింది.

అటువైపు చూసిన విష్ణుమూర్తి ఓ క్షణం వూపిరి బిగబట్టాడు.

ఓ అరనిండా కరెన్సీ నోట్లు కట్టలు కట్టలుగావున్నాయి. జన్మలో అంతసొమ్ము ఎప్పుడూ చూళ్ళేదతను.

అదంతా వైటో, బ్లాకో తెలియదు.

జాన్ మాత్రం నోట్లకట్టలను హడావుడిగా తనసంచిలో పడేసుకుంటున్నాడు.

అంతలోనే విష్ణుమూర్తి దృష్టి గది మూలనున్న గుండ్రటి ఓ స్టూల్‌మీద పడింది.

దానిమీద పళ్లు కోసుకునే చాకువుంది.

అతనికళ్ళు మెరిసాయి.

చప్పుడు చేయకుండా అటువైపు నడిచి చాకును అందుకున్నాడు.

స్విచ్ బోర్డ్ వైపువెళ్ళి లైటు వెలిగించాడు.

హఠాత్తుగా గదంతా ప్రకాశవంతం కావడంతో త్రుళ్ళి పడ్డాడు జాన్.

కంగారుగా వెనక్కి తిరిగాడు.

చేతిలో కత్తితో గుమ్మానికి అడ్డంగా నిలుచున్న విష్ణుమూర్తి కనిపించాడు.

"ఎవరు నువ్వు?" అన్నాడు కోపంగా చూస్తూ.

"అదే ప్రశ్న నేనూ వేస్తున్నాను....నువ్విక్కడ చేస్తూన్న వెధవపనికి నీ సంజాయిషీ ఏమిటి?" గద్దించాడు విష్ణుమూర్తి, తెచ్చిపెట్టుకున్న గాంభీర్యంతో.

"నీ కనవసరం. మర్యాదగా నోర్మూసుకుని బయటకు వెళ్ళిపో!" అన్నాడు జాన్ బెదిరిస్తూ.

"అలాగే—నిన్ను పోలీసులకు అప్పగించాక!"అన్నాడు విష్ణుమూర్తి.

ఓ క్షణం అతనివంక తీక్షణంగా చూసాడు జాన్. విష్ణుమూర్తి తనకంటె బలంగాకనిపిస్తున్నాడు. పైగా అతని చేతిలోని కత్తీ ముఖంలోని తీక్ష్ణతా కొంత బెదిరించాయి.

చటుక్కున ఏదో స్ఫురించినవాడిలా,

"మిస్టర్! నువ్వెవరో తెలియదు. కాని, నువ్వూ నాలాగే దొంగతనంకోసం ఈ ఇంట్లో ప్రవేశించి వుంటావని తెలుస్తోంది....అంటే మనిద్దరమూ ఒకే తరగతికి చెందినవాళ్ళమన్నమాట! కనుక ఇద్దరమూ ఒక వొప్పందానికి వద్దాం....ఈ సొమ్ములో నీకు వాటా యిస్తాను. నువ్విక్కడ ఏమీ చూళ్ళేదనుకుని గప్‌చిప్‌గా ఇక్కడి నుంచి వెళ్ళిపో.... ఏమంటావ్?" అన్నాడు జాన్.

"షటప్! నేను నీలా దొంగనుకాను. నీ ఈవిల్ డిజైన్స్ తెలుసుకుని నీ భరతం పట్టడానికి వచ్చినవాణ్ణి.

నిన్ను పోలీసులకు అప్పగించిగాని వెళ్ళను" అన్నాడు విష్ణు మూర్తి కోపంగా.

జాన్ అదోలా నవ్వాడు.

"నువ్విక్కడ ఎందుకున్నావంటే పోలీసులకు ఏం చెబుతావ్?" అని అడిగాడు.

"నిజం చెబుతాను."

"నీ కింకా పోలీసులతో అనుభవం లేనట్లుంది. నిజం చెప్పి పోలీసుల్ని నమ్మించేవాడు ఈ దేశంలో యింకా పుట్టలేదు. నాతోపాటు నిన్నూ ఈ కేసులో యిరికిస్తారు. నీ మూలంగా నేను జైలుకి వెళ్ళినట్లు తెలియగానే మా ముఠా బాస్ నిన్ను చంపిస్తాడు" అంటూ బెదిరించాడు జాన్.

"ఓ మంచిపనికి ప్రాణాలు అర్పించడంలో తప్పులేదు.... నిన్ను మాత్రం వదలను" అన్నాడు విష్ణుమూర్తి దృఢంగా. "నువ్వు తప్పించుకోవడానికి ప్రయత్నించావో, ఈ కత్తి నీ కడుపులో దిగబడుతుంది. అసలే కత్తి విసరడం నాకు వెన్నతో పెట్టిన విద్య!"

విష్ణుమూర్తి దబాయింపు జాన్‌మీద పనిచేసినట్లుంది. నిస్సహాయంగా చూసాడు అతనివంక.

"అయితే నన్నిప్పుడేం చేయమంటావ్?" అన్నాడు.

"ఆ సంచి అక్కడ పెట్టు. వెనక్కి తిరిగి చేతులు వెనక్కి పెట్టుకో" ఆదేశించాడు విష్ణుమూర్తి.

జాన్ బుద్ధిగా చెప్పినట్లు చేసాడు.

విష్ణుమూర్తి మెల్లగా కదిలాడు.

"ఏమాత్రం కదిలినా కత్తి నీ వెన్నులో దిగుతుంది, జాగ్రత్త!" అంటూ హెచ్చరించాడు.

గదిలో స్టాండుమీదున్న ఓ చీరెను తీసుకుని దానిని త్రాటిలా మెలితిప్పాడు. తరువాత జాన్ వెనుకకు వెళ్ళి,

కత్తిపిడిని నోట్లో పెట్టుకుని, మొనను జాన్ మెడకు గ్రుచ్చుకునేలా ఆనించాడు. చీరెతో అతని రెండు చేతులూ కలిపి వెనుకకు విరిచి కట్టేసాడు.

ఆ తరువాత గుమ్మం దగ్గరకు వెళ్ళి జాన్‌వంక చూసాడు. అతనిప్పుడు పారిపోలేడు.

తన సాహసానికి తనకే ఆశ్చర్యం వేసింది విష్ణు మూర్తికి.

గది తలుపు మూసి బయట గెడపెట్టాడు.

హాల్లో లైట్ వెలిగించాడు.

ట్యూబ్‌లైట్ కాంతిలో హాలంతా తెల్లగా అయి పోయింది.

ఓ మూలనున్న టెలిఫోన్ కనిపించింది. వెళ్ళి పోలీస్ కంట్రోల్ రూమ్‌ని కాంటాక్టు చేసే నిమిత్తం ఒన్ హండ్రెడ్‌ని డయల్ చేసాడు. ఫోన్ పనిచేయలేదు.

సాలోచనగా బయటకు నడిచాడు.

రోడ్డుమీది కొచ్చి ఓ క్షణం అనిశ్చయంగా అటూ ఇటూ చూసాడు.

అంతలో ఓ బీట్ కానిస్టేబిల్ అటువైపు వచ్చాడు.

"ఎవరబ్బా నువ్వు? ఇంత రాత్రప్పుడు ఇక్కడెందుకున్నావ్?" అంటూ విష్ణుమూర్తివంక అనుమానంగా చూస్తూ నిలదీసాడు అరవంలో.

టూకీగా అసలు విషయం చెప్పాడు విష్ణుమూర్తి.

కానిస్టేబుల్ నమ్మలేనట్లుగా చూస్తూనే విష్ణుమూర్తిని అనుసరించాడు బంగళాలోకి.

గదిలో కట్టిపడేసి వున్న జాన్‌నీ, తెరిచివున్న ఇనప్పెట్టెనూ, నోట్ల కట్టలతో పడివున్న సంచినీ చూడడంతో ఆశ్చర్యంగా విష్ణుమూర్తివంక చూసాడు కానిస్టేబిల్.

విష్ణుమూర్తి సాహసానికి, నిజాయితీకి మెచ్చుకున్నాడు. అతని పేరు, అడ్రసు నోట్ చేసుకున్నాడు.

"వీడి పని నేను చూసుకుంటాను. ఇక నువ్వు ఇంటికి వెళ్ళిపో. రేపు టి-నగర్ పోలీస్‌స్టేషన్‌కి వచ్చి స్టేట్‌మెంట్ యియ్యి. మా డిపార్ట్‌మెంట్ నీకు రివార్డ్ కూడా ఇస్తుంది" అన్నాడు.

సంతోషంతో బయటకు నడిచాడు విష్ణుమూర్తి, రాత్రి నుంచీ అనుకోకుండా వేగంగా సాగిపోయిన ఆ సంఘటనలను ఆశ్చర్యంతో నెమరువేసుకుంటూ యింటిముఖం పట్టాడు—పిటీ నైట్ సర్వీస్ బస్‌ని వెదుక్కుంటూ.

5

మర్నాడు—

ఇంటర్వ్యూ వుండడం వల్ల పోలీస్ స్టేషన్‌కి వెళ్ళడానికి వీలుపడలేదు విష్ణుమూర్తికి. ఇంటర్వ్యూ నుంచి తిరిగి వచ్చేప్పుడు వెళ్ళొచ్చుననుకున్నాడు.

ఉదయం పది గంటలకు—

మౌంట్‌రోడ్‌లో వున్న ప్రయివేట్ డిటెక్టివ్ ఏజన్సీలో అడుగుపెట్టాడు విష్ణుమూర్తి. దక్షిణ భారతంలో మంచి పేరున్న సంస్థ అది.

ఇంటర్వ్యూ అనేసరికి సహజంగా ఏర్పడే భీతి, దడా సన్నగా ఆరంభమయ్యాయి.

కమిటీ రూమ్‌లో అడుగుపెట్టిన విష్ణుమూర్తి—సెలక్షన్ కమిటీలో వున్న వ్యక్తుల్ని చూడగానే షాక్ తిన్నాడు.

మొత్తం ముగ్గురు వున్నారు కమిటీలో.

చిరునవ్వుతో అతనికి ఆసనం చూపారు వాళ్ళు.

నోట మాటలేకుండా శిలాప్రతిమలా నిలుచుండిపోయిన విష్ణుమూర్తి నుద్దేశించి. "సిడౌన్, మై బాయ్!" అన్నాడు

ఒకతను చిరునవ్వుతో.

"ఇతను....వీళ్ళు....!?" అంటూ తెల్లబోయిన విష్ణుమూర్తితో—

"టేకిట్ ఈజీ!" అన్నాడు అతను. "ఇతను రాత్రి నీకు జాన్‌గా పరిచయమైన వ్యక్తి. అతను రాత్రి నువ్వు చూపిన కానిస్టేబిల్....ఔనా?"

ఔనన్నట్లు తలూపాడు విష్ణుమూర్తి.

"నిన్నింకా సస్పెన్స్‌లో పెట్టడం నా కిష్టంలేదు. అసలు విషయం విందువుగాని, కూర్చో" అని ఆ వ్యక్తి అనడంతో, మరబొమ్మలా నిలుచున్న చోటునుంచి కదిలి వెళ్ళి వారి కెదురుగావున్న కుర్చీలో కూర్చున్నాడు విష్ణుమూర్తి.

ఆ వ్యక్తి మందహాసంతో ఇలా చెప్పుకుపోయాడు—

"మిస్టర్ విష్ణుమూర్తీ! మాది పేరు ప్రఖ్యాతులు పొందిన సంస్థ. అందులో పనిచేసే డిటెక్టివ్స్‌కి సాహసమూ, తెగువ, గుండెధైర్యం, సమయస్ఫూర్తి, తెలివితేటలూ, చురుకుదనమూ, అన్నిటికీ మించి నిజాయితీ ఎంతో అవసరం. అందుకే మా సంస్థ ఆపరేటర్స్‌ని అపాయింట్ చేసేముందు కొన్ని విచిత్ర పద్ధతుల్ని అవలంబిస్తుంది. కాండిడేట్స్‌ను ఇంటర్‌వ్యూ చేసేముందు వారికి తెలియకుండానే కొన్ని పరీక్షలను పెడుతుంది....నిన్నరాత్రి నీకు ఎదురైన సంఘటన అటువంటిదే. మేము నీకు పెట్టిన పరీక్ష అన్నమాట!"

విష్ణుమూర్తి ఆశ్చర్యంతో నోరు తెరిచాడు.

"నీ అప్లికేషన్ రాగానే నీ జీవిత విధానాన్ని ఓ వారం పాటు పరిశీలించి నీగురించి అంతా తెలుసుకున్నాము మొదట. ఆ తరువాతే నీకు ఇంటర్‌వ్యూ కాల్ పంపబడింది. అటు పిమ్మట నీ తెలివితేటలకు, నిజాయితీ వగైరాలకు పరీక్ష

పెట్టాము. నువ్వు వినేలా జాన్ పేరుతో ఇతను, పీటర్ పేరుతో మరొకతను ఓ ఫేక్ దోపిడీని గూర్చి చర్చించారు. నువ్వు అలర్ట్‌గా వుండడమే కాక, నాకెందుకు వచ్చిన గొడవలే అని వూరుకోకుండా జాన్ వెంట పడ్డావు. అతనికి తెలియకుండా సమర్ధనీయంగా వెంబడించగలిగావు...." చెప్పుకుపోయాడు అతను—

"రెడ్‌హ్యాండెడ్‌గా దొరికిన జాన్ నీకు డబ్బు ఆశ చూపాడు. ప్రాణభీతి కల్పించాడు. మరొకరైతే వాటిలో ఒకదానికైనా లొంగిపోయేవారే. కాని, నువ్వు రెండింటికీ లొంగకుండా నీ నిజాయితీని నిరూపించుకున్నావు. తరువాత బీట్ కానిస్టేబుల్ వేషంలో జాన్ చార్జ్‌ని తీసుకున్న ఇతని పేరు సుందర్రావ్. ఆ బంగళా యితనిదే....అదంతా ఫ్రేమప్ అని యెరుగని నువ్వు నీ తెలివితేటలను, ధైర్య సాహసాలను, నిజాయితీని నిరూపించుకున్నావు....మా పరీక్షల్లో నెగ్గావు."

తన చెవులను తనే నమ్మలేకపోతున్నాడు విష్ణుమూర్తి.

"మా సంస్థలో నీకు డిటెక్టివ్‌గా వుద్యోగమిస్తున్నాము. నీ జీతం నెలకు వెయ్యి రూపాయలు....విష్ యు ఆల్ ద బెస్ట్!" అంటూ చేయి చాచాడు ఆ వ్యక్తి.

"థాంక్‌యూ, సార్! థాంక్యూ...." అంటూ పట్టరాని ఆనందంతో షేక్‌హ్యాండ్ యిచ్చాడు విష్ణుమూర్తి.

మిగతా ఇద్దరూ కూడా అతన్ని అభినందిస్తూ అతనితో కరచాలనం చేసారు.

మరో గంట తరువాత—

అప్పాయింట్‌మెంట్ ఆర్డర్, అక్రెడిషన్ కార్డు, ఓనెల జీతం అడ్వాన్సులతో ఆ సంస్థనుంచి బయటకు వచ్చాడు ప్రయివేట్ డిటెక్టివ్‌గా రూపొందిన విష్ణుమూర్తి. ☐

దొంగల రాణి

తిరుమలశ్రీ

నెలరేడు తారకలతో కొలువుదీరి యున్న కారణంగా జగ
మంతా వెన్నెలతో తెల్లగా మెరిసిపోతోంది.

రాత్రి ఎనిమిది గంటలే అయినా జనసంచారం తక్కువగా వున్న ప్రాంతమది.

ఆ సమయంలో—

నల్లత్రాచులా వున్న తారురోడ్డు పైన జారుకుంటూ వచ్చింది ఓ అంబాసడర్ కారు.

ఎక్కడినుంచో ఓ యువతి అడ్డుగా వచ్చి చేయి వూపింది.

కారు ఆగిపోయింది.

లోపల ఓ ప్రముఖ వ్యాపారస్తుడు పురుషోత్తం వున్నాడు. స్వయంగా డ్రయివ్ చేస్తున్నాడతను.

ఆ యువతివంక పరిశీలనగా చూశాడు పురుషోత్తం.

ఇంచుమించు పాతికేళ్ళుంటాయి ఆమెకు. సన్నగా, పొడవుగా వుంది. తెల్లగా, అందంగా వుంది. మాడర్న్‌గా అలంకరించుకున్న ఆమె అందం వెన్నెల్లో ద్విగుణీకృతమయినట్లుంది.

పురుషోత్తానికి నలభై ఏళ్ళుంటాయి. ఎందరో స్త్రీలతో సంబంధం వున్నదతనికి. అప్పుడప్పుడు అమ్మాయిలు—ఎక్కువగా వర్కింగ్ గర్ల్స్—కారాపి సిటీలోకి లిఫ్ట్ అడగడం పరిపాటే. అందుకే ఆమె చేయి వూపగానే కారు ఆపాడు.

ఆ యువతి సౌందర్యం చూసేసరికి గుండెల్లో ఎక్కడో గుబులు రేగింది అతనికి.

"అరగంట నుంచి ఎదురుచూసినా ఓ ఆటో కూడా రాలేదు యిటువైపు. ఇఫ్ యూ డోంట్ మైండ్, ఎగ్మూర్ స్టేషన్ వరకూ లిఫ్ట్ యివ్వరూ? ప్లీజ్!" అందామె తీయని స్వరంతో.

"విత్ ప్లెజర్!" చిరునవ్వుతో అని తన ప్రక్కడోర్

తెరిచాడు పురుషోత్తం.

"థాంక్యూ" అంటూ అతనిప్రక్క కూర్చుందామె.

ఆమె రాసుకున్న 'కునేగా' సెంటు పరిమళం అతనికి మత్తెక్కించింది.

ఆమె పెదాలకు పూసుకున్న రోజ్ కలర్ లిప్‌స్టిక్ ఆమె న్యాచురల్ కలర్‌తో కలిసిపోయింది.

చిరునవ్వుతో ఆమె పెదవులు అందంగా విచ్చుకుంటే ఆశగా వాటివంక చూసాడు పురుషోత్తం కారుని ముందుకు పోనిస్తూ.

అక్కడికి ఓ కిలోమీటర్ దూరంలో వుంది ఎగ్మూర్ రైల్వేస్టేషన్. ఆమె ఎక్కినంతసేపు పట్టదు కారు దిగి పోవడం. ఆమె అందానికి ముగ్ధుడయిన పురుషోత్తానికి ఆమెతో కాసేపు గడపాలనిపించింది.

అక్కడినుంచి మరో చుట్టుదారి వుంది ఎగ్మూర్ స్టేషన్‌కి. పనివుంటే తప్ప ఆ దారిన వెళ్ళరెవరూ.

"అటువైపు నాకు కొంచెం పనివుంది. ఆ దారమ్మట వెళదామా?" అని అడిగాడు ఆమెను.

చిరునవ్వుతో తలవూపిందామె.

కారును నెమ్మదిగా పోనిస్తూ మెల్లగా ఆమెను కబుర్ల లోకి దింపాడు పురుషోత్తం. ఆమె అక్కడవున్న ఏదో కంపెనీలో పనిచేస్తున్నట్టు తెలుసుకున్నాడు. ఆమెతో చనువు పెంచుకోవడానికి ప్రయత్నించాడు. ముందుగా ఆమె అందాన్ని పొగిడాడు. తరువాత ఏవేవో మాట్లాడాడు. కారు సగం దూరమైనా వెళ్ళకుండానే ఆమె నడుంచుట్టూ చేయి వేసాడు.

సిగ్గుతో ముడుచుకుపోయిం దామె.

ఆమెనుంచి అభ్యంతరం కనిపించకపోవడంతో లోలో

పలే నవ్వుతున్నా డతను. అటువంటి యువతుల నెందరినో చూసి వున్నాడు తాను. అవసరార్థం ప్రయివేట్ కంపెనీ లలో చిన్న చిన్న వుద్యోగాలకు సిద్ధమవుతారు కొందరు అమ్మాయిలు. వాళ్ళిచ్చే నాలుగైదు వందలు వారి షోకులకే సరిపోక, మధ్య మధ్య తనలా కక్కుర్తిపడే మగవారికి ఆనందాన్ని కలిగించి కాస్తో కూస్తో అదనపు సొమ్మును సంపాదిస్తూ వుంటారు.

దేనికోసమోనన్నట్లు జేబులో చేయిపెట్టి పర్సు బయటకు తీసాడతను. దాని నిండావున్న నూర్రూపాయల నోట్లు కొన్ని సెకనులపాటు ఆమెకు కనిపించేలా పట్టుకున్నాడు. నోట్లను చూడగానే ఆమె కన్నుల్లో తళుక్కుమన్న మెరుపును గమనించాడు. పర్సు జేబులో పెట్టేసుకున్నాడు.

సమీపంలో మనుషులుగాని, వాహనాలుగాని రావడం లేదు. చటుక్కున ఆమె పెదాలు అందుకోబోయాడు.

"ప్లీజ్!" అంటూ చేతులు అడ్డుపెట్టుకుం దామె. "డ్రైవ్ చేస్తూ అలాంటి పనులు చేయకండి."

ఆమె పలుకులు నూతనోత్సాహాన్ని పోసాయి అతనిలో.

"కాసేపు ఆ తోటదగ్గర కారాపుదామా?" అన్నాడు, రోడ్డుప్రక్కన కనిపిస్తున్న మామిడితోటను చూపుతూ.

సిగ్గుగా తల వంచుకుందామె.

కారును రోడ్డునుంచి మళ్ళించి తోటదగ్గర ఆపాడు పురుషోత్తం.

ఆత్రంగా ఆమెను అందుకుని ఆమె పెదవులపైన గాఢంగా చుంబించాడు.

అంతే! —

మరు నిముషంలో మత్తుగా సీట్లోకి జారిపోయాడు!!

ఓసారి అతన్ని కుదిపి చూచింది ఆ యువతి.

గాఢ నిద్రలో వున్నవాడిలా కదల లేదతను.

మందహాసంతో గబగబా అతని జేబులు వెదికింది ఆమె. అతని పర్సులోవున్న నోట్ల దొంతరను తీసుకుని తన హ్యాండ్ బ్యాగ్‌లో పడేసుకుంది. అతని చేతినున్న ఖరీదైన వాచీ, వ్రేళ్ళనున్న వుంగరాలూ—అన్నీ తీసుకుని బ్యాగ్‌లో వేసుకుంది.

తరువాత కారు దిగి, "థాంక్యూ, మిస్టర్!" అంటూ చకచకా అక్కడినుంచి నడిచి వెళ్ళిపోయింది.

2

రాత్రి ఎనిమిదిన్నర దాటింది.

కీల్పాక్‌లో వున్న ఆఫీసునుంచి ఆనాటి కలెక్షన్ పన్నెండు వేలూ పట్టుకుని తన ఫియట్ కారులో ఇంటికి బయలుదేరాడు 'రాయల్ ఎస్టేట్' వోనర్ మురుగన్. ముప్పయ్యేళ్ళుంటాయి అతనికి.

కొంతదూరం వెళ్ళేసరికి ఓ అందాల భరిణె ఎదురొచ్చి కారాపింది.

ఆమె అందాన్ని చూసాక లిఫ్ట్ ఇవ్వననడానికి మనసొప్పలేదు అతనికి.

ఆనందంగా ప్రక్కన కూర్చోబెట్టుకున్నాడు.

మురుగన్‌ని ఆమె అందం ఆకర్షించినా, చొరవచేసే ధైర్యంలేదు అతనికి. అందుకే చాక్లెట్ చూపిన చంటి పిల్లాడిలా పెదాలు చప్పరించుకుంటూ నెమ్మదిగా కారును పోనిస్తున్నాడు.

అతని అవస్థను గ్రహించి లోలోపలే నవ్వుకుంది ఆ యువతి.

తానే చొరవచేసి అతనికి రాసుకుని కూర్చుంది.

కునేగా పరిమళానికి తోడు. మృదువైన ఆమె అవయవాల తాకిడి, సుకుమారమైన శరీరపు వేడీ—అతని వొంట్లో విద్యుత్తును ప్రసరింపజేసాయి.

అందమైన ఆడది అంత సన్నిహితంగా ప్రవర్తిస్తూంటే మడికట్టుకూర్చోవడానికి ముక్కు మూసుకుని తపస్సు చేసే మునిపుంగవుడు కాడతను.

అందుకే—కొంతదూరం వెళ్లేసరికి క్రీనీడలో ఓచోట కారాపి, ఆబగా ఆమె అరుణాధరాలను అందుకున్నాడు.

అతనికి గాఢమైన ముద్దు ఇచ్చిందామె.

ఫలితంగా—మరో నిముషంలో మత్తుగా వాలిపోయాడు అతను; అతని మెడలోని పులిగోరు గొలుసు, పన్నెండు వేలతో మాయమయిం దామె.

3

దాదాపు ప్రతిరోజూ ఇలా నగరంలోని ఏదో ఒక ప్రాంతంలో ఎవరో ఒకరికి పరాభవం జరుగుతూనే వుంది.

మొదట్లో ఒకరిద్దరు తేలుకుట్టిన దొంగల్లా మెదలకుండా వూరుకున్నా—ఆ తరువాత ఎవరో పోలీస్ రిపోర్ట్ ఇవ్వడంతో పోలీసులు రంగంలోకి దిగారు.

ఆవేళ రాత్రి పది గంటలకు ఏదో పనిమీద అన్నానగర్ వెళ్ళి మోటార్ సైకిల్‌మీద తిరిగి వస్తున్నాడు క్రయిం బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మాధవ్. యూనిఫామ్‌లో వున్నాడతను.

అన్నా నగర్‌కీ—అమింజికరైకీ మధ్యలోవున్న ఆ ప్రాంతానికి వచ్చేసరికి మోటార్‌బైక్‌కి సడెన్ బ్రేక్ పడింది.

రోడ్డు ప్రక్కనున్న ఎలక్ట్రిక్ పోల్‌దగ్గర ఓ యువతి ముఖం చేతుల్లో కప్పుకుని వెక్కివెక్కి ఏడుస్తోంది.

జన సంచారం ఎక్కువగా లేదక్కడ.

మోటార్ బైక్‌ని ఆమె ప్రక్కగా ఆపాడు ఇన్‌స్పెక్టర్.

"ఎవరమ్మాయ్ నువ్వు? ఎందు కేడుస్తున్నావ్? ఏం జరిగింది?" అంటూ ప్రశ్నలవర్షం కురిపించాడు.

అతి కష్టంమీద ఏడుపు ఆపుకుంటూ యిన్‌స్పెక్టర్‌వంక చూపిం దామె.

"మా అమ్మకి వొంట్లో బావుండలేదని మందులు తేవ డానికి బయలుదేరాను. ఇక్కడికి వచ్చేసరికి ఎవరో ఇద్దరు స్కూటర్‌మీదొచ్చి నా మెళ్ళోని గొలుసు తెంపుకుని, నా చేతిలోని పర్సు లాక్కుని పారిపోయారు...." అంది వెక్కుతూనే. "మందులు కొనడానికి యింక నాదగ్గర డబ్బులు కూడా లేవు."

చిన్నగా వులిక్కిపడ్డాడు యిన్‌స్పెక్టర్.

"ఎంతసేపయింది? ఎటు వెళ్ళారు వాళ్ళు?" అన్నాడు.

"తిన్నగా వెళ్ళిపోయారు. లాభం లేదు్సర్! ఈపాటికి ఎక్కడో మాయమయివుంటారు" అందామె.

"స్టేషన్‌కొచ్చి కంప్లెయింట్ యిద్దువుగాని, పద" అన్నాడు యిన్‌స్పెక్టర్.

"ముందు అమ్మకు మందులు కావాలి" అందామె.

"నీ పర్సులో ఎంతుంది?"

"ముప్పయ్ రూపాయలు."

జేబులోంచి పర్సు తీసాడు ఇన్‌స్పెక్టర్. ఆ రోజే జీతం అందుకున్నాడేమో పర్సునిండా నోట్లున్నాయి.

"ఇదిగో, ఈ డబ్బు తీసుకుని మీ అమ్మకు మందులు కొను" అంటూ ముప్పయ్ రూపాయలు యివ్వబోయాడు.

తీసుకోవడానికి సంశయించిం దామె.

"ఫరవాలేదు తీసుకో" అని అతను బలవంతం చేయ

దంతో తప్పని సరిగా తీసుకుందామె.

"వెనక కూర్చో. మెడికల్‌షాపు దగ్గర దింపుతాను" అని అతననడంతో 'థాంక్స్' చెప్పి ఎక్కి కూర్చుంది.

4

డిటెక్టివ్ ప్రాణ్ అన్నా నగర్‌లో ఎవరో స్నేహితుల ఇంటికివెళ్ళి రాత్రి పదకొండు గంటలకు తిరిగి వస్తున్నాడు.

కొత్తగా కొన్న రెడ్ కలర్ కాంటెస్సా స్మూత్‌గా, స్పీడుగా వెళుతోంది ప్రాణ్ చేతిలో.

అమింజికరై దాపులకు వచ్చేసరికి కారుకు సడెన్ బ్రేక్ వేసాడు అతను.

గబగబా కారు దిగి రోడ్డు ప్రక్కగా పడివున్న మోటార్ సైకిల్‌వైపు పరుగెత్తాడు. అది ఎవరిదో తెలుసతనికి.

అంతలోనే బైక్‌కి చేరువలో తుప్పల్లో పడివున్న ఇన్‌స్పెక్టర్ మాధవ్ కనిపించాడు.

తెల్లబోతూ అతని దగ్గరకు వెళ్ళాడు ప్రాణ్. ఇన్‌స్పెక్టర్ మోటారు సైకిల్‌కి యాక్సిడెంట్ జరిగిందని భావించి కంగారుగా మాధవ్‌ని పరీక్షించాడు.

ఇన్‌స్పెక్టర్ శరీరంమీద ఎక్కడా గాయాలు కనిపించ లేదు. మత్తుగా నిద్రపోతున్నవాడిలా వున్నాడు!

ఆశ్చర్యంతో అతని నోటిదగ్గర వాసన చూసాడు ప్రాణ్. ఏదో తీయని వాసన చూచాయగా తగిలింది. ఏమయిందా అని విస్తుపోతూ అతన్ని కుదిపి చూసాడు. అతనిలో చలనంలేదు. ఉచ్ఛ్వాస-నిశ్వాసలు మాత్రం భారంగా వున్నాయి.

కాసేపటికి అటు వెళుతూన్న ఓ స్కూటర్ వాలాను ఆపి, అతని సాయంతో యిన్‌స్పెక్టర్ని తన కారులోకి

చేర్చాడు. మోటారు సైకిల్‌ని లాక్‌చేసి బయలు దేరాడు.

మాధవ్‌ని అతని యింటికి తీసుకువెళ్ళి స్మెల్లింగ్ సాల్ట్ వాసన చూపడంతో కాసేపటికి తెలివిలోకి వచ్చాడు అతను—

స్పృహలోకి రాగానే డిటెక్టివ్ ద్వారా విషయం తెలుసుకుని ఆశ్చర్యపోయాడు యిన్‌స్పెక్టర్. జరిగిందంతా నెమ్మదిగా గుర్తుచేసుకో నారంభిందాడు....

ఆ యువతిని వెనుక కూర్చోబెట్టుకుని మోటార్‌సైకిల్‌ని అమింజికరై వైపు దూకించాడు తాను.

ఓ నిముషం తరువాత, "యిన్‌స్పెక్టరుగారూ! జారిపోతున్నాను. ఒక్క నిముషం ఆపండి" అంటూ తన నడుం చుట్టూ చేయివేసిం దామె.

తాను బైక్‌ని స్లో చేసాడు.

"నే నెప్పుడూ మోటార్‌సైకిల్ ఎక్కలేదండీ. పైగా, మీ వేగానికి జారిపోతున్నాను. పడిపోతానేమోనని భయం వేస్తోంది. యిక్కడ దింపెయ్యండి, నడిచి వెళ్ళిపోగలను" అందామె.

పరిసరాలలో జన సంచారం ఎక్కువగా లేదు. ఆమె నక్కడ వొంటరిగా వదలడం యిష్టంలేక, "ఫరవాలేదు. మెల్లిగా నడుపుతాను, జాగ్రత్తగా కూర్చో" అన్నాడు తాను.

"ఒకసారి ఆపండి. సరిగా కూర్చుంటాను" అని ఆమె అనడంతో మోటార్ బైక్‌ని ఆపాడు తాను.

ఆమె దిగుతున్నట్టు దిగుతూనే తన మెడను వాటేసుకుంది. ఏం జరుగుతున్నదో గ్రహించే లోపునే ఆమె పెదాలు తన పెదాలను గట్టిగా చుంబించాయి.

అంతే!

హఠాత్తుగా ఏదో మత్తు ఆవరించింది తనను!!

అటుపైన ఏం జరిగిందో ఎరగడు....

ఏదో గుర్తుకు రావడంతో చటుక్కున జేబు తడుము కున్నాడు మాధవ్.

పర్సు జేబులోనే వుంది.

లేనిదల్లా పర్సులో వుండవలసిన జీతమే!

వివరాలు తెలుసుకున్న డిటెక్టివ్ ప్రాణ్, యిన్స్పెక్టర్ వంక చూసి నవ్వాడు

ఆ నవ్వు చూసేసరికి వొళ్ళు మండింది మాధవ్‌కి. ఉడుకుమోత్తనం వచ్చింది. కోపంగా చూసాడు ప్రాణ్ వంక.

"సో, ఆ కిస్సింగ్ రాబర్ చేతిలో నీకు పరాభవం జరి గిందన్న మాట!" అన్నాడు ప్రాణ్ చిరునవ్వుతో. "నగర మంతా అలజడి రేపిన ఒక్క అమ్మాయిని పట్టుకోవల సిందిపోయి, ఆమె చేతిలో నువ్వే చిత్తయినట్టు తెలిస్తే యిక మీ పోలీసుల పరువు గోవిందా! ...యూనిఫామ్‌లో వున్న నీకే టోపీ వేసిందంటే—హ్యాట్సాఫ్ టు హర్!.. అయినా అంత ఖరీదైన ముద్దును కోరకపోతేనేం?"

ప్రాణ్ పలుకులకు మరింత వుడుక్కున్నాడు మాధవ్.

"సారీ, మై ఫ్రెండ్! అలా కల్తీనెయ్యి త్రాగినవాడిలా ముఖం పెట్టకు. బీ చీర్‌ఫుల్!....ఈ రాత్రికి పూర్తిగా విశ్రాంతి తీసుకో....ఆ దొంగలరాణి విషయం తెల్లవారాక ఆలోచిద్దాం" అంటూ ఇన్‌స్పెక్టర్‌కి 'గుడ్‌నైట్' చెప్పేసి వెళ్ళిపోయాడు ప్రాణ్.

5

"మహత్యమంతా ముద్దులోనే వున్నదనిపిస్తోంది నాకు" అంది డిటెక్టివ్ అసిస్టెంట్ మిస్ గీత.

"ఔను. కాని, ఆ మహత్యం ఏమిటి అన్నదే ప్రశ్న!" అన్నాడు ప్రాణ్.

"ఆమె పెదాలకు రాసుకునే లిప్‌స్టిక్‌లో ఏ డ్రగ్ అయినా కలిపి వుండొచ్చు. అది మగవారి పెదాలకు తగలగానే వారిని స్పృహతప్పిస్తూండాలి" అంది గీత.

"నీ వూహే నిజమైతే, అదే డ్రగ్ పెదాలకు పూసుకోవడం వలన దాని ప్రభావం ఆమెమీద ఎందుకు పడడం లేదు?" ప్రశ్నించాడు ప్రాణ్.

ఏం చెప్పాలో తోచలేదు ఆమెకు.

"మన థియరీలో ఎక్కడో లోపముంది, గీతా!" అన్నాడు ప్రాణ్.

తలూపిందామె.

చాలాసేపు అదే విషయాన్ని గూర్చి చర్చించుకుంటూ వుండిపోయారు ఇద్దరూ.

"ఈ మిస్టరీ ఏమిటో త్వరలో తేల్చకపోతే నిద్రపట్టేలా లేదు" అన్నాడు ప్రాణ్.

"అసలే తమరు ఆడపిల్లల్ని చూస్తే అయస్కాంతంలా వాళ్ళకు అంటుకుపోతారు. ఎందుకైనా మంచిది బయట తిరిగేప్పుడు జేబులు ఖాళీగా వుంచుకోండి" అంది గీత కొంటెగా నవ్వుతూ.

పెద్దగా నవ్వాడు ప్రాణ్.

"ఆడబుద్ధి పోనిచ్చుకున్నావ్ కాదు!" అంటూ ఆమె నాసిక పట్టుకుని చిలిపిగా వూపాడు.

6

వారం రోజుల అనంతరం—

రాత్రి తొమ్మిదవుతుంది.

ఇలియట్స్ బీచ్ రోడ్‌లో—'కళాక్షేత్ర'కు ఎదురుగా

నిలుచుంది అందమైన ఓ యువతి. ఆమె చేతిలో హ్యాండ్ బ్యాగ్ వుంది.

ఆ ప్రాంతంలో సాధారణంగా పగలే జనసంచారం తక్కువ. ఇక రాత్రివేళ చెప్పనవసరం లేదు.

కొంతసేపటికి ఫియట్ కారు ఒకటి బీచ్ వైపు నుంచి రావడం చూసిందామె.

కారు దగ్గరకు రాగానే రోడ్డుపైన నిలుచుని చేయ వూపింది.

ఫియట్ ఆగిపోయింది.

కారును డ్రయివ్ చేస్తూన్న అతను సూటూ, బూటులో వున్నాడు.

లైట్ కాంతిలో ఆమెను పరీక్షగా చూపిన అతను, ఆమె అందానికి గుటకలు మింగాడు.

అతని దగ్గరగా వెళ్ళిందామె.

"ఇఫ్ యూ డోంట్ మైండ్. దయచేసి అడయారు వరకు లిఫ్ట్ ఇవ్వగలరా?" తీయని స్వరంతో అడిగింది.

ఆ స్వరంలోని మాధుర్యానికిగాని, ఆమె రూపంలోని సౌందర్యానికిగాని ఆమె ఏమడిగినా కాదనలేడు ఏ మగ వాడూను—

కారు డోర్ తెరిచాడతను, "విత్ ప్లెజర్!" అంటూ.

'థాంక్స్' చెప్పి అతని ప్రక్కన కూర్చున్నదామె.

మధ్య మధ్య ఆమె అందాన్ని కళ్ళతోటే జుర్రుకుంటూ కారును మెల్లగా పోనిస్తున్నాడతను.

"మీ కారు మరీ ఎద్దులబండిలా నడుస్తోందేమిటి?" అన్నదామె నవ్వుతూ.

"అందమైన అమ్మాయిని చూడడంతో దానికి కూడా

బుర్ర పనిచేయడం మానేసి వుంటుంది!" అన్నాడతను నవ్వుతూ.

"అంటే, ఇంకెవరి బుర్రో కూడా పనిచేయడం మానే సిందంటారా?" చిలిపిగా అడిగిందామె.

"రౌతుది!" అన్నాడతను.

"ఐసీ!" అందామె, ఇంకొంచెం అతని మీదకు జరుగుతూ.

"ఆడవాళ్ళ అందం వుంది చూసారూ, అది ఇర్రెసిస్టిబుల్ అనుకోండి!" అన్నాడతను.

"వూఁ—?" అంటూ కవ్వింపుగా చూస్తూ పైట జార్చిందామె.

"ఇలా ఎద్దునడక నడిచేకంటె, కాసేపు ఎక్కడైనా ఆపరాదూ—కబుర్లు చెప్పుకోవచ్చును?" అంది.

"ఓఁ!" అంటూ హుషారుగా చీకటిగా వున్నచోట కారాపాడు అతను.

అతని మెడచుట్టూ చేతులు వేసిందామె. అతని తలను తనవైపు లాక్కుని అతని పెదవులపైన గట్టిగా ముద్దు పెట్టుకుంది.

ఓ నిమిషంలో మత్తుగా వీల్ మీదకు వాలిపోయాడు అతను.

మందహాసంచేస్తూ వెనక్కి జరిగింది ఆ యువతి— గబగబా అతని జేబులు వెదికింది. జేబులోంచి పర్సుతీసి అందులో వున్న సొమ్మంతా తీసి తన హ్యాండ్ బ్యాగ్‌లో వేసుకుంది.

అతని చేతినున్న ఇంపోర్టెడ్ వాచ్‌ని తీయబోయింది.

అదే సమయంలో—

చటుక్కున లేచి కూర్చుని, ఆమె చేయి పట్టుకున్నాడు అతను.

త్రుళ్ళిపడిందామె.

"నువ్వా....నీకు—మత్తు కలగలేదూ!" అంది తెల్ల బోతూ.

"నువ్వు నీ పెదాలతో నా నోట్లోకి త్రోసిన పిల్ని నేను మింగితేగదా!" అన్నాడు అతను. "పెదాలు బిగించి బయటకు త్రోసేసాను వాటిని. మత్తు కలిగినట్లు నటించి, నువ్వు నన్ను దోపిడి చేస్తూండగా నా వాచ్ లోవున్న సీక్రెట్ మూవీ కెమేరాతో నీ చర్యలను ఫోటో తీసాను".

"ఎవరు నువ్వు?" అందామె నిర్ఘాంతపోతూ.

"నీ ఆట కట్టించడానికి వారంరోజులుగా నీ కోసం వెదుకుతూన్న ప్రయివేట్ డిటెక్టివ్‌ని. ప్రాణ్ అంటారు నన్ను...." అన్నాడతను.

"డిటెక్టివ్ ప్రాణ్....! అంటూ కీచుగా అరిచిందామె. "యూ బ్లడీ!"

మందహాసం చేసాడు ప్రాణ్.

"నీ చర్యలు ఫిల్మ్ తీయబడితే, నీ మాటలు రికార్డ్ అవుతున్నాయి—మినీ టేప్‌రికార్డర్‌లో....ఇక, నువ్వా నీ విక్టిమ్స్ మీద ప్రయోగిస్తున్న డ్రగ్‌పిల్స్ అంటావా! నీ హ్యాండ్‌బ్యాగ్ తెరిస్తే బయటపడతాయి." అంటూ ఆమె చేతిలోని హ్యాండ్‌బ్యాగ్‌ని లాక్కుని, అందులోని వస్తువులను సీటుమీద గుమ్మరించాడు.

డబ్బు వగైరాలతో పాటు చిన్న ప్లాస్టిక్ భరిణె ఒకటి వుంది. దానిని తెరిచి చూసిన ప్రాణ్ కళ్లు మెరిసాయి.

హోమియో మాత్రల్లావున్న తెల్ల గుళికలను ముక్కు-

దగ్గర పెట్టుకుని వాసన చూసాడు. తీపి వాసనవేసింది. సాలోచనగా తల పంకించాడు.

"సో, నా అనుమానం నిజమే నన్నమాట. ముద్దుపెట్టు కునే వంకతో నీ పెదాలమధ్య వీటిని వుంచుకుని అవతలి వ్యక్తి నోట్లోకి త్రోస్తావు. వీటిని మ్రింగిన వ్యక్తిపైన స్లీపింగ్ పిల్స్‌లా ఇన్‌స్టెంట్‌గా పనిచేస్తాయి యివి. దాంతో తక్షణం మత్తుగా పడిపోతాడు. కనీసం రెండు గంటల వరకు ఈ డోప్ ప్రభావం వుంటుంది. ఆ లోపున వారిని పూర్తిగా దోచుకునిపోతావు. ఔనా?" అన్నాడు.

నిస్సహాయంగా తలూపిందామె.

"చూడమ్మాయ్! దేవుడు నీ కిచ్చిన అందచందాలు ఇలా దుర్వినియోగపరచుకోవడానికి కాదు. అందమైన రూపానికి తోడు అందమైన మనసుకూడా వుండాలి.... మర్యాదగా నేరం వొప్పుకుంటే శిక్ష తగ్గవచ్చును" అని ప్రాణ్ అనడంతో, ఒక్కసారిగా దుఃఖం ముంచుకు వచ్చింది ఆమెకు. ముఖం చేతుల్లో కప్పుకుని ఏడ్చింది.

అనునయంగా ఆమె భుజం నిమిరాడు ప్రాణ్. అటు వంటి సుందరాంగిని ఆ స్థితిలో చూడవలసి వచ్చినందుకు చింతించా డతను.

కాసేపటికి ఏడ్పు ఆపి సర్దుక్కూర్చుందామె.

"ప్రాణ్‌గారూ! నిజం చెప్పేస్తాను. అటుపైన ఏం చేసినా మీ యిష్టం...." అంది.

"నా పేరు జయంతి. బి. ఎస్సీ చదువుతూ మానేశాను. నా తండ్రి ఎవతెనో తీసుకుని పరారి కావడంతో అమ్మా, నేనూ దిక్కులేని పక్షులమయ్యాము.

ఎన్నో వుద్యోగ ప్రయత్నాలు చేశాను. ఉద్యోగం

యివ్వకపోయినా ప్రతిచోటా చేయిపట్టుకునేవారే యెదురయ్యారు.

అమ్మ నాలుగిళ్ళలో పనులుచేసి యిల్లు గడిపేది. మా యింటి దగ్గర వున్న ఓ తాతదగ్గర హోమియోపతీ హాబీగా నేర్చుకున్నాను. ఆ తరువాత మందుల తయారీలో అనుకోకుండా కొత్తరకపు డోప్‌ని కనిపెట్టడం జరిగింది నేను....

అంతలో అమ్మ క్షయ వ్యాధితో మంచం పట్టింది. అసహాయ స్థితిలో, ఈ తప్పుడు మార్గం అవలంబించక తప్పలేదు నేను.

నేను కనుగొన్న డోప్ చాలా పవర్‌ఫుల్‌ది. హై పొటెన్సీతో గుళికలను తయారుచేశాను. మగవాళ్ళ బలహీనతను వుపయోగించుకోవాలనుకున్నాను.

డోప్ గుళికలను వ్రేలి గోళ్ళమధ్య దాచి వుంచేదాన్ని. ముద్దు పెట్టేముందు వాటిని నా పెదవుల మధ్య పెట్టుకుని, ముద్దు వంకతో వాటిని విక్టిమ్ నోట్లోకి త్రోసేదాన్ని. దాని ప్రభావం వల్ల వెంటనే మత్తు ఆవరించేది వాళ్ళను."

"మరి, ఆ మందును నీ పెదవుల మధ్య పెట్టుకున్నప్పుడు దాని ప్రభావం నీపైన పడేదికాదా?" ప్రశ్నించాడు ప్రాణ్.

"నేను వాడే లిప్‌స్టిక్‌లో ఓ విధమైన తైలపదార్థాన్ని మిక్స్ చేసేదాన్ని. దాని మూలంగా ఆ పిల్సు తామరాకు మీద నీటిబొట్టులా వుండేవే తప్ప నా పెదవులను అంటుకునేవి కావు. పైగా, అవి నా నోట్లోకి దిగకుండా జాగ్రత్తపడేదాన్ని" వివరించిందామె.

"జయంతీ! ఇంత చక్కటి విజ్ఞానము, తెలివితేటలూ వుండీ—అజ్ఞానంతో అంధకారంలో పయనిస్తున్నందుకు నీపట్ల జాలి కలుగుతోంది నాకు" అన్నాడు ప్రాణ్. "మన

దేశంలో అధికభాగం పేదవాళ్ళే. అలాగని అందరూ స్వార్ధంతో నీలాగే అవినీతి పనులకు పాల్పడితే ఇక దేశం గతేం కాను?"

"క్షమించండి. స్వార్ధంతో ఈ పనికి పూనుకోలేదు నేను. గతిలేక, క్షయతో తీసుకు చస్తోన్న తల్లిని రక్షించుకోవాలన్న తపనతో, భుక్తి కోసం ఈ మార్గం అవలంబించాను... తప్పో వొప్పో నాకు తోచినదీ, చేతనయినదీ చేశాను" అందామె. "ప్రాణ్ గారూ! నాకు శిక్ష పడుతుందన్న భయంలేదు. కాని, మంచం పట్టిన మా అమ్మను ఆదుకునే దెవరా అన్నదే నా బెంగ. నేను ఏదో వుద్యోగం చేసి సంపాదిస్తూన్నా ననుకుంటోంది అమ్మ. నేను జెయిల్ కి వెళ్ళినట్లు తెలిస్తే ఆమె గుండె పగులుతుంది...."

ఆమె చెక్కిళ్ళు కన్నీటితో తడిసిపోయాయి.

జాలికలిగింది ప్రాణ్ కి.

"చట్టానికి యెదురు తిరిగినవాళ్ళు శిక్ష ననుభవించక తప్పదు, జయంతీ! అయినా, నీకు వీలయినంత తక్కువ శిక్ష పడేందుకు ప్రయత్నిస్తాననీ, నువ్వు జెయిల్ నుంచి తిరిగి వచ్చేంతవరకు మీ అమ్మను ఆదుకుంటాననీ హామీ ఇస్తున్నాను" అన్నాడు.

కృతజ్ఞతాపూర్వకంగా అతనివైపు చూసిన జయంతి కళ్ళలో నీటితెరలు అడ్డుపడ్డాయి.

ఫియట్ కారు వేగంగా పోలీస్ స్టేషన్ వైపు దూసుకు పోయింది.

(డిటెక్టివ్ ప్రాణ్, మిస్ గీత, ఇన్ స్పెక్టర్ మాధవ్ ల పాత్రల వుపయోగం 'విశ్వమోహిని' సౌజన్యంతో.) □

మిణుకు మంటూ కునికిపాట్లు పడుతున్నాయి కార్పొరేషన్ దీపాలు. సన్నని రోడ్డు. సమయం సుమారుగా రాత్రి తొమ్మిదిగంటలు కావస్తోంది. శీతాకాలం చలిగాలులు వుధృతంగా వున్నాయి.

చేతికర్ర వూపుకుంటూ నడుస్తున్నాడు జంబులింగం. సుమారు యాభై సంవత్సరాల వయసుంటుందతనికి. ఆ వేళకు ప్రతిరోజూ అదే రోడ్డున వెళతాడు జంబులింగం. భోజనం చేసాక ఓ అరగంటయినా నడవందే నిద్రపట్ట దాయనకు. ఆ అలవాటు అతనికి చాన్నాళ్ళుగా వుంది.

చలిబాధ లేకుండా తలకు మఫ్లరు చుట్టాడు. ఒంటిమీద స్వెట్టరుంది. మఫ్లరు, స్వెట్టరు అక్కడక్కడ చిరుగులుపడి రంగు వెలసి బేలచూపులు చూస్తున్నాయి. జంబులింగం ఒంటిమీదున్న దుస్తులుకూడా ఇంచుమించు అలాగే వున్నా యి. అయినా అదేమీ పట్టించుకోడతను. జంబులింగం చేతి కొచ్చే ప్రతి వస్తువూ నికరంగా నూరేళ్ళూ బ్రతకాల్సిందే!

జంబులింగం నగరంలో వున్న కొద్దిపాటి ధనవంతుల్లో ఒకడు. తెలియని వ్యక్తులు అతణ్ని అతడి వేషాన్ని చూసి ఏ రిటయిర్డు టీచరో అనుకుంటారు. తెలిసినవారు పట్టి పిసి నారి పీనుగ ఎన్ని లక్షలుంటే ఏం లాభం అంటారు. ఎవరు ఏమనుకున్నా జంబులింగం మాత్రం ఏమీ అనుకోడు. తన పద్ధతులు తనవి అంటాడు పైగా.

జంబులింగం నెమ్మదిగా అడుగులు వేస్తున్నాడు. ప్రస్తుతం అతడు నడుస్తున్న రోడ్డు నగరానికి నడిబొడ్డున వుంది. అయినా ఆ ప్రాంతంలో అంతగా యిళ్ళు లేవు. జనసమ్మర్దం తక్కువనో ఏమో ఆ గుడ్డిదీపాలు కూడా వెల గడం లేదక్కడ.

జంబులింగానికి ఎదురుగా పెద్ద పెద్ద అంగలు వేస్తూ వస్తున్నాడొక వ్యక్తి. అతని శరీరంమీదున్న నల్లనికోటు పాదాలవరకూ వేలాడుతోంది. తలపై ఆదేరంగు హేటు. కోటుజేబుల్లో రెండు చేతులూవుంచి ముందుకివంగి నడుస్తు న్నాడు. హేటు వీలయినంత మేర మొహాన్ని కప్పేస్తూవుంది.

కళ్ళకు అద్దాలు వున్నాయో లేదో ఆ చీకటిలో స్పష్టంగా తెలియడంలేదు.

ఆ వ్యక్తి జంబులింగానికి బాగా చేరువయ్యాక టక్కున ఆగుతూ అడిగాడు హిందీలో "మేచ్‌బాక్స్ హైః". ఆ గొంతు బొంగురుగా వుంది. జంబులింగం ఆగాడు. అగ్గిపెట్టె కోసమని రెండు జేబుల్లోనూ తడుముతున్నాడు.

లాంగ్‌కోటు వ్యక్తి జేబుల్లోనుండి చేతులు పైకి తీశాడు. ఏ చేతిలోనూ సిగరెట్ పెట్టె లేక పోగా, కుడి చేతిలో పొడవాటి కత్తి తళుక్కున మెరిసింది.

జంబులింగం కత్తిని చూస్తూనే వెనక్కి తగ్గి భయంగా అరవబోయాడు.

కానీ లాంగ్‌కోటు వ్యక్తి మెరుపులా కదిలి ఎడమచేత్తో జంబులింగం నోటిని మూస్తూ కుడిచేతిలో వున్న కత్తితో అతని గుండెల్లో పొడిచాడు బలంగా. ఆ ఒక్కపోటుకే కిక్కురుమనకుండా నడిరోడ్డుమీద కుప్పకూలిపోయాడు జంబులింగం.

లాంగ్‌కోటు వ్యక్తి చకచకా నడిచిపోయాడక్కడ నుండి.

2

లక్షాధికారి జంబులింగం శరీరం నడిరోడ్డుమీద దిక్కు మొక్కూ లేకుండా పడివుంది. రోడ్డుమీద స్పీడుగా వస్తోం దొక కారు. జంబులింగం శరీరానికి ఓపదడుగుల దూరంలో కీచుమంటూ ఆగింది కారు.

డ్రైవింగ్ సీట్లోవున్నాడొక ముప్ఫయ్యేళ్ళ యువకుడు. యువకుడి ప్రక్కన కూర్చొని అతడి భుజంమీద తలవాల్చి కునికిపాట్లు పడుతున్న యువతి మత్తుగా కళ్ళు తెరిచింది.

చుట్టూ చూసి యువకుణ్ణి హత్తుకుపోతూ "ఏమయింది

డార్లింగ్! కారు పోనీవ్. నాకు భయమేస్తోం దిక్కడ"
అంది బెదురుగా.

యువకుడు "ఎవడో రోడ్డుకడ్డంగా పడివున్నాడు. ప్రతి వెధవకూ యిదో జబ్బు. మత్తుగా తాగడం. రోడ్లమీదపడి దొర్లడం!" అంటూ హారన్ కొట్టాడు. ప్రయోజనం లేక పోగా కారు దిగాడు చిరాగ్గా. కారు హెడ్‌లైట్లు వెలుగుతూనే వున్నాయ్.

"జాగ్రత్త!" అంది యువతి కారు దిగకుండానే.

యువకుడు జంబులింగం శరీరాన్ని సమీపించాడు. ఈగలు ఝుమ్మంటూ చెల్లాచెదురయ్యాయి. యువకుడు అనుమానంగానే శరీరాన్ని ప్రక్కకు కదిలించాడు. వెల్లకిలా పడింది. లైట్ల వెలుగులో స్పష్టంగా కనపడింది మొహం గుండెల్లో పిడివరకూ దిగిన కత్తి!

"డాడీ!" అరిచాడా యువకుడు పెద్దగా.

ఆ అరుపుకు కారులో యువతి పరుగున వచ్చిందక్కడికి "ఏమయింది?" అంటూ.

"చిత్రా! డాడీని ఎవరో హత్య చేసారు!" బాధగా దుఃఖం నిండిన స్వరంతో అన్నాడు యువకుడు.

"ఆ!" అంది చిత్ర షాక్ తిన్నదానికి మల్లే.

3

"మిస్టర్ జగదీష్! జరిగిందానికి బాధపడి ప్రయోజనం లేదు. ఇప్పుడు మనం చేయగలిగింది మీ తండ్రిగారిని చంపిన హంతకుణ్ణి పట్టి చట్టానికి అప్పగించడం. అప్పుడే అతని ఆత్మకు శాంతి. మీరు సహకరిస్తే ఆ పని మేం చేస్తాం" అన్నాడు ఇన్‌స్పెక్టర్ షరీఫ్, జగదీష్ భుజంమీద అనునయంగా చేయివేస్తూ.

జగదీష్ కళ్ళు తుడుచుకుంటూ "అడగండి సార్!"

అన్నాడు నిర్లిప్తంగా.

"మీ తండ్రిగారికి వ్యాపార రీత్యాగాని మరొకరకంగా గాని విరోధులెవరయినా వున్నారా?" ప్రశ్నించాడు షరీఫ్.

"వుహూఁ! ఆ అవకాశంలేదు. నాన్నగారు ఎట్టి పరిస్థితుల్లోనూ ఎవరినీ నొప్పించేలా ప్రవర్తించరు. తను ఒకరికి పెట్టరు ఇంకొకళ్ళది ఆశించరు. అదీ అతని తత్వం. అటువంటి వ్యక్తికి విరోధులుండే అవకాశమేదీ?"

"మిస్టర్ జగదీష్! మీ తండ్రిగారి శవాన్ని మొదట చూసింది మీరేకదా! అదెలా సంభవించింది. ఆ సమయంలో మీరటునుండి ఏ పనిమీద వెళ్ళవస్తున్నారు. అప్పుడు మీతో మరెవరయినా వున్నారా?"

"రోడ్డుకు ఎగువన దిల్‌కుష్ హోటల్‌నుండి బయల్దేరి నేనూ నా ఫ్రెండూ వస్తున్నాం. మా యింటికి హోటల్ నుండి అది అడ్డదారి. కొంచెం యిరుకుదారి అనుకోండి. అయినా సాయంత్రం కారులో పెట్రోలు పోయిద్దామనుకుంటూనే మర్చిపోయాను. ఆ కారణంగా ఎందుకయినా మంచిదని అటు రావడం జరిగింది. దురదృష్టకరమయిన ఆ దృశ్యాన్ని స్వయంగా మొట్టమొదట చూడవలసి వచ్చింది. అప్పుడు నాతోబాటు ఓ ఫ్రెండు కార్లో వున్నారు"

"ఆడా? మగా?" నవ్వుతూనే అడిగాడు షరీఫ్.

జగదీష్ యిబ్బందిగా కదిలాడు. "ఆడ!" అన్నాడు చివరికి.

పేరూ వివరాలూ అడుగుతాడేమోనని జగదీష్ భయపడ్డా ఇన్‌స్పెక్టర్ విషయాన్ని అంతటితో ముగిస్తూ "ప్రస్తుతానికి యింతకుమించి ప్రశ్నలేంలేవు. అవసరమయినపుడు మాత్రం మీ సహకారం మాకు వుండాలి" అన్నాడు లేచి

నిలబడి.

జగదీష్ తనూ లేస్తూ "తప్పకుండా" అన్నాడు....

4

ఎయిర్ కండిషన్ చేయబడిన అందమయిన ఆ గదిలోనికి నవ్వుతూ ప్రవేశించాడావ్యక్తి. జగదీష్! చిత్ర! దాదాపు అతుక్కుపోయినట్టు కూర్చున్నారు సోఫాలో. అలికిడి విని త్రుళ్ళిపడుతూ బిగి కౌగిలినుండి విడివడ్డారిద్దరూ!

"ఎవర్నువ్వు? లోనికెవరు రానిచ్చారు నిన్ను" కోపంగా అరిచాడు జగదీష్.

చిత్ర మూతి తుడుచుకుంటూ సోఫా చివరకుపోయి కూర్చుంది బుద్ధిగా.

పెద్దగా నవ్వాడు ఆ వ్యక్తి. అతనికి సుమారు ముప్పై అయిదేళ్ళ వయసుంటుంది. సన్నగా పొడవుగా వున్నాడు. ఓ మోస్తరు గడ్డం. చురుకయిన నేత్రాలు.

"మిష్టర్ జగదీష్! లోనికి వచ్చేసాక ఎలావచ్చావ్ అని అడక్కూడదు. నీ ఫ్రెండునని చెప్పి గూర్ఖాచేతిలో రెండు చాక్లెట్లు పెట్టి నా పుట్టినరోజన్నాను. సెల్యూట్ కొట్టి మరీ "అచ్చాసాబ్! అందర్ జాయియే అన్నాడు" నవ్వుతూ చెప్పాడు గడ్డంవ్యక్తి.

"సంతోషించాం. నువ్విక దయచేయడం నీ ఒంటికే మంచిది ఆలస్యమయితే ఆ గూర్ఖాచేతనే బయటకు గెంటించాల్సి వుంటుంది" ద్వారంకేసి చేయి చూపుతూ అన్నాడు జగదీష్.

గడ్డంవ్యక్తి అదేమీ పట్టించుకోనట్టు తల ఎగరేసాడు. కాళ్ళు రెండూ నిటారుగా చాచి అడుగులువేస్తూ పాంటు జేబుల్లో రెండుచేతులూ పెట్టుకొని గదిచుట్టూ ప్రదక్షిణం చేసాడొకసారి. జగదీష్ విచిత్రంగా చూసాడతణ్ణి. అతడి

వాలకం చూస్తుంటే జగదీష్‌కి చిర్రెత్తుకొచ్చింది.

"మిష్టర్! ఏమిటీ వెకిలి వేషాలు. పోతావాలేదా?" అరిచాడు కోపంగా.

గడ్డం వ్యక్తి గిరుక్కున తిరిగాడు జగదీష్ దిక్కుగా. జగదీష్‌వంక రెండు క్షణాలు సీరియస్‌గా చూసాడు.

"వెల్ మిష్టర్ జగదీష్! నీ తండ్రి హత్యకు సంబంధించి నేనో రహస్యం తెస్తే నువ్విలా నా మీద రెచ్చిపోవడమేం బాగులేదు" అన్నాడు చిన్నగా నవ్వుతూ.

ఆ మాటకు జగదీష్ ఆశ్చర్యపోయాడు. "ఎవరు నా తండ్రిని చంపారు? చెబితే నీకు కోరినంత డబ్బిస్తాను" ఆత్రంగా అన్నాడు జగదీష్!

గడ్డం వ్యక్తి తల అడ్డంగా వూపాడు. "జగదీష్! ఆ రహస్యం చెప్పకుండా దాచేందుకే నువు నాకు డబ్బివ్వాలి?" అన్నాడు.

ఈసారి మరింత ఆశ్చర్యపోయాడు జగదీష్ "ఏం ఎందుకని?"

గడ్డంవ్యక్తి వింతగా నవ్వాడు "ఎందుకా? హంతకుడివి నువ్వేగనక" అన్నాడు.

పక్కలో బాంబుపడ్డట్టు అదిరిపడ్డాడు జగదీష్. పిచ్చివాడిలా అరుస్తూ గడ్డం వ్యక్తిమీదకు దూకాడు వెంటనే.

అయితే గడ్డంవ్యక్తి ఇటువంటి సంఘటనలకు బాగా అలవాటుపడిన వాడిలావున్నాడు. ఏ మాత్రం బెదరక జగదీష్‌ను బాగా చేరువ కానిచ్చి చటుక్కున ప్రక్కకు తప్పుకున్నాడు. ఆ వూపున ముందుకుపోతున్న జగదీష్ కాళ్ళకు తన కాళ్ళు అడ్డం పెట్టాడు. జగదీష్ బోర్లాపడ్డాడు. అతడు తిరిగి లేచేసరికి గడ్డంవ్యక్తి చేతిలో నిగనిగ

లాడుతూ కనపడింది నల్లని పిస్తోలు!

జగదీష్ నివ్వెరపోయాడు. "ఎవర్నువ్వు?" అన్నాడు భయంగా అక్కడికక్కడే ఆగిపోతూ.

చిన్నగా నవ్వాడావ్యక్తి "పోలీసునుకాను. నువు సవ్యంగావుంటే ఏ గొడవావుండదు. ముందాకుర్చీలో కూర్చో" అని జగదీష్‌కి చెప్పి చిత్రకేసి తిరిగి "అమ్మాయ్! నువ్వు కూడా పోయి అతని ప్రక్కనే కుర్చీలో కూర్చో" అన్నాడు. చిత్ర అతన్ని భయంగా చూస్తూ జగదీష్ ప్రక్కనే మరో కుర్చీలో కూర్చుంది.

"గుడ్! అలావుండాలి. ఇప్పటివరకూ మీకు నాపేరు చెప్పనేలేదుకదూ! నా పేరు రమేష్. ఏదో మీలాంటి పెద్దల్ని ఈ రకంగా ఆశ్రయించి బ్రతుకు వెళ్ళదీస్తుంటాను. ఇప్పుడు డైరెక్టుగా మన వ్యవహారంలోకి వద్దాం.

జగదీష్! నీ తండ్రి జంబులింగం లక్షాధికారి. అయితేనేం పరమ పిసినారి. పిల్లికికాదు గదా దాని పిల్లకూ్కడా భిక్షం పెట్టని బాపతు నువ్వేమో జల్సారాయుడివి. నీ సంగతి కనిపెట్టి నీ చేతికి పైసా అందకుండా జాగ్రత్త పడ్డాడు నీ తండ్రి. ఇక తప్పదనుకొని ఏకంగా అతణ్ణి హత్య చెయ్యడానికే నిశ్చయించుకున్నావు నువ్వు. చిత్రతో కలపి హోటల్ దిల్‌కుష్‌లో జరుగుతున్న పార్టీకి వెళ్ళావు. పార్టీ జోరుగా సాగుతుండగా చిత్రకు రెండువేళ్ళు చూపించి ఎవరికంటా పడకుండా హోటల్‌నుండి బయట పడ్డావు.

కారు డిక్కీలోదాచిన కోటూ, హేటూ ధరించి బయల్దేరావు. హోటల్‌నుండి హత్య జరిగిన స్థలం మూడు నాలుగు ఫర్లాంగులు మించివుండదు. సరిగ్గా ఆ సమయానికి జంబు లింగం అదే రోడ్డున నడుస్తుంటాడని నీకు తెలుసు. సమ

యం, సందర్భం అన్నివిధాలా కలిసొచ్చాయి నీకు. ఎవరికీ ఎటువంటి అనుమానం కలగని రీతిలో నడిరోడ్డు మీద తండ్రిని హత్యచేసి తిరిగి పార్టీలో కలసిపోయావు. ఏమీ ఎరగనట్టు తండ్రి శవాన్ని అటుపిమ్మట దర్శించి పోలీసులకు రిపోర్టు చేసావు. మిస్టర్ జగదీష్ అద్భుతం నీ తెలివి తేటలు. అందుకివే నా జోహార్లు" అన్నాడు రమేష్.

రమేష్ మాటలు విన్న జగదీష్ మొహం తెల్లగా పాలిపోయింది. చిత్ర ఇది నిజమా అన్నట్టు జగదీష్ వంక సంభ్రమంగా చూడసాగింది. జగదీష్ అంతలోనే తెప్పరిల్లాడు.

"యింకేం! నీకు అంతా తెలిసిపోయిందిగా! ఈ సంగతేదో వాళ్ళకే చెప్పు. మంచి బహుమతి కూడా యిస్తారు" అన్నాడు వెటకారధోరణిలో జగదీష్.

రమేష్ నవ్వాడు "తప్పదంటే ఆ పనే చేద్దాం. ఎటొచ్చీ పోలీసులు నా మాటలు నమ్మరని కదూ నీ ఆలోచన. నాకు తెలుసు. అదే నీ ధీమా. కానీ మైడియర్ ఫ్రెండ్! ఈఫోటో చూస్తే నీ నమ్మకం గాలిలో దూదిపింజలా ఎగిరిపోతుంది" అంటూ ఓ కవరును జేబులోనుండి తీసి జగదీష్ ముందున్న టేబిలుమీద పడేసాడు రమేష్.

జగదీష్ మాట్లాడకుండా కవరు ఓపెన్‌చేసి అందులో వున్న ఫోటో ఒకటి పైకి లాగాడు.

ఫోటోలో లాంగ్‌కోటూ, హేటూ ధరించి వెనక నుండి ఇంచు మించు జగదీష్ పోలికలు కలిగినవ్యక్తి కత్తితో జంబులింగాన్ని పొడుస్తున్నాడు. జంబులింగం మొహంలో బాధ, భయం, ఆశ్చర్యం స్పష్టంగా గోచరిస్తున్నాయి.

జగదీష్ వెర్రివాడిలా గుడ్లప్పగించి తదేకంగా ఫోటో వంకే చూస్తున్నాడు.

రమేష్ నవ్వుతూ "ఫోటో స్పష్టంగా, చక్కగా వచ్చిందికదూ! జపాన్ కెమేరాలే! ఫ్లాష్‌తో పనిలేదు. పాపం! అందుకే నీ నిర్వాకం కెమేరాలో అచ్చవుతున్నా నీకు తెలిసి రాలేదు" అన్నాడు.

జగదీష్ అప్పటికి తేరుకున్నాడు. ఫోటోవంక మరో సారి దీక్షగా చూపి నవ్వుతూ దానిని రమేష్ మీదకు విసిరాడు.

ఆశ్చర్యపోయాడు రమేష్. అర్థం కానట్టు చూసాడు జగదీష్‌వంక.

జగదీష్ విలాసంగా కుర్చీకి జారబడి కాలూపుతూ "ఫోటో బాగానేవుంది. కావాలంటే ముచ్చటగా ఫ్రేమ్ కట్టించి యింట్లో వేలాడగట్టు. అంతేగాని యిలా ముక్కూ మొహం కనపడని ఫోటో పోలీసులకు చూపెడితే ముందు నిన్ను మూసేస్తారు" అన్నాడు.

రమేష్ వుండుండీ ఫకాలున నవ్వాడు. "హోర్నీ! అదా.... నీ ధీమా.... నన్ను మరీ అంత వాజమ్మను చేసెయ్యకుమరి. ఫోటో జాగ్రత్తగా చూసావా? జంబు లింగం నోటిని మూస్తున్న హంతకుడి చేతికివున్నది లెటేస్ట్ సూపర్ ఎలక్ట్రానిక్‌వాచ్! రీసెంట్‌లీ యింపోర్టెడ్ ఫ్రమ్ జపాన్! ఇటువంటివి ఈ వూర్లో ప్రస్తుతం యిద్దరికే వున్నాయి. ఆ యిద్దరిలో ఒకడు జంబులింగం హత్యజరిగిన రోజున విదేశాల్లో వుండగా, రెండోవ్యక్తివి మరి నువ్వే! ఆలోచించుకో ఇక!" అన్నాడు రమేష్ తిరిగి ఫోటో బల్ల మీద వుంచుతూ.

జగదీష్ ఫోటో మీదికి వంగి చూసాడు. రమేష్ చెప్పింది యథార్థమే! వాచీ స్పష్టంగా కనపడుతోంది. ఫేనుగాలి ఝుమ్మంటూ వీస్తున్నా జగదీష్ శరీరమంతటా చెమటలు

పట్టేసాయి. నిస్సత్తువ ఆవహించి కుర్చీలో కూలబడి పోయాడు.

టేబిలు మీదవున్న మంచినీళ్ళగ్లాసును మూతతీసి జగదీష్ చేతికందించాడు రమేష్. మాటాడకుండా నీళ్ళన్నీ గటగట త్రాగేసాడు జగదీష్.

గ్లాసును టేబిలుమీదవుంచి "కమ్‌టు ద పాయింట్, నీ కెంతకావాలి" ఆయాసపడుతూ అడిగాడు జగదీష్.

"ప్రస్తుతానికి ఓ పదివేలు. చిల్లరమల్లర అప్పులతో మరీ చికాగ్గావుంది" నవ్వుతూ అన్నాడు రమేష్.

జగదీష్ బీరువాలో డబ్బుతీసి రమేష్ చేతికిచ్చాడు. రమేష్ "థాంక్స్" అంటూ బయటికి నడిచాడు.

జగదీష్‌కి చిత్ర మొహంలోకి చూడాలంటేసిగ్గుగావుంది. చివరకు ఎలాగో గొంతు పెగల్చుకొంటూ "నన్ను చూడా లంటే అసహ్యం వేస్తుందికదూ!" అన్నాడు నెమ్మదిగా.

చిత్ర ఓ రెండునిముషాలపాటు ఏం మాట్లాడలేదు. తరవాత అంది "అలాంటిదేంలేదు. కాకపోతే బాధ అని పిస్తోంది. అహర్నిశలూ నిన్ను అంటిపెట్టుకు తిరిగే నన్ను నమ్మలేకపోయావు." నిష్ఠూరం ధ్వనించింది ఆమె గొంతులో.

తలవంచుకున్నాడు జగదీష్. "సారీ చిత్రా! ఏదో జరి గింది జరిగిపోయింది. ఈ రహస్యం మనలోనే వుండి పోవాలి" అన్నాడు చిత్ర చేతిని తనచేతుల్లోకి తీసుకుంటూ. తల వూపింది చిత్ర.

5

రమేష్ ఆ తరువాత ఆదేవారంలో మరో రెండుసార్లు వచ్చాడు డబ్బుకోసమని. వచ్చిన ప్రతిసారీ పదివేలకు తక్కువకాకుండా పట్టుకుపోయాడు. తిరిగి వారం ఆఖరున

మరోసారి రమేష్ ప్రత్యక్షమయ్యేసరికి మొహం చిట్లించాడు జగదీష్.

"మాటి మాటికీ నువ్విలా రావడం ఏం బావుండలేదు. మనం ఏదో ఒక పద్ధతిలో దీన్ని తెగతెంపులు చేసుకోక తప్పదు" అన్నాడు జగదీష్ తెగించి.

రమేష్ నవ్వుతూ "నేనూ అదే అనుకుంటున్నాను. పదిసార్లు నీ దగ్గర ముష్టివాడిలా చేయిచాచడం నాకూ ఇబ్బందిగానే వుంది" అన్నాడు.

"ఇంతకూ నీకెంతకావాలి. నీ దగ్గరున్న ఫోటోలు నెగటివ్స్‌తో సహా నాకు అప్పగించెయ్యాలి. ఒకసారి సెటిలయ్యాక మరి నువ్వీచుట్టుపక్కల కనపడకూడదు" అన్నాడు జగదేష్.

"భలేవాడివే! దేనికయినా ఓ హద్దుండదేమిటి!" అన్నాడు రమేష్ బుద్ధిమంతుడిలా రెండు చేతులూ వెనక పెట్టుకొని.

"అది సర్లే! పాయింటుకురా"

"వచ్చేందుకేముందీ నీ హోదా చెప్పాలంటే ఓ ముప్పై లక్షలకుపైమాటే వుంటుంది ప్రస్తుతం. నేను గనక ఆ ఫోటో పోలీసుల కప్పగిస్తే ఇంత దర్జాకూడా కటకటాల వెనక్కిపోయి బియ్యంలో బెడ్డలేరుతూ కూర్చోవాలి నువ్వు. కాబట్టి ఆ లెఖ్ఖన నువ్వు నాకు ఓ ఐదులక్ష లిచ్చుకున్నా తప్పేంలేదు."

"ఐదు లక్షలే!" ఒకేసారి నోరు వెళ్ళబెట్టేసాడు జగదీష్. "అన్యాయం!" అన్నాడు చివరకు గొంతు పెగల్చుకొని.

విచిత్రంగా నవ్వాడు రమేష్! "కన్నతండ్రిని చంపడం కంటేనా!" అన్నాడు వెటకారంగా. జగదీష్ ఏమాటా చెప్ప

కుండా మౌనంగా వుండిపోయాడు.

రమేష్ కొద్దిసేపు వూరుకొని "మరయితే గుడ్ బై మైడియర్ ఫ్రెండ్" అంటూ ద్వారంవేపు రెండడుగులు వేసాడు.

జగదీష్ "ఆల్ రైట్! ఇస్తాను. అందుకు కొంచెం వ్యవధికావాలి" అన్నాడు.

"ఫరవాలేదు. వేచివుండగలను. కానీ ఒక హెచ్చరిక. మోసం చేసేప్రయత్నం చెయ్యకు.చెడేది నువ్వే"అన్నాడు.

జగదీష్ తల వూపుతూ "డబ్బు కుదరగానే నీకు కబురు చెయ్యాలంటే ఎలా మరి. నీ అడ్రసుచెప్పి వెళ్ళు"అన్నాడు.

రమేష్ పెద్దగా నవ్వాడు. "అతి తెలివికిపోకు. నీకు ముందే చెప్పాను. అవసరమనుకున్నప్పుడు నేనే నీతో మాట్లాడతాను" అంటూ బయటకు నడిచాడు రమేష్. నిస్పృహగా నిట్టూర్చాడు జగదీష్.

6

దిల్ కుష్ హోటల్ రూఫ్ గార్డెన్ సర్వీసులో జనం పలుచగా వున్నారు. ఓ మూలగా వున్న లతలకు చేరువలో టేబిల్ దగ్గర కూర్చుంది చిత్ర. పదే పదే చేతివాచీ వంక చూసుకుంటోంది. ఇంతలో ప్రత్యక్షమయ్యాడు జగదీష్. నెమ్మదిగా వచ్చి చిత్ర ఎదురుగా కుర్చీలో కూర్చున్నాడు.

బేరర్ వచ్చాడు ఆర్డర్ కోసమని.

"నువ్వే ఏదో ఒకటిచెప్పు" కుర్చీకి జారబడుతూ అన్నాడు జగదీష్. చిత్ర ఆర్డరు చెప్పింది.

"ఏం అలా వున్నావ్!" జగదీష్ మొహాన్ని పరిశీలనగా చూస్తూ అడిగింది చిత్ర.

ఇదోలా నవ్వాడు జగదీష్ "నువువచ్చి చాలా సేపయి నట్టుంది!" మాట మార్చబోయాడు.

చిత్ర ఆ ప్రశ్నను పట్టించుకోకుండా "ఆ బ్లాక్‌మెయిలర్ గురించేకదూ నీ ఆందోళన" అంది నెమ్మదిగా.

జగదీష్ తల వూపాడు ఔనన్నట్టుగా "వెధవ! పెద్ద మొత్తానికే బేరం పెట్టాడు" అన్నాడు.

"ఎంతకావాలట?"

జగదీష్ నవ్వుతూ ఐదువేళ్ళు చూపించాడు.

ఆశ్చర్యంగా చూపింది చిత్ర. "ఐదులక్షలు!" అంది వుద్వేగంగా. తల వూపాడు జగదీష్.

"అమ్మో అంతడబ్బే!" గుండెలమీద చేయివేసుకుంది చిత్ర "అన్యాయం! ఇంతకూ నీ ఉద్దేశ్యం ఏమిటి?" అంది.

"నా వుద్దేశమూ అదే! మన నిస్సహాయపరిస్థితిని వాడు సొమ్ము చేసుకోవాలని చూస్తున్నాడు. ఇందులో నీ సలహా ఏమిటి?"

"నా సలహా, సహకారాలు యిప్పుడవసరమయ్యాయా?" నవ్వింది చిత్ర.

చిన్నబుచ్చుకున్నాడు జగదీష్. "హాస్యానికిదా సమయం?" అన్నాడు బాధగా.

"సారీ! అలాంటిదేంలేదు. ఇందులో నే నివ్వగల సలహా ఏముంటుంది చెప్పు. మన జుత్తు వాడి చేతుల్లో వుంది. బ్లాక్‌మెయిలర్లు చాలా తెలివిగా వ్యవహరిస్తారు' ఆ డబ్బేదో వాడి మొహానకొట్టి ఇంతటితో వాడి పీడ వదిలించుకోవడం వుత్తమం" అంది చిత్ర.

"నిజమే! కానీ ఒకటా రెండా ఐదు లక్షలు! చేతులారా ఎలా అప్పగించను. అందుకే ఓ ప్లాను వేసాను" అంటూ జగదీష్ నెమ్మదిగా గుసగుసలాడాడు చిత్రకు మాత్రమే వినపడేలా.

అంతా విని "బాగానేవుంది. ఎటొచ్చీ కిరాయి వెధవ

లతో వ్యవహారం. తీరా ఏ పొరపాటు జరిగినా కాగే పెనం నుండి కాలే మంటల్లో దూకినట్టుంటుంది పరిస్థితి." అంది చిత్ర.

"మరేం ఫరవాలేదు. వాడికి ఐదులక్షలు ముట్టజెప్పే బదులు వీళ్ళ మొహాన పాతికవేలు పడేస్తే వ్యవహారం సెటిలయిపోతుంది" నవ్వుతూ చెప్పాడు జగదీష్.

"నీ ఇష్టం" అంది చిత్ర. ఇంతలో ఆర్డరు తెచ్చాడు బేరర్. మాటలు వదిలి తిండిలోపడ్డా రిద్దరూ...

7

ప్రశాంత వాతావరణం. లీలగా వినవచ్చే సముద్ర కెర టాల హోరుతప్ప మరే సవ్వడీ లేదక్కడ. తీరం పొడ వునా వేయబడిన రోడ్డు బాగా పాతదయి అడుగడుక్కీ గుంటలు పడివుంది.

జగదీష్ చేతిలో సూట్‌కేసుతో ఆ గోతుల్లో ఎక్కడా పడకుండా నెమ్మదిగా, జాగ్రత్తగా అడుగులు వేస్తున్నాడు.

రోడ్డుకు చేరువలో వుందొక బ్రహ్మాండమయిన పురా తన భవంతి. గోడలు నల్లబారి ఎక్కువ భాగం శిథిలమయి పోయింది. విరిగి పడివున్న కాంపౌండును దాటి భవనాన్ని సమీపించాడు జగదీష్. భవనం చుట్టూ రకరకాల పిచ్చి మొక్కలు పెరిగివున్నాయి.

రమేష్ ఫోనులో చెప్పిన ప్రకారం జగదీష్ సాయం త్రం ఆరింటికి రావాల్సివుం దక్కడికి. కానీ జగదీష్ ఓ గంట ముందే భవనం చేరాడు. నాచు పట్టివున్న మెట్లను జాగ్రత్తగా ఎక్కుతూ వెనక్కి తిరిగి చూసాడు జగదీష్.

కాంపౌండు చేరువలో బాగా పెరిగివున్న గడ్డిని కొడ వళ్ళతో కోస్తూ గంపల కెత్తుతున్న వ్యక్తు లిద్దరు కనిపిం చారు. మాసిన పంచెలు బిగగట్టి తలకు తువ్వాళ్ళు చుట్టారు.

కాయకష్టం చేసుకు బ్రతికే రైతులకుమల్లే కండలు తిరిగి బలంగా వున్నారిద్దరూ. "నీకేం ఫరవాలేదు" అన్నట్టు కళ్ళతోనే సైగచేసారు. జగదీష్ తేలిగ్గా వూపిరి పీలుస్తూ భవనంలో అడుగు పెట్టాడు.

వరండా దాటి విశాలమయిన హాల్లోకి ప్రవేశించాడు. సినిమాల్లో కనపడే తక్కువ స్థాయి విలన్ స్థావరంలా వుంది. పైకప్పులు చాలామేర చిల్లులుపడి గాలీ వెలుతురూ లోనికి ప్రవేశిస్తున్నాయి. హాలు చుట్టూ చిల్లర మల్లర గదులు చాలా వున్నాయి.

ఎటు తిరిగినా బూజూ, సాలెగూళ్ళు, రాయీ రప్పా కుప్పలుగా వుంది. అటూ యిటూ పరుగులుతీసే పంది కొక్కులూ గబ్బిలాలూ లెక్కకు మించివున్నాయి. కడుపులో ప్రేవుల్ని కలియదిప్పుతూ ఆదో రకమయిన దుర్వాసన!

జగదీష్ హాలు మధ్యలోవున్న ఒక పెద్ద రాతిమీద కూర్చున్నాడు. సూట్‌కేసును మరో రాతిమీద వుంచాడు. భవనం ప్రవేశ ద్వారానికి అభిముఖంగా కూర్చొనివున్నాడు జగదీష్. భవనం వెలుపల గడ్డికోస్తున్న వ్యక్తులు మరో పావుగంట గడుస్తూనే నెమ్మదిగా భవనంలో ప్రవేశించడం గమనించాడు జగదీష్.

ఐదు నిముషాలు గడిచాయి. జగదీష్ చెవులకు చిటికెలాంటి చప్పుళ్ళు కొద్దిసేపు వినపడ్డాయి. "నీకు అండగా మేము మా డ్యూటీలో వున్నాం" అనే సిగ్నల్ అది. చిన్నగా నవ్వుకున్నాడు జగదీష్. నగరంలో పేరుమోసిన అలంపూర్ కిరాయి గూండాలు వాళ్ళు. మధ్యాహ్నవేళకు బేరం కుదిరింది. రాత్రి పదిగంటలవరకూ వాళ్ళు తన కింద వుంటారు. ఈ మధ్యకాలంలో తనేం చెప్పినా

వాళ్ళకది వేదవాక్కు. పాకలు తగలెట్టమన్నా పీకలు తెగ్గొట్టమన్నా చిటికెలో చేసుకు వస్తారు.

సమయం ఆరు కావస్తోంది. హాలు మసక మసకగా కనిపిస్తోంది.

"గుడ్! వచ్చావన్నమాట!"

త్రుళ్ళిపడుతూ వెనక్కి తిరిగాడు జగదీష్. రమేష్ భవనం లోపలినుండి వచ్చినట్టున్నాడు. అంటే అతడు తన కన్నా ఓ అడుగు ముందే వున్నాడన్న మాట! "బ్లాక్ మెయిలర్లు చాలా తెలివయినవాళ్ళు" చిత్ర మాటలు జ్ఞాపకం వచ్చాయతనకి.

రమేష్ చేతిలో సిద్ధంగావుంది పిస్తోలు. జగదీష్ గుటకలు మింగాడు.

"డబ్బు తెచ్చావా?"

జవాబుగా సూట్ కేస్ చూపించాడు జగదీష్.

"వెరీ గుడ్! ఆ సూట్ కేస్ అక్కడేవుంచి ఓ ఐదడుగులు వెనక్కి నడు."

జగదీష్ లేచి నిలబడి వెనక్కి నడిచాడు నెమ్మదిగా. రమేష్ ముందుకొచ్చి సూట్ కేస్ తెరిచాడు. అతడి చేతిలో పిస్తోలు మాత్రం నిశ్చలంగా జగదీష్‌నే చూస్తోంది. సూట్ కేస్‌లో వరుసగా పేర్చబడిన నోట్లకట్టలు చూసి తృప్తిగా నవ్వాడు రమేష్. కట్టలు లెక్కపెట్టి తిరిగి మూత వేసేసాడు.

"ఫోటోలు ఏవీ?" ప్రశ్నించాడు జగదీష్.

"ఫోటోలు ఇచ్చేది లేదు!" నవ్వుతూ చెప్పాడు రమేష్.

"మోసం" అరిచాడు జగదీష్! కంగారుగా అటూ యిటూ చూసాడు. ఏమయ్యారు వెధవలు? ఈసరికి వాళ్ళు రంగంలోకి రావాలి. ఐదు లక్షలతోబాటు ఫోటోలకూ నీళ్ల

వదులుకోవలసి రావడం జగదీష్‌కి పిచ్చెక్కిపోతోంది.

"ఎవరిది మోసం?" తీవ్రంగా అన్నాడు రమేష్ "మన ఒప్పందం ప్రకారం డబ్బుతో నువ్వొక్కడివే రావాలి. కానీ నన్ను దెబ్బతీయాలని రౌడీలను నియమించావ్" చప్పట్లు చరిచాడు రమేష్.

కాళ్ళూ చేతులూ కట్టబడిన అలంపూర్ రౌడీల నిద్దరినీ మోసుకొచ్చి జగదీష్ ముందు పడేసారో నలుగురు దున్నపోతుల్లావున్న వ్యక్తులు. జగదీష్ ఆ దృశ్యాన్ని చూసి నీరు కారిపోయాడు.

సరిగ్గా అదే సమయానికి సాయుధులయిన నలుగురు వ్యక్తులు వెంటరాగా ముందునుండి హాల్లో ప్రవేశించింది చిత్ర. ఆమె చేతిలో ఒక రివాల్వరు వుంది.

చిత్ర కనిపించగానే జగదీష్ మొహం ఆనందంతో విప్పారింది. ఆనందం పట్టలేక పెద్దగా అరుస్తూ "హేట్స్ ఆఫ్ టూయూ చిత్రా! సరిగ్గా సమయాని కొచ్చావ్!" అన్నాడు జగదీష్.

"షటప్! అరిచావంటే నాలుక పీకేస్తాను" జగదీష్ వంక వురిమిచూస్తూ గద్దించింది చిత్ర.

నిర్ఘాంతపోయాడు జగదీష్!

"చిత్రా!" గొణిగాడు జగదీష్. నూతిలోనుండి విన వచ్చినట్టుందా స్వరం. "చిత్రా! నువ్వేనా? నువ్వు.... నువ్వు ఏమిటిదంతా...." నమ్మలేకపోతూ అన్నాడు జగదీష్.

విలాసంగా నవ్వింది చిత్ర! "అవును! నేనే! ఇదంతా నీకు ఆశ్చర్యంగా, నమ్మలేని విధంగా వుంది కదూ. అయినా ఇది ముమ్మాటికీ నిజం.

"నిన్నూ నీ అందాన్నీ చూసి కాదు, నేను నీ వెంట

పడింది. నిన్ను పెళ్ళిచేసుకొని ఐశ్వర్యవంతురాలిని కావాలని ఆశపడ్డాను. కానీ నువ్వు అవసరానికి నన్ను వాడుకుంటూ వచ్చావు. తెగించి నేనే పెళ్ళివూపెత్తినా అటువంటిదేం వుండదన్నావు. కేవలం సరదాలకు షికార్లకు మించి మన పరిచయం పెరగదన్నావు. అయినా గత్యంతరం లేక సమయంకోసం ఎదురుచూస్తూ ఇన్నాళ్ళూ నీవెంట తిరిగాను.

"ఆస్తికోసం నీ తండ్రినిచంపే వుద్దేశంలో నువ్వున్నట్టు ఒకరోజు రాత్రి నిద్రలో నీ కలవరింతల మూలంగా తెలుసుకున్నాను. ఆనాటినుండీ అహర్నిశలూ నిన్ను అంటిపెట్టుకునే వున్నాను. ఈలోగా రమేష్ నాకు తోడయ్యాడు.

"ఆరోజు హోటల్‌లో నేను మైకంలో వున్నానని భావించి టాయిలెట్ రూమ్ కెళతాననే వంకతో బయట పడ్డావు. కానీ నేను నిన్ను అనుసరించాను. జంబులింగాన్ని నువు హత్య చేస్తుండగా మినీ కెమేరాతో ఫొటో తీసి ప్రక్కకు తప్పుకున్నాను. తిరిగి నీకంటే ముందుగానే హోటల్ చేరుకున్నాను. ఫొటోలు రమేష్‌కి చేర్చాను. అదీ సంగతి.

"ఇప్పుడు ఈ అయిదు లక్షలతోబాటు మరో అయిదు లక్షలు నువ్వు చెల్లిస్తేనే నీకు ఫొటోలు దక్కేది. గుడ్‌బై జగదీష్!" అంటూ చిత్ర రమేష్‌కేసి తిరిగి "పదండి పోదాం" అంది.

జగదీష్ "వంచకీ" అని అరుస్తూ పట్టరాని ఆవేశంతో చిత్రమీదకు దూకబోయాడు.

రమేష్ "ఫూల్! అనుభవించు" అంటూ చేతిలో రివాల్వర్ ట్రిగ్గర్ నొక్కబోయాడు. సరిగ్గా అదే సమయానికి ద్వారం దగ్గర పెద్దగా "ధాం"మనే చప్పుడు వినపడి రమేష్

చేతిలో రివాల్వర్ ఎగిరిపోయింది. అందరూ అదిరిపడుతూ ద్వారం దిక్కుగా చూసారు.

ఇన్‌స్పెక్టర్ షరీఫ్ చేతితో పొగలు కక్కుతూన్న రివాల్వర్ ధరించి ద్వారందగ్గర నిలబడివున్నాడు. షరీఫ్ ముందుకివస్తూ "ఖబడ్దార్! ఎవరూ కదలొద్దు" అన్నాడు. బిలబిలమంటూ అన్ని ద్వారాలగుండా పోలీసులు లోనికి ప్రవేశించారు.

హాల్‌లోవున్న మనుషు లందరినీ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు.

పోలీసుల రాకను ఏమాత్రం వూహించని జగదీష్, రమేష్, చిత్ర ఆశ్చర్యంతో నోళ్ళు వెళ్ళబెట్టడం గమనించి ఇన్‌స్పెక్టర్ షరీఫ్ నవ్వుతూ—

"మిష్టర్ జగదీష్! ప్రారంభంలో నీవెంత తెలివిగా అబద్ధాలాడి మమ్మల్ని మోసగించాలని చూసినా జంబులింగం హత్యవలన ఏ కోణంనుండి చూసినా లాభపడేది నువ్వేనని వూహించి, నీమీద నిఘా వుంచాం.

"నువు అలంపూర్ కిరాయి రౌడీలను స్వయంగా కలవడం మా వూహకు మరింత బలాన్ని చేకూర్చింది. ఈ రోజు నువ్వు బ్యాంకునుండి పెద్ద మొత్తంలో డబ్బు డ్రా చేయడం, ఆ డబ్బుతో ఇక్కడకు రావడం అంతా గమనిస్తూనే వున్నాం.

"నువ్విక్కడ ఎవరినో కలుసుకోబోతున్నట్టు గ్రహించి తొందరపడక వేచివున్నాం. సరయిన సమయం చూసి, మీ అందరి కథలూ విన్నమీదట రంగంలోకి దిగాం.

"మీ అందరి అనుమానం తీరిపోయిందిగా. మరి నడవండిక" అన్నాడు. □

సీరియల్

ఏ.వీ.మోహన్రావ్

(గత సంచిక తరువాయి)

41

శరీరంలోని శక్తినంతా కూడగట్టుకొని, మేఘనాధ్, మంగళ, సంచిని వెతుక్కుంటూ, సీళ్ళవాలు వెంట ఈదు కుంటూ ముందుకు పోసాగారు. చెరొకవైపు గుడ్లప్పగించి

చూడసాగారు.

సాయంత్రం కావచ్చింది. తెల్లగా వున్న వెలుగు, మెల్లగా చీకటి నలుపు పులుముకోవడంతో, ఇద్దరికీ దృష్టి తగ్గిపోయింది.

ఇద్దరూ ఒకచోట ఆగారు.

"చిత్రంగా వుంది. దాదాపు మూడుమైళ్ళపైనే వచ్చాం. అయినా సంచి కనుపించటం లేదు!" అన్నాడు మేఘనాధ్.

"అది ఇంతదూరం వచ్చిందనుకోను. మధ్యలో దేనికన్నా తగులుకొని వుండివుంటుంది. మనం చూడ్డంలో పొరపాటు జరిగిందేమో?" అంది మంగళ.

"నావరకు నేను బాగానే చూశాను. మరి నీ సంగతి?" అంటూ అనుమానంగా చూశాడు.

"నేనూ చూశాను బాగా." అంది దృఢంగా.

"ఇప్పుడేం చేద్దాం?" అడిగాడు మేఘనాధ్. మంగళ జవాబు చెప్పలేదు.

ఇద్దరి మనసుల్లో ఒకేరకం ఆలోచనలు మెదులుతున్నాయి. చేతికి దొరికిన అపూర్వమైన వస్తువు, తమ కళ్ళముందే చేయిజారిపోవడం, విధిలిఖితమో, విపరీతమో, దురదృష్టమో అర్థంగాలేదు వాళ్ళకు. ఈ విషయం దాదాకు, మిగిలిన వాళ్ళకు చెప్తే వాళ్ళంతా తమ ఇద్దర్నీ, అసమర్థులుగా లెఖ వేస్తారేమో ననిపించింది.

"ఇంకా ముందుకు వెళ్దామా?" అడిగాడు మేఘనాధ్.

"ఇంకా మైలుపోతే, అక్కడ్నుంచి రెండువందల గజాల కిందకు జలపాతంలా పడుతుందో చిన్న ఏరు. దొరికితే ఆ వస్తువు ఈలోగా దొరకాలి. లేకుంటే మన ప్రయత్నం వ్యర్థం" అంది మంగళ.

ప్రత్యుత్తరం చెప్పకుండా మేఘనాధ్ ముందుకు దూకి

ఈదకు పోసాగాడు. మంగళ అతన్ని అనుసరించింది. ఇద్దరూ కళ్ళల్లో వత్తులు వేసుకుని అటూ ఇటూ చూసు కుంటూ ముందుకు పోసాగారు. పదిహేను నిమిషాలకు అది జలపాతంలా మారే ప్రదేశానికి చేరారు.

సంచీ జాడలేదు.

ఇద్దరిలో నిరాశ, నిస్పృహ, చోటుచేసుకున్నాయి. అంతదూరం ఈదడం, ఏకాగ్రతతో అటు ఇటు చూచు కుంటూ రావడంతో శరీరంతోపాటు, నరాలు కూడా అలసి పోయాయి. ఇద్దరూ ఒడ్డుకు చేరుకున్నారు. వెల్లికింతలా తడిగుడ్డలతోనే పడుకున్నారు.

మేఘనాథ్ మనస్సు వికలమైపోయింది. అసలీ ప్రయాణం అర్థంలేకుండా ఆరంభించినట్లనిపించింది. ఇంత కష్టపడి తీరా కాంచనశిఖరం చేరాక, అక్కడ అసలు ఆ 'నిధి' వుందో లేదో? నన్న అనుమానం కూడా కలిగింది.

మంగళ మాట్లాడకుండా మౌనంగా వుండిపోయింది.

"ఇక్కడినుంచి కాంచనశిఖరం ఎంతదూరం వుంది?" అడిగాడు మేఘనాథ్.

"పదిమైళ్ళ దూరం వెళ్తే ఎండలో తెల్లగా మెరిసి పోతూ నీలంరంగు ఆకాశానికి అతుక్కుని వున్నట్లు కనిపి స్తుంది. దూరం ఎంత వుంటుందో, నాకు తెలీదు. అంత పెద్ద మంచుకొండలో మీరు వెతుకుతున్న నిధి ఏ ప్రాంతంలో వుందో, ఎలా వెళ్ళాలో, తెలియంది, ఆ కొండలో తిరిగి వెతికేందుకు ఒక జీవితకాలం చాలదనుకుంటాను" అంది మంగళ.

"నువ్వన్నది నిజం. మనకు ఆ సంచీ దొరక్కున్నా, లేదా దారి మరెవరిద్వారానన్నా తెలియకున్నా, ఈ ప్రయాణం

ఇంతటితో ఆపి, వెనక్కి తిరిగి వెళ్ళడం మంచిదనిపిస్తూంది" అన్నాడు మేఘనాధ్.

"తిరిగి వెళ్ళిపోతావా" నిరుత్సాహంగా, దీనంగా అడిగింది మంగళ.

"వెళ్ళక తప్పదుగా?"

"తప్పదు. కానీ.... నన్ను ఇక్కడ వదిలేసి వెళ్తావా."

"నిన్నా....నా వెంట తీసుకెళ్తాను" అన్నాడు మేఘనాధ్.

మంగళ అతని దగ్గరకు జరిగి ఎడంచెయ్యి గుండెలమీద వేసి దగ్గరగా లాక్కొని గట్టిగా అదుముకుంది.

మేఘనాధ్ ఆమె తల నిమురుతూ ఆమెకు తన హృదయంలోని ఆప్యాయతను తెలియజేశాడు.

కాలం స్తంభించిపోయింది. గాలి ఆగిపోయింది. ఇద్దరూ ఊహాలోకాల్లో విహరించసాగారు. వారికి తెలీకుండానే చుట్టూ చీకటి ఆవరించింది. ఉన్నట్టుండి చల్లగా వున్న గాలి, వెచ్చగా తగిలింది. ఇంకొంతసేపటికి, పెనుగాలిగా మారి, వాతావరణాన్ని పూర్తిగా వేడెక్కించింది.

తక్కున లేచి కూర్చున్నాడు మేఘనాధ్.

మంగళ కూడా లేచి "ఏమైంది!" అనడిగింది.

అందాకా చల్లగా వీచిన గాలి విచిత్రంగా నిముషంలో వేడిగా మారిపోవడం గురించి చెప్పాడు. ఇద్దరూ లేచి కాస్త ముందుకు నడచి చూచారు. ఆకాశాన్నంటుతున్న ఎర్రని మంటలు దూరంగా కనుపించాయి. వందలమైళ్ళ వేగంతో తమవైపే. తమని తరుముకుంటూ రాసాగాయి.

"అవే అడవిమంటలు! మనం ప్రమాదంలో వున్నాం. వెంటనే ఏటివైపు పరుగెత్తాలి" అంటూ రెండోమాట చెప్పకుండా, అతని చెయ్యి అందుకుని, వెనక్కి పరు

గెట్టింది మంగళ. ఆమెను అనుసరించి పరుగెత్తసాగాడు మేఘనాథ్. దట్టంగా వున్న పొదవాటి చెట్లను తప్పించుకుంటూ, కాళ్ళకు అడ్డంపడుతున్న ఎండిపోయిన పొదల్ని, అడ్డుతీసుకుంటూ పరుగెత్తసాగారు. అలా పరుగెత్తడంలో మేఘనాథ్ తలకు ఒక చెట్టు మొదలు తగిలింది. తలదిమ్మ తిరిగిపోయింది. కళ్ళముందు తెల్లటి వెలుగు మెరుపులా కనుపించి మరుక్షణంలో చీకటి క్రమ్ముకుంది. నేలకుజారి పోయాడు.

అది గమనించిన మంగళ ఠక్కున ఆగిపోయింది. గుండెలు దిగజారిపోయాయి. శరీరంలో నిస్సత్తువ ఆవరించింది.

"నాధ్! నాధ్! ఏమైంది?? ఏమైంది??" అంటూ ఆత్రతగా అతన్ని అటూ ఇటూ కదిపింది.

అతనిలో చలనంలేదు. నిర్జీవ ప్రతిమలా పడివున్నాడు. తలెత్తి చూపింది. మంటలు వేగంగా తమవైపు దూసుకు రావడం కనుపించింది. తలెత్తి పైకి చూపింది.

చెట్టుకొమ్మకు వ్రేలాడుతూ అందాకా తామిద్దరు తడుముకుని వెతుక్కొంటూ వెళ్ళిన సంచీ కనుపించింది. అది ఏ కోతో కొండముచ్చో, దొరకబుచ్చుకుని, అక్కడ తెచ్చి పెట్టివుంటుందని భావించింది. ప్రతికాలం ఆమెలో ఆనందం, ఉత్సాహం కలిగాయి. వెనువెంటనే మేఘనాథ్ పరిస్థితి గుర్తుకొచ్చి, అధైర్యం అలుముకొంది.

మంగళ మనోఫలకం పైకి రకరకాల పథకాలు పులుముకొచ్చాయి. వడివడిగా ఆలోచించింది. అంతకుముందు తండ్రి వద్ద పొందిన తర్ఫీదుతో గుండె దిటవు చేసుకుంది. ఠక్కున చెట్టెక్కసాగింది.

నాలుగు అంగల్లో చెట్టు మొదలు చేరుకుంది. కొమ్మ

పైకెక్కి సంచీ దొరకబుచ్చుకుంది. దాన్ని నడుముకు దోపుకొని, ఆ పచ్చికొమ్మను పట్టుకొని క్రిందికి వ్రేలాడింది. అది గట్టిగా వుండటంతో విరిగి రాలేదు. వేడిగాలికి చెంపల్లో వున్న రక్తం ఎండిపోయినట్లవుతూండటం గమనించింది.

కొమ్మను విరిచే ప్రయత్నంలో రెండుమూడుసార్లు, దాన్ని పట్టుకొని బలంగా క్రిందకూ పైకీవూపింది. పెళ్ళున కొమ్మ విరిగింది. దాంతోపాటు, మంగళకూడ నేలపైన పడింది. ఆ కొమ్మ ఆకులవైపు సరిచేసి, మేఘనాథ్‌ను దాని పైన పడుకోపెట్టింది. మొదలువైపు రెండు చేతుల్తో గట్టిగా పట్టుకొని, నదివైపు బరబర ఈడ్చుకుని పోసాగింది.

అడ్డంగా వచ్చే తోపులు, చెట్ల మొదళ్ళు, తప్పించుకుంటూ, శరీరంలో వున్న బలాన్నంతా కూడగట్టి, తరుముకొస్తున్న మంటల్ని తప్పించుకోవాలన్న తపనతో, వేగంగా ఆ కొమ్మను లాక్కుపోయింది మంగళ. అతి కష్టంమీద అడవి మంటలకు దూరంగా నదివొడ్డుకు చేరింది.

మేఘనాథ్ శరీరాన్ని నీళ్ళలో తడిపివేసింది. చేతుల్లోకి నీళ్ళు తీసుకొని అతని మొహంపై చల్లింది. తను కూడా మొహం కడుక్కుంది.

ఐదు నిమషాల తర్వాత "అమ్మా! అబ్బా!" అంటూ కదిలాడు మేఘనాథ్. మెల్లగా కళ్ళు తెరిచాడు. చుట్టూ చీకటి. చేత్తో నుదురు రాచుకుని, మెల్లగా లేచి కూర్చున్నాడు. అతని ప్రక్కనే వంగి కూర్చున్న మంగళ "ఇప్పుడెలా వుంది?" అడిగింది.

"అసలేమైంది మంగళా?" అడిగాడు మేఘనాథ్.

జరిగిందంతా చెప్పింది.

విని, ఆమెకేసి కృతజ్ఞతాపూర్వకంగా చూశాడు.

ప్రాణాలకు సైతం తెగించి తన్ను కాపాడిన మంగళపై అతనికి అనురాగాభిమానాలతో పాటు, గౌరవం కూడా కలిగింది.

"ఈ ప్రాణాల్ని ఇంకోమారు రక్షించావన్న మాట!" అన్నాడు మేఘనాధ్.

"ఆ ప్రాణాలు నీవా? కావు! నావి. అందుకే రక్షించు కున్నాను" అంది మంగళ. అతనిపై ఆమెకు గల అపార మైన అనురాగం తెలియజేసేందుకు అంతకన్నా ఎక్కువ మాటలు అవసరం లేకపోయింది.

42

"ఇదీ జరిగింది!" అంటూ చెప్పాడు దాదాకు మేఘనాధ్. కానీ కాలావేషంలో వున్నదీ 'మంగళ' ని గాని, ఆమె స్త్రీ యనిగానీ చెప్పలేదు. మంగళ మామూలుగా మగవేషం లోనే వుండిపోయింది.

సంచీని తీసుకొని దాదా వెలుగులో పరిశీలించాడు. తాను మకాం వేసిన గుడి ప్రాంతంనుండి కాంచనశిఖరానికి ఎలా వెళ్ళాలో తెలిపే మార్గమది. అరగంటకాలం బాగా పరిశీలిం చాడు దాదా. అంతా మౌనంగా, ఆతృతతో దాదా ఏం చెప్తాడోనని ఎదురుచూస్తూ చుట్టూ కూర్చున్నారు.

"మనకు కావలసిన సమాచారం లభించింది!" అన్నాడు దాదా!"

ఆ మాటతో అందరి మొహాలు వెలగిపోయాయ్.

"ఇక్కడ్నుంచి ఎలా వెళ్ళాలి" అడిగింది అపర్ణ.

"మధ్యలో యింకా ఏమేం గండాలు గట్టెక్కాలి?" కృష్ణమూర్తి వాకబు చేశాడు.

"ఈ అడవిలో ఆరుక్రోసుల దూరం నడవాలి. ఆ తర్వాత పెద్ద నది వస్తుంది. దాన్ని దాటాలి. అక్కడ్నుంచి ఉత్త

రంగా రెండు క్రోసులు నడిస్తే, కాంచన శిఖరం వద్దకు చేరుకుంటాం. అక్కడ్నుంచి ఎలా నిధివద్దకు వెళ్ళాలో యిందులో గుర్తుపెట్టి వుంది." అన్నాడు దాదా.

"అబ్బా ఇంకా చాలాదూరం వుందన్నమాట." అంది కాలా వేషంలో వున్న మంగళ.

"ఎంతదూరమైనా సరే! వెనక్కిపోయే ప్రసక్తి లేదు. ముందుకు పోవాల్సిందే!" అన్నాడు మేఘనాధ్.

"అడవి అంతా మంటల్లో వుంది. అవి చల్లారేందుకు రెండు రోజులు పట్టవచ్చు. అయినా మనం దాని గుండా వెళ్ళి దాటిపోవడం కష్టం. కాబట్టి రెండురోజుల తర్వాత మనం బయలుదేరడం మంచిదేమో?" అన్నాడు దాదా.

"మంటలు ఆరిపోయాక పోవాలనుకుంటే అనవసరంగా కాలయాపన జరుగుతుందేమో?" కృష్ణమూర్తి అన్నాడు.

"చెట్ల మొదళ్ళు కాలికాలి. నిప్పుకణికల్లా మాడి సెగ గాలులు విసురుతుంటే. మనలోనున్న నీరు, రక్తం మొత్తం ఇగిరిపోయి దారి మధ్యలోనే శవాలుగా మారి పోతాం. అందరికీ ఈ ప్రయాణం త్వరగా చేద్దామనే వుంది. కానీ పరిస్థితుల్ని కూడా గుర్తించాలి!" అన్నాడు మేఘనాధ్.

"అబ్బాయిలు ఆవేశపడకండి! ఈ జట్టుకు నాయకుడిగా నా నిర్ణయం విన్నారుగదా! అన్నీ ఆలోచించే నేను అలా చెప్పాను. మరో రెండ్రోజులు విశ్రాంతి తీసుకుని ఆ తర్వాత బయలుదేరుదాం. ఇక మీమీ పనులు మీరు చూసు కోండి!" అన్నాడు దాదా. తర్వాత సంచీని జాగ్రత్తగా మడిచి, కోటుజేబులో దోపుకున్నాడు.

అపర్ణ వంటపని చూసేందుకు వెళ్ళింది. కిశోర్ ఆమెకు సాయం చెయ్యసాగాడు.

అపరాధ పరిశోధన పోటీ-203

ఈ క్రింద కొన్ని ప్రశ్నలు, వాటి పక్కనే జవాబులు కూడా ఉన్నవి. మీరు సరియైనదని వూహించిన జవాబును, నెంబరు వారీగా ఒక (పోస్టుకార్డు సైజు) తెల్ల కాగితంపై వ్రాసి, దానితో రూ. 1.00 విలువగల పోస్టలు స్టాంపులు జతపరచి పంపండి. ఆల్ కరక్టుగా పంపిన వారికి ఒక్కొక్కరికి ఒక ఏడాదిపాటు పత్రిక లేదా సప్లిమెంట్ ఉచితంగా పంపుతాము.

దీనిలో ఎవరైనను పాల్గొనవచ్చును. ఒక్కొక్కరు మూడు కూపన్లకు మించి పంపరాదు. ప్రతి కూపనుకీ రు. 1-00 పోస్టలు స్టాంపులు జతపరచాలి. స్టాంపులు వేటికి అతికించకూడదు. ప్రతి కూపను వెనుక మీ పూర్తి చిరునామా, హోం. డె. సభ్యులైతే వారి నెంబరు కూడా స్పష్టంగా వ్రాయాలి.

మీ జవాబులు 5-6-'85 తేదీలోగా మాకు చేరాలి. ఫలితాలు ఆగష్టు '85 నెల సంచికలో ప్రచురిస్తాము. *

1. గుజరాత్ రాష్ట్రంలో రగిలిన మరో అగ్నిజ్వాల—?
   (రిజర్వేషన్ల వ్యతిరేక ఉద్యమం, పోలీస్ దమనకాండ)
2. మే నెల ఎండలు—?
   (బండరాళ్ళు, రోకటి పోట్లు)
3. ఇక్కడ శవయోగాలు జరుగుతున్నట్లుగా పుకార్లు వ్యాపించాయి—?
   (శాంతి కుటీరం, శాంతినికేతన్)
4. ఇటీవల సంచలనం కలిగించిన తెలుగు చలనచిత్రం—?
   (మయూరి, చిరంజీవి)
5. ఈ దేశాలలో నేరస్థులకు శిక్షలు కఠినంగా వుంటాయి—?
   (ముస్లిం దేశాలలో, కమ్యూనిస్టు దేశాలలో)

కాలా. మేఘనాథ్, మంటకు దూరంగావెళ్ళి కూర్చు న్నారు. దూరంగా వేసిన నెగడు ఖణఖణ మండుతూంది.

"ఆ నిధి వెలికి తీశాక అందులో అందరికీ సమానంగా భాగం ఇస్తారా?" అడిగింది మంగళ.

"ఏం? అనుమానంగా వుందా ఇవ్వరని?"

"అది కాదు. మీరంతా ముందునుండే వచ్చినవాళ్ళు. నేను మధ్యలో మీతో చేరాను."

"జ్వాలా దాదా చాలా మంచివాడు. ఆయనకు డబ్బు మీద వ్యామోహంలేదు. మా బలవంతంతో బయలుదేరాడు. ఆయనకుచెప్పి నీక్కూడా భాగం ఇచ్చే ఏర్పాటుచేస్తాను." అన్నాడు మేఘనాద్.

"నా కివ్వకున్నా ఫరవాలేదు. మీ కిస్తారుగా. మనం ఇద్దరం బతికేందుకు అది చాలు." అంది మంగళ.

"అలా అనుకుంటే నీకు లేనిపోని అనుమానాలు ఎందుకు?"

"నేను చాలా కథలు విన్నాను. డబ్బు దొరికేదాకా మనుషులు ఒక రకంగా వుంటారు. తీరా దొరికాక, రాక్ష సుల్లా మారి ఒకర్నొకరు చంపుకునైనా, దొరికిన మొత్తం తామే అనుభవించాలనుకుంటారు. దాంతో రక్తం చిందు తుంది. అలాంటి పరిస్థితి రాకుండా చూసుకోవాలి!" అంది మంగళ.

"నీ ఉద్దేశ్యం నా కర్థంకాలేదు!" అన్నాడు మేఘనాథ్.

"వీళ్ళల్లో ఎవరైనా తెలివిమీరి, మిగిలిన అందర్నీ చంపి, మొత్తం నిధి మూటకట్టుకొని వెళ్దామన్న ప్లానులో ఉన్నారేమోనన్న భయంతో చెప్పాను. అందుకే నేను నిన్ను కంటికి రెప్పలా కాపాడుకోదలచుకున్నాను. ఈ క్షణంనుంచి నీకు నేను అంగరక్షకురాల్ని. జట్టులో

శ్రీ వెంకటేశ్వర వారి నవలలు

ఏప్రియల్ విడుదలైనవి!

1)	టెర్రర్! టెర్రర్!	శ్యాంబాబు	20-00
2)	ఎవరికోసం ఈ త్యాగం	కొమ్మూరి సాంబశివరావు	16-00

త్వరలో విడుదల!

1)	మాయదారి లోకం	శ్యాంబాబు
2)	మృత్యుదీపం	N.S. నాగిరెడ్డి

మా వద్ద స్టాకులో వున్న నవలలు

1)	లిటిల్ మాష్టర్	శ్యాంబాబు	16-00
2)	అంగారక (అపన సీరియల్)	శ్యాంబాబు	18-00
3)	అంతరిక్షయాత్ర (అపన సీరియల్)	రమణశ్రీ	18-00
4)	లవ్‌మ్యాజిక్	శ్యాంబాబు	16-00
5)	ఇది ఎలా జరిగింది?	N.S. నాగిరెడ్డి	16-00
6)	రుద్రనేత్రం	N.S. నాగిరెడ్డి	15-00
7)	ప్రేమవాహిని	N. భారతీదేవి	15-00
8)	మరో ప్రేమబంధం	N. భారతీదేవి	14-00
9)	వలలో చిక్కిన వనిత	కొమ్మూరి సాంబశివరావు	15-00
10)	అర్పణ	N. భారతీదేవి	14-00

వివరములకు:—

శ్రీ వెంకటేశ్వర పబ్లికేషన్స్

మాజేటివారి వీధి, గాంధీ నగర్,

విజయవాడ – 520 003.

ఎవరైనా నీకు హాని తలపెడుతున్నట్లు తోస్తే, కాల్చి కూల్చి వేస్తాను. అది ఎవరైనా సరే! చివరకు జ్వాలా దాదా కూడా ఇది వర్తిస్తుంది!" చెప్పింది మంగళ.

"ఆవేశపడకు. ఆడవాళ్ళు ప్రేమించడం మొదలుపెడితే దానికి అవధులుండవంటారు. నువ్వు తొందరపడకు. నీకేదైనా అనుమానం వస్తే ముందు నాకు చెప్పు." అన్నాడు మేఘనాధ్.

"అలాగే!" అంది మంగళ.

దూరంగా నవ్వు వినిపించింది.

తల త్రిప్పి చూశారు ఇద్దరూ.

అపర్ణ వంగి వంటపని చూసుకుంటోంది. ఆమె పైకి వంగి వెనుకనుంచి సన్నపుల్లతో వీపుమీద గీస్తున్నాడు కిశోర్.

"సిగ్గులేని జంట!" అన్నాడు మేఘనాధ్.

"ఎందుకు?"

"సమయం సందర్భంలేదు. కాస్త తెరిపిదొరికితే చాలు! సరసాల్లోకి దిగుతారు. ఎన్నిసార్లు చీవాట్లువేసినా బుద్ధిరాదు వీళ్ళకు. రెండు మూడుసార్లు ప్రాణాలపైకి తెచ్చుకున్నారు కూడా!"

"ప్రేమ గ్రుడ్డిదేకాదు! పిచ్చిది కూడా! అందుకే అలా ప్రవర్తిస్తారు?" అంది మంగళ.

"నీకెలా తెలుసు ఇవన్నీ!"

"ఏం నేను మనిషిని కానా? దొంగల్లో ప్రేమ ఉండవంటావా?"

ఇక ఆ సంభాషణ పొడిగించటం యిష్టంలేక నవ్వుతూ వుండిపోయాడు మేఘనాధ్.

అందరూ భోజనాలు చేశారు. ఆ రాత్రికి సెంట్రీ

"హోమ్ డెలివరీ"

1. మీరు 'హోమ్ డెలివరీ' సభ్యులుగా చేరితే, మీకు ప్రతి పత్రికపైన ఒకరూపాయి తగ్గింపు లభిస్తుంది. పైగా వాటిని పంపుటకు అయ్యే ఖర్చులన్నీ మేమే భరిస్తాము.

2. 'హోమ్ డెలివరీ' సభ్యత్వము పొందటానికి మీరు చేయవలసిందల్లా సభ్యత్వ రుసుము రు. 5/-లు పంపటమే. సొమ్ము చేరగానే మీకు సభ్యత్వము ఇవ్వబడుతుంది.

3. మీరు సభ్యత్వము తీసుకోగానే మొదటిసారి పంపేకాపీలు, అటుతర్వాత ప్రతి ఏడాది జనవరి నెల కాపీలు వి.పి. ద్వారా పంపబడుతాయి. డిసెంబరు నెల వరకు వచ్చే అన్ని సంచికలకు సెట్టుకు రు. 10/-లు చొప్పున లెక్కకట్టి, ఆ మొత్తానికి ఒకేసారి వి. పి. పంపుతాము. మిగతా నెలల కాపీలు మీకు బుక్‌పోస్ట్ లేదా రిజిష్టరు పోస్టులో అందజేయబడుతాయి.

4. ఏ కారణంచేతనైనా మీకు పంపిన వి.పి. తిరిగొస్తే, ఆ వి.పి. పైకము మొత్తం మీరు వెంటనే M. O. చేయాలి. లేనిచో మీ సభ్యత్వము అంతటితో రద్దవుతుంది.

5. 'హోమ్ డెలివరీ' వల్ల మీకు కాపీలు గ్యారంటీగా, త్వరితంగా చేరుతాయి. ఇండియాలో మీరు ఏ మారుమూలనున్నా ఖచ్చితంగా అందజేయబడతాయి. ఆ బాధ్యత మాది.

6. మీ చిరునామా మారినప్పుడు, మరియు జనవరి నెలలోను మీ సభ్యత్వము నెంబరు మారే అవకాశం వుంటుంది. కావున మీ పాకెట్‌పై మీ పేరుకు ముందు వుండే క్రొత్త నెంబరును గుర్తించ కోర్తాము.

7. ఏ కారణంగానైనా 25వ తేదీలోపల మీకు పత్రికలు చేరకపోతే, ఆ విషయం మాకు తెలుపండి. వాటి బాధ్యత మేము తీసుకుంటాము. ఉత్తర ప్రత్యుత్తరాలలో మీ నెంబరు వ్రాయటం మాత్రం మరచిపోవద్దు. మీ నెంబరు వ్రాయకున్నా, 25 తేదీలోపల తెలిపినా— అవి పరిశీలనకు తీసుకోబడవు.

ప్రతినెలా V.P. కావాలనేవారికి

సెట్టు రు. 15/లు చొప్పున పంపబడుతుంది.

డ్యూటీ మేఘనాథ్‌కు వేశారు.

"దాదా! అతనికి ఆరోగ్యం బాగులేదు. పైగా తలకు దెబ్బకూడ తగిలింది. అతని బదులు నేను చేస్తాను డ్యూటీ!" అన్నాడు కాలా.

"అక్కర్లేదు. నాకు బాగానేవుంది! నేనే చేస్తాను" అన్నాడు మేఘనాథ్.

"ఆడ మగ ప్రేమించుకోవడం చూశాం. కానీ మగాడ్ని మగాడు ప్రేమించడం యిక్కడే చూస్తున్నాం!" అన్నాడు కిశోర్.

"మాటలు జాగ్రత్తగా రానీ" అన్నాడు కాలా.

"మీ యిష్టం! అనవసరంగా గొడవలు పెట్టుకోకండి. లక్ష్యసాధన ముఖ్యం. దానికి ఐకమత్యం అవసరం!" అన్నాడు దాదా.

మేఘనాథ్ తుపాకీ తీసుకుని నెగడ వద్దకు వెళ్ళి, లావు పాటి కొయ్యమొద్దు నొకదాన్ని లాక్కొని కూర్చున్నాడు.

కాలా తుపాకి తలక్రింద పెట్టుకుని వెల్లకింతలా పడు కుని పైన ఆకాశంలో చల్లగా, తెల్లగా, మెరిసిపోతూ నక్షత్ర కన్యల నడుమ కొలువుతీరిన చందమామను చూస్తూండిపోయింది.

43

నడచి నడచి అందరికీ కాళ్ళు పీక్కుపోతున్నాయి. వెలుగును మింగే చీకటి పడమటి కొండపైకెక్కి భూమి పైకి దూకుతూంది.

ఎవ్వరికీ ఎక్కడా నీళ్ళజాడ కనుపించలేదు. ప్రయాణం ఆపి విశ్రాంతి తీసుకునేందుకు అనువైనస్థలం కూడా ఏదీ కనుపించలేదు. ముందుకు నడుస్తూనేవున్నారు.

"ఇంకెంతదూరం నడవాలి?" అడిగాడు కాలా.

ముఖచిత్ర వ్యాఖ్యల పోటీ

ఈ నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలను పరిశీలించండి. రెండు ముఖచిత్రాలకు (1. అట్టమీది బొమ్మ, 2. అట్ట చివరి బొమ్మ) సంబంధం వుండేట్లుగా చక్కని వ్యాఖ్యలను ఒక్క మాటలోగాని, చిన్న వాక్యంలోగాని వ్రాసి పంపండి.

ఒక్కొక్కరు ఎన్ని వ్యాఖ్యలైనా పంపవచ్చును. మీ వ్యాఖ్యలు పోస్టు కార్డుపైన మాత్రమే వ్రాయాలి. సప్లిమెంట్‌కు వ్యాఖ్యలను పంపేవారు విడిగా వేరొక కార్డుపై వ్రాసి పంపాలి. 'హోమ్ డెలివరీ' సభ్యులు అయితే తమ నెంబరును విధిగా వ్రాయాలి.

అత్యుత్తమమైన వ్యాఖ్యలు పంపిన ఇద్దరు పాఠకులకు ఏడాదిపాటు పత్రికను (లేదా 6 నెలలపాటు పత్రిక మరియు సప్లిమెంట్‌ను) బహుమతిగా పంపుతాము. మీ వ్యాఖ్యలు 5-6-'85 తేదీ లోపల మాకు చేరాలి. ఫలితాలు అగస్టు '85 నెల సంచికలో ప్రకటిస్తాము.

ఏప్రెల్ పోటీ ఫలితాలు

(1) ఏప్రెల్ '85 నెల "అపరాధ పరిశోధన" ముఖచిత్రాలకు బహుమతి పొందిన వ్యాఖ్య:

ఎందుకు మీకు యీ కక్షలు!
వింతగ వున్నాయి మీ వస్త్రాలు!!

పంపినవారు: శ్రీమతి వింజమూరి సుబ్బలక్ష్మి, 8-4-32, శ్రీ కిషన్ కాలనీ, వరంగల్—506 002.

(2) "సప్లిమెంట్"కు బహుమతి పొందిన వ్యాఖ్య:

మృత్యు లీల!
హత్య లేల!!

పంపినవారు: శ్రీ రంగా వెంకటేశ్వర్, బి.కాం., 6-1-63, గాంధి చౌక్ ఏరియా, బెల్లంపల్లి—504 251.

"ఏమో? ఈ ప్రాంతాలకు నేను కూడా క్రొత్తవాణ్ణే. ఎక్కడైనా నీళ్ళు కనుపిస్తాయేమోనని చూస్తున్నాను" అన్నాడు దాదా.

"మనదగ్గర నీళ్ళు కూడా పూర్తి గావచ్చాయి." అంది అపర్ణ.

"నాకు ఆకలిగా లేదు. అలసటగా వుంది. పడుకుని విశ్రాంతి తీసుకోవాలనిపిస్తూంది. తినేందుకేమీ లేకున్నా ఫరవా లేదు. ఈ పూటకు విశ్రాంతి తీసుకుందాం. తెల్లవారగానే లేచి వెళ్దాం!" అన్నాడు కృష్ణమూర్తి.

"ఇవి వెన్నెల రాత్రులే. చల్లగా వుంటుంది. మెల్లిగానైనా ముందుకు నడవడం మంచిది. ఎక్కడో ఒకచోట నీళ్ళు దొరక్కపోవు. ఏమంటావ్ దాదా?" అడిగాడు మేఘనాధ్.

కిశోర్ ఏం మాట్లాడలేదు. అతనికి ఏం చెప్పాలన్నా భయంగావుంది. మకాంపెట్టిన ప్రతిచోటా ఏదో గొడవ అతనివల్ల జరుగుతూ రావటంతో అతని స్థితి అధ్వాన్నంగా వుంది.

"ఇంకొంత దూరంవెళ్ళి చూద్దాం! మెల్లిగా నడవండి!" అంటూ తన నిర్ణయాన్ని తెలిపాడు దాదా.

అందరు కారడవిలో కాళ్ళు ఈడ్చుకుంటూ, ముందుకు సాగారు.

దూరంగా ఎక్కడో ఎర్రగా వెలుగు కనిపించింది. అందరూ దానికేసి చూశారు. మళ్ళీ అడవిలో మంటలు లేచాయేమో ననుకున్నారు. గాలి నిలకడగావుంది. మంటలు ముందుకు వస్తున్నట్లుగా తోచలేదు. నిలబడి మండుతున్నట్టుగా వున్నాయి.

"ఆ మంటలు చూస్తే ఎవరో నెగడువేసుకుని మకాం

శ్రీ మహాలక్ష్మి వారు ప్రచురించిన
'అపన' సీరియల్స్!

1.	కైలాస నగరం	శ్యాంబాబు	15-00
2.	ఖైదీ	ఏ.వి. మోహన్రావ్	20.00
3.	అతీంద్రియ శక్తులు	రమణశ్రీ	18.00
4.	కాంచన గ్రహం	వాణిశ్రీ	17.00
5.	నరాంతకులు	వసుంధర	13.00
6.	అమానుషం (అడుగు ముందుకు వేస్తే చస్తావ్!)	,,	15.00
7.	మల్లెలు—మందారాలు (రక్తపు టేర్లు)	,,	17.00
8.	నిను వీడని నీడను నేనే (గుడ్డి దర్బారు)	,,	16.00
9.	శాన్యోరా	ముద్దా సురేష్	20.00
10.	సాగరలోయ	బొమ్మిడి అచ్చారావు	17.00
11.	కళ్యాణ దుర్గం	,,	(త్వరలో)

అడ్వాన్సుతోపాటు నేడే మీ ఆర్డరు పంపండి.

ఫోన్ నెం: 63322

శ్రీ మహాలక్ష్మి బుక్ ఎంటర్ప్రైజస్

గవర్నరు పేట :: విజయవాడ - 2.

చేసినట్లుగా లేదూ ...?" అడిగాడు కిశోర్.

"అదే ఆలోచిస్తున్నాను. నిర్జనమైన ఈ ప్రదేశంలో ఎవరు మాత్రం ఎందుకుంటారు?" కృష్ణమూర్తి తన అనుమానాన్ని వ్యక్తపరిచాడు

"బందిపోటు దొంగల ముఠాలాంటిదేమో?" మేఘనాథ్ అన్నాడు.

"కాదు! బందిపోట్లకు వాళ్ళ స్థావరాలుంటాయి. వాళ్లిలా అడవిమధ్యలో ఆగి మకాంపెట్టరు" అన్నాడు కాలా. వాళ్ళగురించి వెలిబుచ్చిన అభిప్రాయం అందరికీ సమ్మతంగా వుంది.

"మనం ఆ వెలుగు వేపుకు మెల్లిగా వెళ్దాం. దూరం నుంచి గమనించి చూద్దాం. మనదగ్గర ఆయుధాలున్నాయి. అవసరమైతే వాళ్ళతో తలపడదాం!" అన్నాడు దాదా.

ఎవ్వరూ అందుకు ఎదురు చెప్పలేదు. తుపాకులు విప్పుకుని, సేఫ్టీకాచ్‌లు రిలీజుచేసి, సిద్ధంగా పట్టుకొన్నారు. మెల్లగా ముందుకు నడిచారు. ఒక కిలోమీటరు నడవగానే ఆ మంట దగ్గరగా వచ్చింది. దూరంనుంచే చూశారు. మంటల వెనుక ఒక అడవిజాతి మనిషి కూర్చునివున్నాడు. అతని చేతిలో విల్లమ్ములున్నాయి. కొయ్యమొద్దు మీద కూర్చుని వున్నాడు. దాని కానించి పెట్టిన పొడవుపాటి కత్తి ఎర్రటి మంట వెలుగులో పసుపుపచ్చగా కనుపించింది. అతని వెనుకాతల ఆకులతో వేసిన చిన్న పందిరి వుంది. దాని క్రింద కొంతమంది మనుషులు అడ్డదిడ్డంగా పడుకునివున్నారు. —(ఇంకా వుంది)

Edited and Published by S. DAMODAR REDDY
3-4-554 Narayanaguda, Hyderabad-500 029,
and Printed at Kranti Press, Madras-600001.

Blank Page


Regd.no: H/HD-48
PRABHAKAR